భారతి

మే 1973

వ్యవస్థాపకులు:

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938–1972)

★

మే 1973

సంపుటము : 50 : సంచిక : 5 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మే 1973

ఆవేదన

శ్రీ జి. వి. సుబ్బారావు

[రామప్ప శిథిల దేవాలయమును సందర్శింపగా కలిగిన ఆవేదన]

*నీ తాళమ్ములు మూగవోయినవి, నీ, నీ, మద్దెలల్, నృత్తవే
ళా తీవ్రత్వము డించికొన్నవి, కళా లాస్యమ్ము లంతమ్ములై,
నీ తారుణ్యము కాలగర్భమున నిర్జీవమ్మునై పోవ, దే
వీ! తాదాత్మ్యము జెందినావొ? శిలవై, విన్యాస రాహిత్యవై!

నీ పలుకుల్ వినంబడునొ? నీ మృదులాధరలాస్య సంపదన్
తీపులు చుమ్మచుట్టునొ? సతీ! పదచాలన మాధురీ గతిన్
మై పులకల్ వహించునొ? విశాల విలోచన! దివ్య భంగిమ
ప్రాపిత నృత్తవైభవము బాయునొ? హత్తిన మెత్తగుండియన్.

ముగ్ధమోహన చుంబన స్నిగ్ధమధువు,
అధర ఫలకమ్మునందున బదిలపఱచి,
గత రహో రమ్యభావ సంస్మృతుల దవిలి,
అద్దమఱచేత బూనెదొ? ముద్దరాల!

నీ కర మింత లింతలుగ, నీ పద మంతలు, నంతలంతగా,
నీ కనుగొల్కు బల్కులుగ, నీ కుచయుగ్మపు వంపు సొంపులన్
భీకరవృత్తి దున్మిన, నిరీక్షిత నేత్రి! హృదంత రాళము
వాకలుగట్టె శోక రసవాహిని, గద్గదమయ్యె కంఠమున్!

మూగవియంచు నెంతురు, విమూఢులు! నీ శిథిలాల ప్రోవులో
దాగిన శిల్ప మూర్తులను, దాచిన దాగని నృత్యరీతులన్
రాగము, తాళమున్, లయయు, రంజిల దివ్య మనోజ్ఞగీతులన్
స్వాగత మిచ్చు, శిల్పరస భామిను లంను నెఱుంగ లేరొకో!

|నీ చెవి గోసినారు, రమణీయ ఘలం ఘల కంఠఘంటికా
సూచిత సూత్రవైభవము, స్రుక్కడగించి, త్యజించినారు, నా
రాచమువోని శృంగ మధురాగ్రము, వమ్ముగ జేసినారు, సం
కోచము లేక, నీదు కను కోసలు శూన్యము జేసినారహో !

పరమేష్ఠి, జగదంబ, పరవశమ్మున, నేగు
మూపురమ్మది, నేడు మ్రుక్కలయ్యె !
రజతాచలస్వచ్ఛ రమ్యసానువులందు,
క్రుమ్ములాడెడి కొమ్ము, వమ్ము నయ్యె !
వీరభద్రావేశ విహరణ సమయాన,
విదలించు ఖురమగ్గి విదళితమయ్యె !
ప్రమథాది గణముల, ప్రథమ శ్రేణీ చిహ్న
ముత్తుంగ వాలమ్ము, చిత్తునయ్యె !

తల్లి కరస్పర్శ, పులకించు పుల్లతనువు,
కర్కశాఘాత శ్రిణముల కఱకుదేలె !
నీవి నీల దృగంతాల తీవియెల్ల
లాల గర్వాన దైన్య సాఫల్య మయ్యె !!

* 'శిల్ప సుందరి, † నంది.



పూలకూర్పరి చిత్రకారుడు: శ్రీ. వై. బాలయ్య.

ఏఱువ సింహాసనము - నల్లగొండ

శ్రీ తేరాల సత్యనారాయణ శర్మ

ఇటీవల 'భారతి మాసపత్రికలో' నల్లగొండ జిల్లాలోనున్న ఏఱువ చోళుల శాసనములు కొన్ని ప్రకటించుచు పరిశోధకులైన శ్రీ బి. ఎన్. శాస్త్రి గారు వారి వంశ వృక్షపట్టిక నొకదానిని అందు ప్రకటించిరి.[1] ఏఱువ వంశమునకు చెందిన తెలుగు చోళులనగానే బద్దెన చోళమహారాజు, ఏఱువ తొండయ ఏఱువ భీముడు, చోడభక్తిరాజు, అన్నచోడదేవుడు మొదలైన పరాక్రమవంతులైన రాజులెందరో గుర్తుకు రాకతప్పదు. శ్రీ శాస్త్రిగారు చూపిన వంశవృక్ష పట్టికలో వారెందుకు వదిలివేసినది కారణము తెలియదు గాని కొన్ని చారిత్రక పరిణామములకు సంబంధించిన వ్యక్తుల పేర్లు అందులో వదిలివేయబడినవి. ప్రస్తుతము నల్లగొండ మండల చరిత్రకు దాని పరిసర ప్రాంతముల చరిత్రకు ఈ తెలుగు చోళుల చరిత్ర ఎట్లు ప్రాముఖ్యము వహించుచున్నదో తెలుసుకొనుట దీని లక్ష్యము.

పశ్చిమ చాళుక్యుల రాజ్యకాలములో నల్లగొండతో గలుపుకొని తెలంగాణమందు పెక్కుమాండలికములు సంపాదించి సామంతులుగా రాజ్యము చేసినవారు తెలుగు చోళులు. కావేరీ తీరప్రాంతముల నుండి వచ్చిన ఈ ఈ వంశస్తులు సూర్య వంశోద్భవులు. కరికాల చోడుడు ఈ వంశములో ప్రధాన పురుషుడని ఈ వంశమువారు చెప్పుకొందురు. క్రీ. శ. ఆరవ శతాబ్దినుండియు ఈ వంశస్తులు తెలుగు దేశములోనికి వలసవచ్చి తమ పరాక్రమ శౌర్య ప్రతాపములచే పెక్కుమాండలికములు సంపాదించి పరిపాలించిరి. దేశ ఆచార వ్యవహారములందు స్థానికులతో పూర్తిగా కలిసిపోయిరి. ఆయా ప్రాంతములలో చిరకాలమైన వీరి నివాసమునుబట్టి వీరికి పాకనాటి చోళులని, పొత్తపినాటి చోళులని, వెలనాటి చోళులని ఆయాప్రాంతములను బట్టి పేరు వచ్చినది. కృష్ణానదిని దాటి తెలంగాణములో స్థిరపడిన మరి యొక చోడశాఖవారందరికి 'తెలుగు చోళులని' ప్రసిద్ధి గలిగినది. ఇందులో ఏఱువ వంశమునకు జెందిన తెలుగు చోడశాఖ యొకటి ఇటు తెలంగాణ మందును, అటు కృష్ణాకావలను మిక్కిలి ప్రాముఖ్యమునకు వచ్చినది. క్రీ. శ. ఎనిమిదవ శతాబ్దము నుండియు వీరి శాసనములు తెలంగాణమందు ఎక్కువగా కనిపించుచున్నవి.

తెలుగు చోళులు మొదట నల్లగొండ జిల్లాలోని ఏలేశ్వర ప్రాంతములపై (ప్రస్తుతము నాగార్జునసాగరు జలాలలో మునిగిపోయినవి) అధికారము సంపాదించి, క్రమముగా దానిని కన్నెనాడు లేక కందూరునాడను పిలవబడు మహబూబునగరు జిల్లాకు విస్తరించి, దానితోపాటే కొలనుపాక ఏడువేల నాడును, కొండపల్లినాడును సంపాదించి, ముఖ్యస్థలమైన పానుగల్లు—నల్లగొండ పట్టణములో తమ రాజధానిని స్థిరపరచి ఏఱువ సింహాసనమని దానికి పేరు పెట్టిరి. ఇందులో పానుగంటిని మొదట పరిపాలించినవాడు ఏఱువ తొండయ మహారాజు. ఈతనికన్న ముందు వల్లభచోడ మహారాజు (క్రీ. శ. 966) ఇరుగన చోడ మహారాజు (1057) బద్దెనచోడ మహారాజు (1067, 73) ఈ ప్రాంతములను పరిపాలించి నట్లు శాసన దృష్టాంతములు కొన్ని యున్నను తరు

1. భారతి ఆగస్టు 1970.

వాత వచ్చిన ఈ ఏఱువతొండయరాజుకు వారికిని వంశ సంబంధములు తెలియకపోయినందున ఈ వంశములో మొట్టమొదటివానిగా తొండయరాజునే గుర్తించుట జరుగుచున్నది.

ఏఱువతొండయరాజు పశ్చిమ చాళుక్యరాజైన ఆరవ విక్రమాదిత్యునినుండి (క్రీ శ. 1076 లో కొలనిపాక ఏఱువేల నాడును, పానుగంటిని పరిపాలించు అధికారము సంపాదించినట్లు నల్లగొండ జిల్లాలోనున్న అతని శాసనములు పెక్కు తెలుపుచున్నవి.[2] అనగా తనతోపాటు సామంతుడైన కాకతి రెండవ బేతరాజున కితడు సమకాలీనుడు. కాకతీయులకువలెనే తొండరాజు ఓరుగంటికి దక్షిణమందు బలమైన చోళరాజ్యమును స్థాపించుటకు ప్రయత్నములు గావించెను. ఈతని తుది శాసనము క్రీ. శ. 1088 లోనిది. తొండయరాజునకు భార్య లెందరో తెలియరాలేదు కాని ఈతని పట్ట మహిషియైన మైలాంబికాదేవి క్రీ. శ. 1124 లో పానుగంటియందు రెండు దానశాసనములు, క్రీ. శ. 1121 లో ద్రాక్షారామందొక దానశాసనము ఇచ్చి యున్నది.[3] శాసనములనుబట్టి వీరి కడ కాలాముఖ శైవమునకు చెందిన రామేశ్వర పండితుడు, క్రియా శక్తి పండితుల వారొకరు నివసించినట్లు తెలియు చున్నది.

ఏఱువతొండయ – అతని సంతానము

పానగల్లులోనున్న ఒక శాసనమును బట్టి ఏఱువ తొండయ—మైలమ దేవులకు ఉదయనచోడ, భీమ చోడ, గోకర్ణ చోడులను ముగ్గురు పుత్రు లున్నట్లు తెలియుచున్నది.[4] కాని ఇందులో ద్వితీయు డైన ఏఱువ భీమునికి వంశ గతమైన ప్రస్తుత నామమేగాక తల్లినిబట్టి మైలమభీముడనియు, శాస నములలోని వర్ణనలనుబట్టి నల్లభీముడనియు పలు రీతులలో ఈతని పేరు వ్యాప్తమైనట్లు తెలియు చున్నది. శాసనములలోను, కొన్ని చాటు పద్యము లందును కనిపించు వాఙ్మయమునుబట్టి ఈతడు గొప్ప పరాక్రమశాలియడే. తెలుగునాడులోని పెక్కు ప్రాంతములు ఈతని ధాటికి గురియై గడగడలాడి పోయినవే. కడపజిల్లాలోని తాళ్ళప్రొద్దుటూరునందు శాసనస్థమైన ఒక పద్యములోను, మరికొన్ని చాటువు లందును ఈతని శౌర్య ప్రతాపము లిట్లు వర్ణింప బడినవి.

ఉ. పన్నితురంగ మంబునకుఁ
బక్కెర వెట్టిన వార్త
చారుచే, విన్నభయం బునం
గలఁగి వీసర నాఁ
డును చక్రగొట్టముల్,
మన్నియు పట్టణంబు
లును మంథ్యన వేంగి
కళింగలాది గా,
నిన్నియు నొక్క పెట్టగొనె
నేఱువభీమ వృపాలు ధాటికిన్.'

మైలమ భీమునిపై చెప్పిన కొన్ని చాటువులు.

చ. గరళపు ముద్దలోహ మవగాఢ
మహాశనికోట్లు
సమ్మెటల్, హరు నయనాగ్ని
కొల్మి యురగాధిపు
కొఱలు పట్టుకార్లు ది, క్కరణి
శిరంబు దాయ
లయకాలుఁడు కమ్మరి వైరి వీర
సం, హరణ గుణా
భి రాముఁడగు మైలమ భీముని
ఖడ్గ సృష్టికిన్.

చ. అహితులఁ దాకి పోరునెడ నంబుధి కల్గిన
నాఁటి రాముగోఁ గ్రహణము నాఁటి పార్థు
గడగాఁ గౌరవు నేసిననాఁటి భీమునా, గ్రహ

---

2. AP. AS. No. 361—62 మరియు 62—63; A. P. A. S No. 22. 1965 మూడు శాసనములు, కొప్పోలునందొకటియు అప్రకటితములు.

3. H. A. S. 19. P. 114; H. A. S 13—2. P. 105—109 మరియు S. i. i. Vol. 1V No. 1216.

4. H. A. S. 13.2. P. 105-109.

మెసఁగం బుర(త్రయము గాల్చిననాఁటి లలాట
లోచనున్, మహి నుపమింపఁగాఁ దగునె వెలమ
భీముని భీమ వి(క్రమున్'

ఈ పద్య ములలో వర్ణింపబడిన ఏఱువ భీముడే నల్లభీముడని లేక వెలమ భీముడని తలచుటకు వాఙ్మయము, కొంతవరకు శాసనములు అందలి కాలము సహాయపడుచున్నను దానిని స్థిరపరచుటకై మరికొన్ని ఉపపత్తు లింకను గావలసియున్నవి. ఈ విషయములో నల్లభీముడనే చోడరాజు ఒకడున్నట్లు గుర్తించుటకు అమరాబాదులోనున్న శాసన మొకటే చాలును.[5] అందులో రాజు పట్టమహిషియైన 'దీనమదేవి క్రీ. శ. 1105 లో రామేశ్వరదేవుని దూవ దీపములకై దానము చేయుచు నల్లభీమచోడుని పత్నులలో తాను ముఖ్యపత్నియైనట్లు చాటుకొని యుండెను. దీని వలన నల్లభీమదేవునికి ఇంకా ఇతర భార్యలు గలరని తెలుచున్నది. దీనికి తరువాత వచ్చిన ఏఱువ చోడ భక్తిరాజు, అతని పుత్రుడైన అన్న చోడదేవుని కంద్వకొలను,[6] రాజమహేంద్రవర శాసనములందు[7] వీరి వంశమునకు మూలమైనవాడు నల్లభీమదేవచోడుడని తెలుపబడినది. దీనినిబట్టి పానుగంటిలోని ఏఱువ చోడభీముడు లేక నల్లభీమచోడుడు ఏఱువ భక్తిరాజుకు మూలపురుషుడైన నల్లభీమచోడుడు ఇద్దరు భిన్నులు గాక ఒకరే గావచ్చునని చారిత్రకుల విశ్వాసముగా నున్నది. కాని దీని నంగీకరించుటకు ముందు కొన్ని చిక్కులు ఇంకా దొలగవలసి యున్నవి.

అమరాబాదు శాసనములో నల్లభీమునికిగల భార్యలందు 'దీనమదేవి' ముఖ్యమైనదని తేలినది. కాని కంద్వకొలను, రాజమహేంద్రవర శాసనములలో ఈ నల్లభీముని పత్నిపేరు ప్రోలాంబికా దేవిగా చెప్పబడినది. అనగా నల్లభీమునికి తక్కిన భార్యలలో నొకర్తెగా ఈమెను భావింపవచ్చును. భక్తిరాజు మొదలైనవారి సంతతి కీమెయే కారణము గావచ్చును. కాని పై వాటిలో రాజమహేంద్రవర శాసనమందు ఈ నల్లభీముని తల్లిపేరు అన్నమాంబగా చెప్పబడినట్లు గానవచ్చుచున్నది. అప్పుడితడు మైలాంబిక పుత్రుడు గాడనియు తొండయ రాజాకు అన్నమాంబకు గలిగిన పుత్రుడనియు లేదా మైలాంబికా దేవికే అన్నెమాంబయని మరొక పేరున్నట్లుగాని ధృవపడవలసిన అవుసరమున్నది.

నల్లభీముని సంతతి వంశ వృక్షము

ఏఱువ భీమ లేక నల్లభీమ=ప్రోలాంబిక
|
దాము=లక్ష్మి
|
సోమ=సూరాంబిక
|
గంగాధర=ఇరుగాంబిక (వేంగభూపతి సోదరి)
|
కామరాజు లేక భక్తిరాజు=అన్నెమాంబిక
|

భీమలింగము (అనవోతారెడ్డి సోదరిని వివాహమాడెను.)

అన్నచోడ దేవుడు =ఇరుగాంబిక (పినఉండిరాజు సోదరిని వివాహమాడెను.)
|
వీరభద్రుడు

5. H. A. S. 19. P. 42.
6. భారతి. Vol. XV. 1. PP. 147. ff, Sii. Vol. IV No. 1117, 1127 మరియు 1039.
7. EP. Ind. Vol. XXVI. PP. 14. ff.

కాకతి రుద్రదేవుడు—ఏఱువ చోళులు

పశ్చిమ చాళుక్యుల క్రింద సామంతులైన ఏఱువ చోళులకు వారి క్రిందనే సామంతులుగానున్న కాకతీయులకు రెండవ ప్రోలరాజువరకు మైత్రీ సంబంధము లుండినట్లు శాసనములు తెలియజేయుచున్నవి. రెండవ ప్రోలరాజు తైలపదేవుని ఓడించి స్వాతంత్ర్యము వహించిన మొదటి దినములలో కొండపల్లి పైకివచ్చిన గోవిందరాజును ఓడించి ఆ రాజ్యమును తిరిగి ఉదయన చోడరాజున కిచ్చెను.8 అప్పటినుండి వీరు కాకతీయులకు సామంతులు. కాని రుద్రదేవుడు అధికారములోనికి వచ్చుసరికి అప్పటి పరిస్థితులు కొన్ని మారిపోయినవి. కాలము ననుసరించి చూచినచో రుద్రునికి సమకాలికులైన వారు రెండవ ఉదయనచోడుడు ఈతని పుత్రులైన భీమ, గోకర్ణచోడులు రాజ్యము చేసినట్లు కనిపించుచున్నది. రాజ్యకాంక్షా వ్యామోహములవలన భీమ గోకర్ణు లిరువురు స్వాతంత్ర్యము వహించి అవిధేయతను ప్రకటించిరి.

స్వార్థచింతనగల భీమరాజు భోజన సమయమందు తన సోదరుడైన గోకర్ణుని పైననే కత్తి దూసి అతనిని వధించెను. అంతేగాక సవతి తల్లితో సహితము ఈతడు పొందుగావించెనట. దుర్మార్గుడైన ఈతనిని రాజ్యమునుండి వెడలగొట్టుటకై రుద్రదేవుడు సైన్యముతో బయలుదేరిపోయి వర్ధమానపురమును సంపూర్తిగా గాల్చివేసెనట. పరాజయమందిన భీమచోడుడు తన కుటుంబముతో సహా పట్టణము వదలి అడవులలోనికి పారిపోయెనని క్రీ. శ. 1162 లో వచ్చిన రుద్రదేవుని హనుమకొండ శాసనము చెప్పుచున్నవి. ఈ శాసనమునుండియే కాకతి రుద్రుడు ఉదయనచోడుని పుత్రికయైన పద్మావతీ దేవిని వివాహమాడినట్లు చెప్పుటకు కొంత ఆధారము సహితము లభించుచున్నది.9

పండితారాధ్యుడు—పానుగంటి విషయము

వర్ధమానపురమునుండి భీముడు పారిపోయిన వెంట ఆ ప్రాంతములన్నియు క్రమముగా గోనవంశపు రెడ్ల అధికారములోనికి రాసాగినవి. మొత్తముపై అప్పటినుండి చోళ సామంత రాజ్యములు క్షీణదశకు రాసాగినవి. ఇందుకు అప్పటి సాంఘిక పరిస్థితులు సహితము కొన్ని తోడ్పడినవి.

పాల్కురికి సోమనాథుడు రచించిన పండితారాధ్య చరిత్రమునుబట్టి పానుగంటిలో అప్పుడు జరిగిన కొన్ని పరిణామము లిట్లు తెలియవచ్చుచున్నవి. పానుగంటిలో ఉదయన చోడరాజు పరిపాలించుచుండగా పండితుడు, శైవమతాచార్యుడునైన పండితారాధ్యుడు బసవేశ్వరుని దర్శనార్థమై వెలనాటిచోడుని రాజ్యము వీడి పానుగంటి పట్టణమునకు చేరుకొనెను. పండితుని కవట బండారు గోవింద ప్రగ్గడ, ధవళేశు నామయ్య లను శిష్యవరులుండిరి. ఇందులో ధవళేశు నామయ్య ఉదయావనీశుని లెంక గూడ. అతడు తన సహజైక లింగనిష్ఠావృత్తి జరించుచుండగా సాటిలెంకగాండ్లెవరో ఈతనిపై 'మీ తమ్మను బారవైచు నాతడొక గొప్పభక్తుడ నంచు తిరుగుచున్నాడని ప్రభువుకడ కొండెములు చెప్పిరి. తక్షణమే రాజతనిని బిలిపించి తన ఎదుటనే తన తమ్మను (ఉమ్మిని) దినుమని యాజ్ఞాపించెను. దానికి ధవళేశు నామయ్య నిరాకరించి రాజు తనను దండింపక మునుపే తన తలను తా నరికి వేసుకొని ప్రాణములు వదిలెను.

ధవళేశు నామయ్య నేలగూలుట, శివభక్తవరులకు అపచారము జరుగుట మొదలైన వార్త పండితునికి శూలమువలె దాకెను. అతడు మిక్కిలి కోపోద్రిక్తుడై 'పుత్ర, కళత్ర, బంధు, మిత్ర సమేతముగా రాజవుడే కుంగెడు గాక' యని శపించును. పండితుని శాపవహ్నికి రాజట్లే ఆహుతి యయ్యెను. ఈ సంఘటనల నన్నిటిబట్టి చూడగా లోగట వెలనాటి చోడుడు పండితునితో విరోధము వహించి ఎట్లు అణగారి పోయెనో అట్లే ప్రస్తుతము పానుగంటి ఉదయావనీశుడు సహితము పండితుని కోపా

---

8. H. A. S. 19. P. 128-30 and H. A. S. 13.2 p. 8-20.

9. 'కందురోదయ చోడవంశ విలస క్షీరాబ్ధి గర్భోద్భవ త్పద్మైకాశ్రయ రుద్రదేవ నృపతేః కిం వర్ణ్యతే విక్రమః'

(హనుమకొండ శాసనము)

గ్నికి గురియై శివభక్తిపరులు కొనసాగించిన అంతర్విప్లవములో కొట్టుకొనిపోయి రాజ్యభ్రష్టుడయ్యెనని చెప్పవచ్చును. అప్పటికే కందూరునాడులోని అధిక భాగము జారిపోయినది. పానుగంటి సంఘటనతో కొలనుపాకనాడు ఉత్తర భాగములు పోయినవి. మిగిలినదిక 'పేరూరు'వంటి చిన్నమండలములే. అది గూడా నామమాత్రావశిష్టమై క్రీ. శ. 1235 కు గాని కానవచ్చుట లేదు. 1178 లో వచ్చిన వెనుకటి శాసనము తరువాత తిరిగి 1235 లోనే గానవచ్చుచున్నవన్నచో 57 సంవత్సరముల విరామకాలము రాజ్యక్షీణ దశకు ఒక నిదర్శనమని చెప్పవచ్చును.

క్రీ. శ. 1235 నాటికి భీమ ఉదయాదిత్యులవి, క్రీ. శ. 1282 నాటికి రామనాథ దేవ చోడునివి కొన్ని శాసనములు నామమాత్రముగా నల్లగొండ మండలమందు కనిపించుచున్నప్పటికిని కందూరు రాజ్యము అప్పటికే గోనవంశపు రెడ్లవశమైనది. క్రీ. శ. 1195 నాటికే పిల్లలమఱ్ఱియందు రేచర్ల రెడ్డి సేనాపతుల శాసనములును, జలాలుపురము, ఇద్దంపల్లిలందు చెఱకు జగదాళురెడ్లును క్రీ. శ. 1250 ప్రాంతములనుండి గంగసాహిణియు, నల్లగొండ మొదలైన తెలుగు మండలములన్నియు చేపట్టి పరిపాలించినట్లు వారి శాసనములన్నియు చాటుచున్నవి. పైన ఉదాహరించినట్లు భీమ ఉదయాదిత్యుల శాసనములు కొన్ని కనిపించుచున్నను, కాకతీయులకు వారు నామమాత్రపు సామంతులే అయియుండిరని చెప్పవచ్చును. తమ శాసనములలో కాకతిరాజుల ప్రస్తావన సహితము వీరు విడిచిపెట్టుట చూడగా రుద్రమదేవి కాలమునకు వీరు పూర్తిగా తమ ప్రాధాన్యము కోలుపోయి రాజ్యాధికారము సహితము వదులుకొని యుండిరని తెలియుచున్నది. చోడుల తరువాత నల్లగొండ మండలమును సామంతరాజులలో ఏదో ఒక ప్రధానమైన వంశముగాక, కాయస్థరాజులు, యాదవ ప్రభువులు, రెడ్డి సామంతులెందరికో ఇది ఆలవాలమైనది. కాకతిరాజ్య పతన కాలములో పానుగల్లును పరిపాలించిన సామంతరాజు యాదవ ప్రభువైన సారంగపాణి దేవుడు, అతని నాయకులు గలరు.

ఏఱువ వంశస్థులైన తెలుగు చోళులకు కొన్ని విషయములందు మిక్కిలి ప్రత్యేకత యున్నది. వారు సుదూర ప్రాంతములనుండివచ్చి నివాసములేర్పరచుకొని పరిపాలకులైనను స్థానికులందు కలసిపోయిరి. తెలుగు చోడులను ప్రశస్తికి సహితము వచ్చియుండిరి. దేశీయమైన తెలుగు భాషకు మిక్కిలి తోడ్పాటు గలిగించి దాని ఉనికికి, మనుగడలకు, గౌరవాదులకు కారణమైరి. మనకు లభించుచున్న మొట్టమొదటి తెలుగు శాసనము ఈ చోడ వంశీయులదే. ఆంధ్రావళి కంతటికి మోదమునుగూర్చిన తిక్కన మహాశయుడు చోడమనుమసిద్ధి నాశ్రయించి గణపతి చక్రవర్తిని సహితము పులకింపజేసియున్నవాడె. పదుగురిచే ప్రాచీనుడని కొనియాడబడుచున్న 'కుమార సంభవకర్త' నన్నెచోడుడు కవిరాజశిఖామణియె. వేములవాడ భీమకవి, సుమతిశతకకర్త బద్దెన చోడుడు ఇందులో పేర్కొనవలసివారే. ఇట్లెన్నియో అంశములు చోళ చరిత్రయందు ముడిపడి యున్నవి. సామంతులైనను తెలుగుచోళుల పరిపాలన తెలంగాణమునకును ముఖ్యముగా నల్లగొండ మండలమునకు దాని సంస్కృతి చరిత్రయందు ఉపయోగపడినదని చెప్పవచ్చును. ఆయా శాసనముల ఆధారమును గైకొని ఇచ్చట తెలుగు చోడుల వంశ వృక్షమొకటి చూపబడుచున్నది.

ఏరువ తొండయ చోళ మహారాజు(1)
=మైలాంబికాదేవి(2) (1176,77,88. A. D.)
(1121, 24 A D)

1 ఉదయన
1 సోమనాథ దేవ
1107 A D.

1 భీమ లేక
నల్లభీమ=దీనమ్మదేవి(3)
1105, A D

1 గోకర్ణదేవ(4)
1115,18,21
A. D.
2 ఉదయన
1162, 76 AD

2 భీమ (5)
1178 A D.
2 సోమనాథ దేవ

2 గోకర్ణ
1178 A D

3 ఉదయాదిత్య(6)
1235 A D.

3 భీమ
1235 A D.
వీరమల్లినాథదేవ
రామనాథదేవ(7)
1282 A D.

వివరములు :

(2) పట్టికలో చూపినట్లు మైలాంబిక తన ముగ్గురు పుత్రులను శాసనములందు పేర్కొనినది.

(5) రెండవ గోకర్ణ దేవరాజు తండ్రి ఉదయనుడని, తాత గోకర్ణుడని శాసనములందు పేర్కొనబడినది.

(6) మల్లెపల్లి, ఇద్దంపల్లి, పడమటిపల్లి శాసనములందు వీరి తండ్రి సోమనాథ దేవునిగా పేర్కొనబడినందున ఈతడు రెండవ సోమనాథుడగుచున్నాడు. (భారతి. ఆగస్టు 1970)

(7) ఆగా మోతుకూరు శాసనమందు ఈతని తండ్రి వీరమల్లినాథ చోడదేవునిగా పేర్కొనబడెను. ఇవన్నియు ఎక్కువ నల్లగొండ జిల్లాలోనివి. మరికొన్ని మహబూబునగరు జిల్లాలోనివి.

వంశవృక్షమునకు అడ్డమువచ్చు మరికొన్ని పేర్లు ఆయా శాసనములందు కలవు. కాని వాటి సంబంధము కలుపుటకు అందుకు తగిన ప్రమాణము లేవు. పై కాలములు వారి వారి శాసనములలో పొందుపరచబడినట్టివి.

ధ్వంసరచన

శ్రీ సీరపాణి

ఆశయ జ్యోత్స్నల అన్వేషణలో
ఇరుల ఉరులలో తగుల్కొన్న
ఈ ఆశాజీవులు—
విశ్వ రచయిత చేతిలో
ఔచితిని కోల్పోయిన పాత్రలు
ప్రగతి పథంలో పయనించబోయి
విఘాతాల ప్రఘాతాలకు బలియైన
ఈ అనాథులు—
విశ్వ శిల్పి అంచనా వమ్మయి
వికలాంగులైన జగన్నాథులు
సమతా భవితవ్య నిర్మాణ సాహసకృత్యంలో
సగం నలిగిపోయిన ఈ అనూరులు—
భువన చిత్రకారుని
సుందర భావనా వికృతికి
భగ్న సమాధిలో వికృతులై మిగిలిపోయిన
పిచ్చిగీతలు
స్వార్థవిపిన విచ్ఛేదనా సంకుల సమరంలో
ఎదురు దెబ్బలకు విలవిలలాడే
ఈ అంతరంగాలు—
అనురాగపు తీగె తెగిన
వర్తమాన వల్లకీ సంగీతంలో ధ్వనించిన
అపస్వర తరంగాలు

పిట్టకథ

శ్రీ కలువకొలను సదానంద

ప్రపంచంలో ఏముందో ఎదుటి వారికి తెలియదు.

ఆ ప్యాకెట్టు చూడ ముచ్చటగా వుంది. పసుపుపచ్చని ఉల్లిపొర కాగితంతో, ఎర్రటి సిల్కు రిబ్బనుతో—కొత్త పెళ్లి కూతురిలా వుంది.

ఉరకలువేసే యౌవనంలాగా ఉల్లాసంగా పరుగిడుతూంది రైలు. ఉదయభానుడు మబ్బులమీద వెండిబెత్తం ఝళిపిస్తున్నాడు. నీ రెండలో మిసమిసలాడుతూ ముసిముసినవ్వులు నవ్వుతున్న పైరు పచ్చలు కళ్లకు చల్లదనాన్నిస్తున్నాయి. ఆ పైరు పచ్చల కమ్మని వాసన చల్లగాలితో జతకట్టి రైలు పెట్టెల్లోకి చొరబడి ప్రయాణీకుల గుండెలకు హుషారు నిస్తున్నాయి.

రైలుపెట్టెలో—కిటికీ ప్రక్కన ఓ యువకుడు కూర్చుని వున్నాడు. వయస్సు దాదాపు పాతికేళ్లుండవచ్చు. మడతలు చెరగని యిస్త్రీ బట్టలు తొడుక్కుని వున్నాడు. అతడి కళ్లు పసిపాప కళ్లకు మల్లే అందంగా, అమాయకంగా వున్నాయి. అతని చేతిలో ఓ కాగితం వుం . అని పెళ్లి పత్రిక. కొన్ని క్షణాల క్రితం అది అతడి చొక్కా జేబులో వుండింది. ఇంకెవరగా చూడటానికి వీలులేకుండా అతడు దాన్ని ఒళ్లో పెట్టుకుని, అప్పుడప్పుడూ అందులోకి చూచి సన్నగా—చాల సన్నగా నవ్వుకుంటున్నాడు. ఆ నవ్వు అంతలోనే మాయమై పోగా, తల ప్రక్కకు త్రిప్పి కిటికీలోంచి ఏ దూర తీరాలనో చూస్తున్నాడు.

...అతని ప్రక్కనే ఆ ప్యాకెట్టు వుంది.

అతని ఎదుట మరో వ్యక్తి కూర్చున్నాడు. అతని క్రాపు చెవుల దగ్గిర కాస్త నెరిసిపోయి వుంది. వయస్సు—ఆ యువకుడికంటే పదిహేనేళ్లు ఎక్కువే వుండవచ్చు. అతని చంకలో విలువైన కెమెరా ఒకటి వ్రేలాడుతోంది. అతని చూపులు— పరుగిడుతూన్న సుందర దృశ్యాలమీదికి, ఎదుట కూర్చున్న యువకుడి మీదికి ఎగురుతూ, యువకుడి ప్రక్కనున్న ప్యాకెట్టు మీదికి మళ్లీ మళ్లీ వచ్చి వాలుతున్నాయి.

వాళ్లిద్దరూ ఐదు నిమిషాల క్రితం కాస్త ముందు వెనుకగా చిత్తూరులో రైలెక్కారు. ఇద్దరూ కొద్దిపాటి ముఖపరిచయంవున్న వాళ్లేమో—ఒకరినొకరుచూచి చిరునవ్వు నవ్వుకున్నారు.

ఆ పెట్టెలో—వాళ్లున్న అరలో ఇంకెవరూ లేరు.

కెమెరా వుంచుకున్నతను చిన్నగ దగ్గి, కుతూహలంగా అడిగాడు. 'ఆ ప్యాకెట్టులో ఏముంది... రాజారావ్?'

యువకుడు ఉలికిపడి తలపైకెత్తాడు. బోగీ అంతా కలయజూస్తూ 'ఎవర్నండీ? నన్నేనా?... నా పేరు రాజారావ్ కాదండీ, రాజారాం' అని, పెళ్లి పత్రిక మడిచి జేబులో వుంచుకుని, ప్రక్కనున్న ప్యాకెట్టును చేతిలోకి తీసుకుని చిరునవ్వు నవ్వాడు.

'మా చెల్లాయి పంపిందండీ యిది! ఇందులో ఏముందో అంత సులభంగా తెలియదు మరి! ప్యాకెట్టు లోపల ప్యాకెట్టు. ప్యాకెట్టు లోపల ప్యాకెట్టు...పొరలన్నీ అలా విప్పుతూ పోతే, ఆఖర్న...అబ్బే, ఇప్పుడు చెప్పకూడదు లెండి!'

'నాకు తెలుసులే! వెండిపాలాడ కదూ?'

రాజారాం అనబడే ఆ యువకుడు ఔననలేదు' కాదనలేదు.

'పాలాడ కాకుంటే, ఓ బుల్లిపాపాయి బొమ్మ!'

రాజారాం కంట్లో కొంటెనవ్వు తప్ప, జవాబు లేదు.

'అదీ కాదంటే, పెళ్లికొడుక్కీ, పెళ్లికూతురుకీ తగూ పెట్టటానికి ఒకే ఒక చాక్లెట్! అంతే కదూ?'

'అబ్బే! క్షమించాలి! మీరు మరీ మొహమాట పెట్టేస్తున్నారు...పూర్తిగా విప్పేవరకు ఎవరితోనూ చెప్పకూడదని మా చెల్లాయి ఒట్టేయించుకుంది.'

రాజారాం ఆ రెండో మనిషిని పేరుపెట్టి సంబోధించటం లేదు. బహుశా అతని పేరేమిటో స్పష్టంగా తెలిసివుండకపోవచ్చు.

రైలు ముత్తరేవుల స్టేషన్‌లో ఆగి, మళ్లీ తొందర తొందరగా కదిలింది. ఫోటోగ్రాఫరు రిస్టు వాచీలోకి చూచుకుంటుంటే, 'టైం ఎంతయిందండీ?' అని అడిగాడు రాజారాం.

'ఆరూ, యాభై!'

'ఏడున్నరకల్లా పాకాలకు వెళ్ళిపోవచ్చు కదూ?'

'రైల్వే టైంటేబిల్ ప్రకారమే అయితే!'

'ఫరవాలేదు. ముహూర్తం ఎనిమిది గంటలకు!'

'ఎక్కడ పెళ్ళి? పాకాలలోనేనా?'

'పాకాల దగ్గిరే—గొల్లపల్లి.'

ఏవో ఆలోచనలతో ఫోటోగ్రాఫరు కనుబొమలు ముడిపడ్డాయి. 'గొల్లపల్లిలోనా! ఎవరి పెళ్ళికి?'

'చిలకమ్మ పెళ్ళికి!'

ఫోటోగ్రాఫరు కొంతసేపు మౌనంగా వుండి, మళ్ళీ ప్రశ్నించాడు: 'అంటే నువ్వు పెళ్ళికూతురి వైపు చుట్టమన్న మాట?'

సరైన సమాధానంకోసం కొంతసేపు తడుము కున్నాడు రాజారాం. 'చుట్టాన్ని కాను. అయితే చుట్టం అనిపించుకోటానికి చుట్టరికం వుండితీరాలా? వుండనవసరం లేదనుకుంటే నేను చుట్టాన్నే! ఆ మాటకొస్తే చుట్టంకంటే ఎక్కువే!'

'తమాషాగా వుంది! అయితే, ఆ అమ్మాయి నీ స్నేహితురాలా?'

'ఆ అమ్మాయికి నేను స్నేహితుణ్ణి! ఆమె డేగలపాలు కాకుండా రక్షించిన వాణ్ణి! ఆమెకు యిక ఏలాంటి అపాయమూ వుండదు. ఆమె తల్లిదండ్రులు 'హరీ' మనేంతవరకూ నన్ను స్మరిస్తూ వుంటారు. ఇప్పుడామె పెళ్లికి వెడుతున్న నాకు రెండు వారాల క్రితంవరకు చిలకమ్మ ఎవరో తెలియదు. అంతకు ముందెప్పుడూ ఆమెను నేను చూడలేదు...అదంతా ఓ చిత్రమైన కథలెండి...'

కథ వినడానికి కుతూహలం చూపుతున్న వాడిలా ఫోటోగ్రాఫరు ముందుకు వంగి కూర్చున్నాడు. రాజారాం సిగ్గుపడుతూ, మధ్య మధ్య చిరునవ్వులు నవ్వుతూ చెప్పసాగాడు.

కొత్తకోటనుంచి అతని చెల్లాయికి ఓ సంబంధం వచ్చింది. వరుణ్ణి, వియ్యాలవారి స్థితిగతుల్ని చూచి వద్దామని రెండు వారాలక్రితం అతను కొత్తకోటకు వెళ్ళాడు. వెళ్లినపని పూర్తి చేసుకుని, ఆ రాత్రి రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. రైలు తొమ్మిది గంటలకు వచ్చింది. అతను ఓ చిన్నపెట్టెలోకి ఎక్కాడు. ఆ పెట్టెలో రెండు అరలున్నాయి. తిరుపతినుండి తిరిగి వస్తున్న ఓ కన్నడ కుటుంబం మొదటి అరను ఆక్రమించుకుని వుంది. లోపలి అరలో—మూసిన కిటికీ ప్రక్కన ఓ పద్దెనిమిదేళ్ల అందమైన అమ్మాయి కూర్చుని వుంది. ఆమెకు కాస్తదూరంగా యిద్దరు మోటురకం యువకులు కూర్చుని వున్నారు. రాజారాం చెక్కగోడకు ఆనుకుని ముందర దారిలోనే నిలబడ్డాడు.

లోపలి అరలో కూర్చున అమ్మాయి ఒంటరి ప్రయాణీకురాలన్న విషయం—కొన్నిక్షణాల తర్వాత అవగతమైంది అతనికి.

ముందర అరలో కూర్చున్న వాళ్లు తమలో తాము కన్నడంలో ఏమిటో అసహనంగా మాట్లాడు కుంటున్నారు. వాళ్ల అసహనానికి కారణం లేకపోలేదు. లోపలి అరలో ఆ అమ్మాయి దగ్గిర చేరిన యువకు

లిద్దరూ ఆమెను ఏడిపించుకు తింటున్నారు. బూతు పాటలు పాడుతున్నారు. మోటుసరసాలు విసురు తున్నారు. 'మీదేవూరు, ఎక్కడికెళ్తున్నావు, తోడె వరా లేరా, మా వెంట వస్తావా' అంటూ గాలం వేస్తున్నారు. ఆ అమ్మాయి మౌనంగా వుంది. ఒక వైపు కోపంతో వుడికి పోతున్నా—వాళ్ళ ఆకతాయి తనాన్ని భరిస్తూ నిస్సహాయంగా కూర్చుంది.

ఉన్నట్లుండి ఆమె గొంతు బోగి అంతా మారు మ్రోగింది. 'ఛీ, పశువులారా! అవతలికి పోతారా, రైల్లోంచి దూకమంటారా?'

రాజారాం యిక వుండబట్టలేకపోయాడు. విసురుగా లోపలి అరలోకి నడిచి, 'ఏమైంది? ఏమిటీ గోల?' అన్నాడు తీక్షణంగా. అతనితోబాటే మైసూరు వాళ్లంతా బిలబిలమంటూ పైకి లేచారు. ఆ పడుచు వాళ్లిద్దరూ బొమ్మల్లా కూర్చునివున్నారు. 'ఏమైందీ? ఏమీ లేదే!' అన్నాడు ఒకడు.

'ఏమమ్మాయ్? ఏం చేశారు వీళ్ళ?'

ఆ అమ్మాయి చేతుల్లో ముఖం దాచుకుని బావురుమంది. 'మైన చేతులు వేస్తున్నారు...'

'ఇదేం గ్రహచారంరా బాబూ! వుత్తపుణ్యానికే మనమీద అభాండాలు వేస్తూందే! మంచిజగజ్జాణే!' అన్నాడు ఒకడు రెండోవాడితో.

'మనం లేచినవేళ బాగా లేదు అన్నాడు రెండో వాడు.

'నేనూ గమనిస్తున్నాను మీ చేష్టలు! ఆడ పిల్ల ఒంటరిగా కనిపిస్తే చాలు ..'అంటూ కళ్ళ లోంచి నిప్పులు కురిపించాడు రాజారాం.

'అబ్బో! హీరో వూడిపడ్డాడురా బాబూ!'

రెండోవాడు కిసుక్కుమన్నాడు.

'లేచి అవతలికి వెడతారా, వెళ్ళరా'

'టిక్కెట్టు కొన్నాం తెలుసా? మా యిష్టం వచ్చినచోట—కూర్చుంటాం!'

'సరే! కూర్చోండి! పక్కస్టేషన్‌లో దిగి, రైల్వే పోలీసును పిలుస్తాను. తరవాత వాడి కిష్ట మైనచోట కూచోబెడతాడు.'

ముత్తిరేవుల స్టేషన్‌లో రైలు ఆగగానే వాళ్ళిద్దరూ బుద్ధిమంతుల్లా రైలు దిగి, మరో పెట్టెవైపు నడిచారు.

రాజారాంకు అర్థంకాని భాషలో కన్నడులంతా అతన్ని అభినందించారు.

కట్టుబట్టలతోవున్న ఆ అమ్మాయి కెదురుగా కూర్చున్నాడు, అతను. 'తోడులేకుండా రాత్రిపూట యిలా ప్రయాణం చేయవచ్చా?' అన్నాడు.

ఆమె కొంగుతో కళ్ళొత్తుకుని నేల చూపులు చూడసాగింది.

అతడు ఆమె మీద ప్రశ్నలవర్షం కురిపించాడు

'ఏ వూరు మీది?'

'ఎక్కడికి వెళ్తున్నావు?'

'నీ పేరేమి?'

'మీ అమ్మా నాన్నా ఎవరు?'

'ఎక్కడ రైలెక్కావు?'

ఒక్క ప్రశ్నకు కూడా ఆమె జవాబు చెప్పలేదు.

'ఇంట్లోనుంచి పారిపోతున్నావా?' అంటూ అతను ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు.

కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే, ఆమె తలవంచు కుంది.

'ఎందుకు పారిపోతున్నావ్?'

అతనివైపు కోపంగా చూచి 'చావటానికి!' అంది.

'చావటానికి యింతదూరం రావాలా?'

అతను ఒకటి రెండు నిమిషాలు మౌనంగా వుండి యిలా అన్నాడు: 'చూడమ్మాయ్! చేతులు కాలిన వెనుక ఆకులు పట్టుకుని లాభం లేదు. ముందే బాగా ఆలోచించుకో! ఇలా రైల్లో కూర్చుని ఎందాకా వెడతావు? ఎక్కడుంటావు? ఈ రాత్రి ఎక్కడ గడుపు

తావు? ఈ ఒక్క రాత్రితోనే బతుకు తెల్లారిపోదు. ఇలాంటి పాడురాత్రులు ఎన్నో వున్నాయి. ఆడది ఒంటరిగా బతకటం తమాషా కాదు. నేనేదో మాయ మాటలు చెబుతున్నాననుకోకు. లోకంలో అందరూ చెడ్డవాళ్ళు కాదు. మంచివాళ్ళు కూడా కొందరున్నారు. ఈ రాత్రి మా యింట్లో వుండు. మా అమ్మ, మా చెల్లాయి నీకు తోడుగా వుంటారు. నువ్వు ఎప్పుడు వెళ్ళిపోవాలంటే అప్పుడు వెళ్ళిపోవచ్చు... నీ మీద ఈగ వాలదు...ఏమంటావ్?'

'ఊహూఁ!' అందామె.

చిత్తూరుస్టేషన్‌లో రైలు ఆగింది. అతను పైకి లేచాడు. ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూస్తూ కొంతసేపు నిలబడ్డాడు. రైలు కూత వేసింది.

'సరే! నేను దిగిపోతున్నాను. జాగర్త!' అనేసి, అతను రైలు దిగాడు.

కదులుతోన్న రైలులోంచి ఆమె గబుక్కున క్రిందికి దిగింది.

'టిక్కెట్టుందా?'

'లేదు.'

అతడు గేటువైపు వెళ్ళలేదు. ఆమెను వెంటబెట్టుకుని రైలుపట్టాల ప్రక్కగా నడిచి రోడ్డు మీదికి వచ్చాడు. కొంగారెడ్డిపల్లిలో వున్న తన యింటికి ఆమెను తీసుకుపోయాడు.

జరిగిన సంగతంతా తల్లికి చెల్లాయికి చెప్పాడు. ఆ అమ్మాయి మొహమాటపడుతూ భోజనం చేసింది. అతని తల్లి, చెల్లెలు చెరొక వైపున అంగరక్షకుల్లా పడుకోగా, ఆదమరచి నిద్రపోయింది.

ఆ రాత్రంతా అతను నిద్రపోలేదు. ఏ చిన్న అలికిడి వినిపించినా, ఆ అమ్మాయి వెళ్ళిపోతున్నదేమోననే శంకంతో లేచి కూర్చునేవాడు.

తెల్లవారింది...

ఇంతవరకూ చెప్పి హఠాత్తుగా ఆగిపోయాడు రాజారాం. ఏవో జ్ఞాపకాలు అతని కథనానికి అంతరాయం కలిగించినట్లున్నాయి.

'ఆపేశావేం?' అన్నాడు ఫోటోగ్రాఫరు.

'మా చెల్లాయి కొంటెతనం గుర్తు కొచ్చింది. అది వుత్త వెర్రి బాగులపిల్లలెండి. ఆ రాత్రి కంటి మీద కునుకులేక ఆలస్యంగా నిద్రలేచాను మా చెల్లాయి ఆ అమ్మాయికి జడవేస్తూ కూర్చుని వుంది. నేను మంచంమీద కూర్చుని కళ్ళు నులుముకుంటుంటే 'నాకు పెళ్ళి కొడుకును చూచివస్తానని సాకు చెప్పి, కుందనపు బొమ్మలాంటి వదిన్ని వెంటబెట్టుకొస్తావా అన్నయ్యా!' అంటూ పరాచికాలాడింది. ఆ మాట యింకోసారి అంటావా?' అంటూ దాని చెవి నులిమేశాను...'

...ఆ రోజు రాజారాం ఫ్యాక్టరీకివెళ్ళి, సాయంకాలం యింటికి తిరిగి వచ్చాడు. ఆ లోపున ఆ అమ్మాయి తాలూకు రహస్యం ఒక్కటిమాత్రం తెలుసుకో గలిగింది అతని చెల్లాయి. అదేమిటంటే— ఆమె పేరు చిలకమ్మ అని.

చిలకమ్మ ముఖంలో బెంగ మాసిపోయింది. ఇంటి పనుల్లో తానూ పాలుపంచుకోసాగింది. నవ్వుతూ హుషారుగా కబుర్లు చెప్పుకుంటూ ఆ కుటుంబంలో తానొక వ్యక్తిలాగా కలిసిపోయింది.

రెండు రోజుల్లో ఆమె కథంతా పూర్తిగా తెలుసుకోగలిగాడు రాజారాం. అన్నీ అతని చెల్లాయికి ఆమె స్వయంగా చెప్పినవే!

సిరిసంపదలు లేకపోయినా, పనీపాటూ చేయకుండా బతుకు వెళ్ళదీసే బుద్ధిశాలురు ప్రపంచంలో కొందరున్నారు. పాకాల శివార్లలోని గొల్లపల్లిలో కూడా అలాంటి వ్యక్తి ఒకడున్నాడు. అతని పేరు వీరభద్రయ్య. అతని కూతురే చిలకమ్మ. చిలకమ్మకంటే పెద్దవాడొకడు, చిన్నవాడొకడు వున్నారు. పెద్దవాడెప్పుడూ ఇంటిపట్టున వుండడు. ఇంటి గొడవలు పట్టించుకోడు. క్లబ్బులు అని పిలువబడే మారుమూల గదుల్లో కూర్చుని చీట్లపేక లాడుకుంటూ వుంటాడు. డబ్బు లేనప్పుడు గ్లాసెడు టీనీళ్ళకోసం— కనిపించిన వాళ్ళనల్లా బతిమాలుకుంటూ వుంటాడు. చిన్నవాడు కాస్త

బుద్ధిమంతుడు. సారాయి అంగడిలో పనీపాటూ చేసుకుంటూ నెలనెలా నాలుగు రాళ్ళు తెచ్చి యిస్తున్నాడు.

చిలకమ్మ తల్లి భర్తకు వంతపాటపాడే ఉత్తమా ఇల్లాలు. కూతురి పెళ్ళి విషయంలో కూడా ఆమె అలాగే వంతపాడింది. ఆ వూళ్ళోనే వెంకట శివప్రసాదు అనే వాడికి ఆమె నిచ్చి పెళ్ళి చేయాలని అనుకున్నారు వాళ్ళు. వెంకట శివప్రసాదుకు పిల్ల నచ్చింది. అయితే పిల్లకు వెంకటశివప్రసాదు నచ్చలేదు. అతనిపట్ల ఆమెకు కొన్ని అభిప్రాయాలున్నాయి అతడు నలభై దాటినవాడు, రెండో పెళ్లివాడు, ముగ్గురు పిల్లల తండ్రి, పచ్చితాగుబోతు, ఊరినిండా అతనికి ముండలున్నారు.

ఆ వరుడు తనకు వద్దన్నది చిలకమ్మ. 'ఎందుకు వద్దు' డబ్బులేనివాడా? ఆస్తిలేనివాడా? ఇంతమంచి సంబంధం ముల్లోకాలు వెతికినా దొరుకుతుందా? నోరుమూసుకో!' అన్నారు తల్లిదండ్రులు.

చిలకమ్మ ఏడ్చింది. ఆమె ఏడుపు అరణ్యరోదనమే అయింది. ఇక గత్యంతరం లేక ఎవరికీ తెలియకుండా రైలెక్కింది.

చెల్లెలు చెప్పగా ఈ సంగతులన్నీ విన్నాడు రాజారాం. అతనికి ఈ కాలపు ఆడపిల్లల నిర్ణయాల మీద సదభిప్రాయం లేదు. చిలకమ్మలాంటి అర్భకురాలేమిటీ, తలలు పండిన తల్లిదండ్రుల మాటల్లో తప్పులు పట్టడమేమిటీ? బిడ్డల బాగోగులు కన్నవాళ్ళకు కదా తెలుసు? చిలకమ్మ వట్టి అమాయికపు పిల్ల. ఎవరో ఆమెను హడలగొట్టేసి వుంటారు లేనిని, పోనిని వూహించుకుని అనవసరంగా బెంగపడి పోయి వుంటుంది. ఆ వెంకట శివప్రసాదనే వాడు రెండో పెళ్లి వాడయితే కావచ్చుగాక; ఆ నేరానికే—తాగుబోతనీ, ముండల్ని మరిగిన వాడనీ వాడినెత్తిన అపవాదులు వెయ్యాలా?

చిలకమ్మను యింటికి తీసుకువచ్చి రాజారాం ఒక పెద్ద బాధ్యతను నెత్తిన వేసుకున్నాడు. అదేమిటంటే—ఆమెను సురక్షితమైన చోటికి చేర్చివేయడం. మూడో రోజున ఆమెకు తెలియకుండానే వీరభద్రయ్యకు ఉత్తరం వ్రాశాడతను. ఉత్తరం వ్రాసిన మరునాడే చిలకమ్మ తల్లిదండ్రులు, తమ్ముడు రెక్కలు కట్టుకునివచ్చి వాలారు.

'బాబూ! నీ మేలు జన్మలో మరిచిపోను.' అంటూ రాజారాం చేతులు పట్టుకున్నాడు వీరభద్రయ్య.

'చచ్చి నీ కడుపున పుడతాను నాయనా' అంది అతని భార్య.

చిలకమ్మ అతన్ని బూతులు తిట్టింది. 'కసాయివాడ! నన్ను నమ్మించి గొంతుకోశాడు తప్పించుకు పోతున్న దాన్ని లాక్కొచ్చి మళ్ళీ బోనులోకి తోశాడు. మాయలమారి!...వీడి ముఖం మండ!...'

ఆమె తల్లిదండ్రులు యింటికి రమ్మంటే, రానంటే రానని మొండికేసింది ఆమె. 'నా గొంతుకు ఉరితాడు వెయ్యటానికా రమ్మంటున్నార? ఇక్కడే ఏ నూతిలోనైనా తోసేసిపొండి. నాకొద్దు' ఆ పెళ్లి' అంటూ ఏడ్చి గోలపెట్టింది.

'పిచ్చిపిల్ల! నువ్వు యింతగా వద్దంటుంటే, మేం మాత్రం నిన్నెందుకు బలవంతం చేస్తాం? నిన్ను చంపుకోవడం మాకు యిష్టమనుకున్నావా? వద్దులే ఆ పెళ్లి!' అంటూ బూరడించింది ఆమె తల్లి.

'ఇక పెళ్లి మాసెత్తితే ఒట్టు!...నీకు నచ్చిన వాడెవడొస్తాడో, వాణ్ణే చేసుకుందువుగానీ!' అన్నాడు వీరభద్రయ్య.

చిలకమ్మ శాంతించింది.

ఆ రోజే తన వాళ్లవెంట—నవ్వుతూ వెళ్లిపోయింది.

కథ చెప్పడం ఆపి, రాజారాం మైమరచి కూర్చున్నాడు. కొంతసేపటికి పరధ్యానంలోంచి తేరుకుని, చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నించాడు.

'మా చెల్లాయండీ— చిలకమ్మను సాగనంపుతూ వాకిట్లో నిలబడి 'మళ్ళీ రావాలి వొదినా!' అంది. చిలకమ్మ కోపగించుకోలేదు. 'దేవుడు చల్లగాచూస్తే'

అని నవ్వుతూ వెళ్ళిపోయింది. మా చెల్లాయి అలా అనడం ఏం బాగాలేదుకదూ? అది పుత్తడిబొమ్మలాంటి పిల్లండీ!...'

రైలు పాకాల ఔటర్ సిగ్నల్‌వద్ద కాస్సేపు ఆగింది.

రాజారాం తొందర తొందరగా అన్నాడు: ఇప్పుడీ తమాషా చూడండీ; చిలకమ్మ తనకు వెంకట శివప్రసాద్ వద్దన్నదా? నీకు నచ్చినవాణ్ణే చేసుకుందువులే అని వీరభద్రయ్య అన్నాడా? ఇప్పుడు చిలకమ్మకు పెళ్ళి జరుగుతున్నదా? వరుడు ఎవరోకాదు. సాక్షాత్తూ ఆ వెంకట శివప్రసాద నామధేయుడే! దీన్నిమీరు ఎలా కామెంట్ చేస్తారు?'

రైలు మళ్ళీ కదిలేదాకా ఆలోచించాడు ఫోటోగ్రాఫరు. 'ఆడవాళ్ళను అర్థం చేసుకోవడం మహా కష్టంబాబూ!...ఆమెకు వెంకటశివప్రసాద్ అప్పుడు నచ్చలేదు. ఇప్పుడు నచ్చాడు.'

రాజారాం వెంటనే ఏదో చెప్పబోయి మాను కున్నాడు. తరవాత తాపీగా యిలా అన్నాడు: 'అంతే, అంతే!...'

స్టేషన్‌లో రైలు ఆగగానే ప్యాకెట్టు చేతికి అందుకుని పైకి లేచాడు రాజారాం. అతనికంటే ముందు ఫోటోగ్రాఫరు ప్లాట్‌ఫారం మీదికి దిగాడు.

'ఇక నాకు సెలవండీ!' అన్నాడు రాజారాం, వెనుకనుంచి.

'ఆగవయ్యా బాబూ! మీ చిలకమ్మ పెళ్ళికి నేనూ వస్తాను.' అన్నాడు ఫోటోగ్రాఫరు.

'మీరూ వస్తారా ?!'

'పెళ్ళికొడుకు తరఫున ఆర్డరొస్తే, ఫోటోలు తీయటానికి వచ్చాను. నీ ప్యాకెట్‌లో ఏముందో పెళ్ళిలోనే చూస్తాన్లే!'

'మీరు భలేవారండీ!'

ఇద్దరూ టిక్కెట్ కలెక్టరుకు టిక్కెట్లిచ్చేసి, ప్లాట్‌ఫారం కొసవరకూ నడిచి, రైలుపట్టాలన్నిటినీ దాటుకుని, ఉత్తరంవైపుగా నడవసాగారు.

ఫోటోగ్రాఫరు రిస్టువాచీలోకి చూచి 'ఏడూ, ముప్పైఅయిదయింది. ఏడుమ్ముప్పావుకల్లా అక్కడుంటాం.' అన్నాడు.

మూడు ఫర్లాంగుల దూరాన గుట్ట వుంది. గుట్టప్రక్కన పల్లె కనిపిస్తోంది. గ్రాపు కాగితంలోని వంకరటింకర గీతలా వున్న ఎగుడుదిగుళ్ళ కాలిబాట వెంబడి నడిచి పల్లెను సమీపించారు వాళ్ళు.

లౌడ్‌స్పీకర్ల కోలాహలం లేదు.

పల్లెలో ప్రవేశించారు.

మంగళవాద్యాల హంగామా లేదు.

ఎదురుపడిన మనుషుల ముఖాల్లో నల్లని నీడలు!

వీధిలోని పచ్చని పందిరి బోసిగా కనిపిస్తోంది. పందిరి వెనుకనున్న పూరింటిలోనుంచి సన్నగా ఏడ్పులు వినవస్తున్నాయి. ఇద్దరూ జనాన్ని నెట్టుకుంటూ లోపలికి వెడుతూంటే, బయట బెంచీమీద చతికిలబడిన మధ్యవయస్కుడొకాయన రాజారాంవైపు చురచురా చూశాడు.

లోపల చలనరహితంగా పడివున్న పెళ్ళికూతురి మీద వాలి ఒకస్త్రీ రోదిస్తూ వుంది

పెళ్ళి ముహూర్తం దగ్గరపడింది.

*　　*

'గూటిలో చిలాకేదిరా?...

అన్నా,

గూడూ చిన్నాబోయెరా!...'

...బోగీలో బిచ్చగాడు పాటపాడుతున్నాడు.

'గార్డు ఈలవేసి ఐదునిమిషాలయింది. ఎనిమిదిమ్ముప్పావు దాటినా ఇంకా బయలుదేరి చావనంటోంది, పాడురైలు!' అంటూ విసుక్కుంటున్నాడు ఓ ప్రయాణీకుడు.

కిటికీ దగ్గర ఒదిగి కూర్చున్నాడు రాజారాం. ఎదురుగా ఫోటోగ్రాఫరు.

కిటికీ బయట ప్లాట్‌ఫారంమీద ఓ పదిహేనేళ్ళ కుర్రవాడు నిలుచున్నాడు. అతడి క్రాపు చిందర

వందరగా వుంది. ముఖంలో విషాదచ్ఛాయలు అలుముకుని వున్నాయి. అతడు రాజారాంవైపు చూస్తూ కొంతసేపు అలాగే నిలబడ్డాడు. చివరికి గొంతు పెగుల్చుకుని యిలా అన్నాడు: 'మా అక్కయ్యరాసిన ఉత్తరం అందలేదూ మీకు?'

'...లేదు!' రాజారాం గొంతు జీరబోయింది.

'...నేనే పోస్టుచేశాను.'

ఆ మాటకు రాజారాం ఏమీ చెప్పలేదు.

'మా అక్క ఎవర్ని పెళ్ళాడాలని పట్టు బట్టిందో తెలుసా?'

రాజారాం కళ్ళు రెపరెపలాడాయి. తలవంచుకున్నా డతను.

'అందరూ పెడచెవిని పెట్టినవాళ్లే! నెమలి కంట్లో నీళ్ళుకారితే వేటగాడికి తాపమా?...దాని తల రాత అలావుంటే, ఎవరు మాత్రం ఏంచేస్తారులెండి...'

రైలు కూతవేసి కదిలింది. క్రమంగా వేగాన్ని పుంజుకొన్నది.

రాతి బొమ్మలా కూర్చున్న రాజారాం కొద్దిగా కదిలాడు. జేబులోంచి పెళ్లిపత్రికను బయటికి తీశాడు. దానితోబాటు ఓ పోస్టుకార్డు. వాటిలోకి తదేక దృష్టితో చూస్తూవుంటే, అతని కళ్లలో నీళ్లు క్రమ్ముకోసాగింది. మోకాళ్లను దగ్గరగా చేర్చుకుని వాటిమీద తలవాల్చి, ముఖం దాచుకున్నాడు. అతని చేతిలో వున్న కాగితాలు రెండూ జారి క్రిందపడ్డాయి.

ఫోటోగ్రాఫరు ముందుకువంగి వాటిని తీసుకున్నాడు. ఒకటి రెండు క్షణాలు తటపటాయించాడు. అయినా కుతూహలాన్ని చంపుకోలేక పోయాడు.

కార్డులో ముచ్చటగా మూడు పంక్తులున్నా .

'ఇష్టంలేని పెళ్లి చేసుకోమంటున్నారు. నన్ను మళ్లీ ఈ పంజరంలోకి తరిమావు. నన్ను కాపాడే వాళ్లు యింకెవరున్నారు?—చిలకమ్మ.'

ఆ దస్తూరీలాంటిదే పెళ్లిపత్రిక వెనుక వైపునకూడా కనిపించింది. 'నా పెళ్లికి తప్పక రావాలి!'

పెళ్లి పత్రికలోకి చూశాడు ఫోటోగ్రాఫరు అందులో 'వెంకటశివప్రసాద్' అనే ముద్రాక్షరాల మీద సిరాతో ఓ గీత, గీతకు కాస్తపైన అదే సిరాతో 'రాజారాం' అనే పేరు! అది చిలకమ్మ దస్తూరీకాదు. తన కలలకు రాజారాం ఆ అక్షరాలతో అలా రూపకల్పన చేశాడేమో!

పెళ్లికివస్తూ రాజారాం పట్టుకొచ్చిన ప్యాకెట్టు అతని ప్రక్కనే వదిలంగా వుంది. అందులో గుప్తంగా వున్నది ఏమిటో ఊహించగలిగాడు ఫోటోగ్రాఫరు.

దాని పేరు—ప్రేమ!



భావయానం

డా. ముదిగొండ శివప్రసాద్

మహాత్ముడు కాల్చబడటంతో
మానవత్వం ఆగిపోలేదు
రావణుడు చంపబడటంతో
రాక్షసత్వం తుదముట్టలేదు
జీససును శిలువ నెక్కిస్తే
చరిత్ర నంతా ఆక్రమించిందేమిటి క్రైస్తవం?

భగత్‌సింగ్ బలిదానంతో
భగభగలాడింది స్వాతంత్ర్య జ్వాల
అందుకే అంటున్నాను నేను
హత్యలతో హాలాహలం అరదు—
అమృతమూ ఆగదు
ప్రతీకారం పారదు
భావాగ్ని చల్లారదు.

భావాలకు బాహిర జగత్తు
ప్రత్యక్షమైన నామరూప ధారణం ఇస్తుంది.
పదార్థం యథార్థంగా భావాలను నౌకలా మోస్తుంది.
నౌక లేనంతమాత్రాన యానం
ఆలస్యమౌతుందేమో కాని
ఆగను మాత్రం ఆగదు
ఆవిష్కరణం నిలువదు

తెప్పకొయ్యల కాంతిరేఖల సాయంతోనైనా భావాలు
తరణం చేస్తాయి కాలసాగరాన్ని—
పరమేశ్వరుని సంతానానికి
బారసాలనాడు పెట్టిన పేర్లే
మన్నూ మిన్నూ నిప్పూ నీరూ!

ప్రతిఒక్క తారకా, ఆయన ఒక్కొక్క కోరిక—
జగత్తులోని ప్రతిపదార్థం
ఒక సంకేతం భావానికి.

చలమూ అచలమూ జీవమూ నిర్జీవమూ అన్నీ—
తాజమహల్ ఒక భావం
హిట్లర్ వేరొక భావం
అరవిల్ ఒక భావం
హరివిల్లూ ఒక భావమె!


కదలని రాళ్లూ రప్పలూ జడ భావాలు
కదిలే ప్రతి మనిషీ నడుస్తున్న ఒక్కొక్క భావానికి
ప్రతీక! పతాక!!

ప్రతి తనువూ ఒక నడిచే భావం
——జంగమ భావజ్యోతి.
ప్రతి తరువూ ఒక కదలని భావం
—స్థావర భావ జ్యోతి.

సాపేక్ష సిద్ధాంతం ఐన్‌స్టీన్ సృష్టికాదు
భూమ్యాకర్షణ న్యూటన్ కనుగొన్నదీ కాదు
అతిమానస సిద్ధాంతానికి అరవిందుడు జనకుడు కాదు
గీత శ్రీకృష్ణుని కల్పనా కాదు.
జనన మరణాలు లేకుండా,
నిత్యంగా ప్రవాహ గతిలో
నిలిచివుంటాయి భావాలు
ఆద్యంత రహితంగా—
ప్రతి దార్శనికుడూ ఒక ట్రాన్స్మిషన్ కేంద్రం
ప్రతి భావుకుడూ ఒక రేడియోసెట్టు
ప్రతి మనిషీ ఒక భావ వీణ
ప్రతి, క్రియా ఒక భావ ప్రసారం
జనన మరణాది సమస్త విశ్వక్రియా నిర్వాహకుడు
పరమేశ్వరుడే పెద్ద భావుకుడు
మహా 'కవి'!

భావయానం

తెలిసిందా ఇప్పటికైనా
దైత్యులను నిర్మూలించినంత మాత్రాన
దైత్యభావం నిర్మూలింప బడదని—
మహాత్మతా భావాన్ని వెన్నలా, వెన్నెలలా,
వర్షిస్తే ప్రకర్షిస్తే
క్షీరభావ నారాయణీయాన్ని మథిస్తే
మసిలా, మరకలా నిలిచిన చీకటి భావం
మరగున పడిపోతుంది
మరగి, కరగిపోతుంది—
అమృత వితరణం సాగుతుంది.



పండితరాయల శిరఃకంపాలు

డా. మహీధర నళినీమోహన్

కోకిల

పాణినికి పంగనామాలు దిద్దగల పాండితీ గర్వంతో జగన్నాథభట్టు రాజమహేంద్రవరం వెడుతూ దారిలో పలివెల సంస్థానాన్ని దర్శించబోయాడు. సభా ప్రవేశం త్వరగానే అయింది.

కుండనాల బరువుకి చెవులు సాగిపోయి బుజాలను తాకుతున్న పండిత వేషధారులు ఇద్దరు ఆసీనులై ఉన్నారు అక్కడ.

తాను ఫలానా అని చెప్పుకునే ఉద్దేశంతో ఇల్లా అన్నాడు జగన్నాథుడు.

మాది త్రైలింగాన్వయం. మహాలక్ష్మి, పేరమ భట్టు మా తల్లి దండ్రులు. విద్వాంసుల నుదురు మాడ్చి వెయ్యడంలో సిద్ధహస్తుణ్ణి. మీ పలివెల రాజ్యరమణీ మౌగ్ధ్యాన్ని చూచి ఆకర్షింపబడి ఇల్లా వచ్చాను.

పండితరాజుని. జగన్నాథు డంటారు నన్ను.

శార్దూల విక్రీడితం

త్రైలింగాన్వయ మంగళాలయ మహాలక్ష్మీ
దయా లాలితః
శ్రీ మత్పేరమ భట్టసూను రనిశం
విద్వల్లలాటం తపః
సైషశ్రీ పలివేల రాజ్యరమణీ
మౌగ్ధ్యస్పృహా కృష్యయః
శ్రీ మత్పండితరాజ పండిత జగన్నాథః
సముల్లాసితః.

సభా భవనం అంతా జగన్నాథుని గంభీర కంఠ ధ్వనితో ముఖరితమై పోయింది.

అక్కడి పండితులను కవ్వించే ఉద్దేశంతో 'విద్వల్లలాటం తపః' అని మరోసారి ఒత్తి ఒత్తి ఉచ్చరించాడు, వాళ్ల కళ్లలోకి చూస్తూ.

'సైషః' అనే శబ్దాన్ని కావాలనే ప్రయోగించాడు.

'ఏత త్తదోః సులోపోకో రనఞ్ సమాసే హలి' అనే పాణినీయ సూత్రప్రకారం ఏతచ్ఛబ్ద తచ్ఛబ్దములకు, నఞ్ సమాసము కానప్పుడు, హల్లు పరమైనప్పుడు, అకచ్ ప్రత్యయము రానప్పుడు ప్రథమా విభక్తి ఏకవచనములోని విసర్గలుగామారిన సకారం లోపిస్తుంది.

కనుక సః+ఏషః=స ఏషః అవాలి కాని సైషః అవకూడదు.

పలివెల సంస్థాన పండితులు ఈ శబ్దాన్ని అడ్డుకుని, తనని ఆక్షేపిస్తారని ఆశపడ్డాడు జగన్నాథుడు. అల్లాచేస్తే వాళ్ల పిలక తన చేతిలో చిక్కినట్లే అనుకున్నాడు.

కాని దాని సాధుత్వా సాధుత్వాల గొడవే వాళ్లకి తెలిసినట్లు లేదు.

ఇంక ఉండబట్టలేక 'సోచిలోపేచేత్ పాదపూరణమ్' అని అందించాడు.

ఇంతకు ముందు చెప్పిన సూత్రానికి ఇది మినహాయింపు. ప్రథమా విభక్తి ఏకవచనస్థ విసర్గలకు లోపం చేయడంవల్ల పాదపూరణం అవుతూ ఉంటే, అచ్చుపరమైనప్పుడు విసర్గలకు లోపంచేసి, తరువాతి సంధులు చేయవచ్చునని ఈ సూత్రానికి అర్థం.

ఈ సూత్రంవల్ల స్త్రైష శబ్దం సాధువే అవుతుంది. అక్కడి పండితులు అవునంటే తాను కాదు అందామనీ, వాళ్ళు కాదంటే తాను అవునందామనీ, ఈ విధంగా వాదంలోకి దిగి తన పాండిత్యాన్ని ప్రదర్శిద్దామనీ జగన్నాథుడు ఉబలాటపడ్డాడు.

'ఈ బొట్టికాయ ఎవడో ఇల్లా వాగుతూ ఉంటే ఇంకా ఊరుకుంటారేం?' అన్నట్లు ఆస్థాన పండితులవైపు చురుగ్గా చూశాడు రాజు.

ఇంక విజృంభించకపోతే బాగుండదని తోచింది వారికి. ఇంతవరకూ జగన్నాథుడు అన్నమాటలలో 'సోచిలోపేచేత్ పాదపూరణమ్' అనేది ఒక్కటే వాళ్ళకి లీలగా జ్ఞాపకం ఉంది.

'గోచి లోపేచేత్ పంచ చీరడం' అని సభా భవనం దద్దరిల్లి పోయేటట్లు అరిచేడు ఒక పండితుడు.

'ప్రాచి లోపేచేత్ నీళ్ళు చల్లడం' అన్నాడు రెండవాడు.

'బూచి లోపేచేత్ ఏడ్చి గెల్వడం' అన్నాడు మొదటివాడు.

'సంచి లోపేచేత్ బట్టపట్టడం' అన్నాడు రెండోవాడు.

ఈ విధంగా ఒకరి తరవాత ఒకరు చెడుగుడిలో తరుము గుక్కల్లా అందుకున్నారు.

వాళ్ళు దేన్ని గురించి మాట్లాడుతున్నారో జగన్నాథుడికి అర్థమే కాలేదు.

'కిం?' అన్నాడు

వెంటనే 'కిం—కం—ఢం—ఢిం—హ్రాం—హీం—ఫట్' అన్నారు వాళ్ళు రెట్టిస్తూ.

జగన్నాథుడు నిర్విణ్ణుడై పోయాడు. అతని వాలకంచూసి, తమ ఆస్థాన పండితులు అతని చిత్తుచేసేశారని అనుకుని, ప్రభువూ సదస్యులూ కూడా సంతోషించి, పెంకులు ఎగిరి పోయేటట్లు హర్షధ్వానాలు చేశారు.

అటువంటి చోట మాట్లాడబోవడం తనదే తప్పు అని గ్రహించి, నోరు కుట్టేసుకుని, సభాసదుల వెకిలి నవ్వులలోనుంచి దారిచేసుకుని, బయటికివచ్చిపడ్డాడు జగన్నాథుడు.

అది ఆషాఢమాసం.

దారిప్రక్క గుంటలలో మొన్నటి వర్షాలకి నిలిచిన నీళ్లల్లో గోదురు కప్పలు చెవులు పగిలేటట్టు పెద్దపెట్టున అరుస్తున్నాయి.

నిన్న మొన్నటివరకూ చెవుల తుప్పులు వదలగొట్టేసిన కోయిల కూతలు హఠాత్తుగా ఆగిపోయాయి.

ఏం చెప్మా?

ఆ—అర్థమైంది.

గోదురు కప్పలు అరిచేచోట కోకిల కూయకుండా నోరు మూసుకు కూర్చోవడం అంత ఉత్తమం మరోటి లేదు.

కోకిలా! నువ్వు చాలా మంచి పని చేశావు. నీకు తెలిసిన పాటి నాకు తెలియలేదే.

అనుష్టుప్

భద్రం భద్రం కృతం మౌనం
కోకిలైర్జల దాగమే
దర్దురా యత్ర వక్తార
స్తత్ర మౌనం హి శోభనమ్.

ఆటవెలది

మేలు మేలు! వానకాలమ్ము మొదలైన
కూతమాని మైచె కోకిలమ్ము
మౌన ముచిత మౌను మండూక షండమ్ము
గూబలదరు నట్లు కూయువేళ.

* * *

సింహం

జగన్నాథుడికి ఎదురు నిలువగల పండితుడు లేకుండా పోయాడు యావద్భారతంలోనూ. తన పాండిత్యాన్ని ప్రదర్శిద్దామంటే తగిన ఉజ్జీయే లేక

పోయింది. దిగ్దంతుల్లాంటి పండితుల పేర్లు అప్పుడూ అప్పుడూ వినిపిస్తున్నాయి గానీ వాళ్ళు పండితరాయల ఎదటబడడానికి ధైర్యంలేక దిగంతాలు పట్టి పోయారు.

మధ్యరకం పండితులు కనిపిస్తూ ఉన్నారు గానీ, వాళ్లనిచూస్తే జాలి కలుగుతోంది కానీ, ఢీకో వాలని అనిపించడం లేదు. ఇంక నలుసుల్లాంటి అల్ప జ్ఞులు లెక్కలేనంతమంది ఉన్నారుగానీ, వాళ్లతో వాదించడం తనకే చిన్నతనం. మరి తన అఖండ పాండిత్యానికి వినియోగం ఏమిటో తెలియడంలేదట పండితరాయలకి!

తనని మృగరాజుతో పోల్చుకుని, ఈ సంగ తిని అన్యాపదేశంగా సూచిస్తున్నాడు.

మదధారలతో తడిసి సుందరములైన మహా గజేంద్రములు చుట్టుపక్కల ఎక్కడా నిలువబడలేక దిగంతాలకు ఉడాయించాయి. ఆడ ఏనుగులు ఉన్నాయి గానీ వాటిమీద జాలి చూపవలసిందేకాని, యుద్ధానికి పూనుకోడానికి మనసొప్పడం లేదు. ఇంకలేళ్లూ వగైరా అల్పజంతువులు ఉన్నాయికానీ, వాటితో కలియబడడం ఏమిటీ? సిగ్గు సిగ్గు! కనుక విని యోగం లేక దురదలు పెడుతున్న తన పదును గోళ్ల పాండిత్యాన్ని మృగేంద్రుడు ఇంకెక్కడ ప్రద ర్శించ గలడు? పాపం!

శిఖరిణి

దిగంతే శ్రూయంతే మదమలిన
గండాః కరటినః
కరిణ్యః కారుణ్యా స్పద
మసమ శీలాః ఖలు మృగాః
ఇదా నీం లోకేఽస్మిన్ననుపమ
శిఖానాం పునరయం
నఖానాం పాండిత్యం ప్రకట యతు
కస్మిన్ మృగపతిః

శార్దూల విక్రీడితం

పొదెన్ మిన్నులు పడ్డ చోటికి
మదాంభః స్విన్న మాతంగముల్
కారుణ్యాస్పదముల్ కరేణులు,
కురంగ శ్రేణులత్యల్పముల్
ఏ రీతిన్ ప్రకటించు సింహ మిక పై
స్వీయాసమా ఖర్వ దు
ర్వార వ్యగ్ర నఖాగ్ర భీషణ మహా
పాండిత్య శౌండీర్యముల్.

*　　　*　　　*

మృగరాజు తాలూకు బలపరాక్రమాలను మామూలు చప్పచప్పని మాటలతో వర్ణించి, తేలిక పరచవలసిన అవసరం నాకేమిటి? దాని పంజా కొన గోళ్లవల్ల విచ్చిన మత్తేభ కుంభస్థలాలలోనుంచి చెల్లాచెదురుగా రాలిపడిన వేలకొద్దీ ముత్యాలరాశుల చేత రంజితములైన వనంతర్భూములకు తెలుసులే మృగేంద్రుని శౌర్యోద్రేకం.

వసంత తిలక

అంతర్భలాన్య హ మముష్య మృగాధి పస్య
వాచానివేద్య కథమస్య లఘూకరోమి?
జానంతి కింతు కరజక్షత కుంభికుంభ
నిర్ముక్తమౌక్తిక మయాని వనాంతరాణి.

మత్తేభ విక్రీడితం

ఘన పంచానన శౌర్య విక్రమ
బలోత్కర్షంబులన్ చప్ప చ
ప్పని వాక్యమ్ముల జెప్పి తేలిక యొనర్పం
జాల నే నెన్నడున్
తన పంజా కొనగోళ్లచే పగిలి
మాతంగేంద్ర కుంభస్థలుల్
మునుకాంతారము లెల్లజల్లిన
లసన్ముక్తామణుల్ తెల్పవో!

*　　　*　　　*

చెరువు

ముంగండలో పుల్యావారి కుటుంబం దాతృ త్వానికి ప్రసిద్ధికెక్కింది. అన్నార్తులను దారికాచి పట్టుకుని, ఇంటికి తీసుకువచ్చి భోజనం పెట్టే వారు. చూస్తూండగా ఒక్కతరంలో ఎనభైపుట్ల

భూమి హారతి కర్పూరంలా హరించి పోయింది. యాచకులకి ఇవ్వడానికి ఇంక తన దగ్గర ఏమీ లేదే, పాపం వాళ్లు ఎక్కడికి పోగలరో, ఎన్ని ఇబ్బందులు పడతారో అని తలుచుకు తలుచుకు కుమిలిపోతూ, ఆ మనోవ్యాధితో మరింత శుష్కించి పోతూ శొంఠికొమ్ములా అయి, మిగిలిఉన్న పూరిపాక తాలూకు చపుడుపట్టిన వీధి అరుగుమీద కూర్చున్న వృద్ధుడైన ఆ ఇంటి యజమానిని చూచి, జగన్నాథుని హృదయం కరిగిపోయింది. ఆహా! ధన్యుడంటే ఆయన. ఊళ్లో పొలాలన్నీ ఆక్రమించుకుని, పిల్లికైనా బిచ్చం పెట్టని జమీందారూ ఉన్నాడు, ఎందుకూ?

వేసవికాలంలో చెరువు ఎండిపోతోంది. నాలోని నీళ్లు నానాటికీ హరించిపోతున్నాయే, వడగొట్టిన బాటసారులకి దాహశాంతి కలిగించడానికి ఇటుపైన నాదగ్గర నీళ్లే మిగలవేమో, నా దగ్గరకు వచ్చిన వాళ్లు నిరాశతో తిరిగి వెళ్లిపోతారో ఏమో.

దగ్గరలో మరో మంచి జలాశయమే లేదు కదా ఎక్కడికి పోతారో పాపం అని విచారిస్తూ మనో వ్యాధితో చెరువు కృశించిపోతోందిట! అటువంటి చెరువు జీవనాలే (నీళ్లు, ప్రాణాలు) ధన్యములు. సముద్రమూ ఉంది, ఎందుకూ?

శార్దూల విక్రీడితం

యాతేమయ్యి చిరాన్నిదాఘ మిహిర
జ్వాలాశతైః శుష్కతాం
గంతాకం ప్రతిపాంథ సంతతి రసౌ
సంతాపమాలాకులా
పీవం యస్య నిరంతరాధిపట లై
ర్నిత్యం వపుః క్షీయతే
ధన్యం జీవనమస్యమార్గ
సరసోధిగ్వారి ధీనాం జనుః.

మత్తేభ విక్రీడితం

అసలౌపమ్య నిదాఘ సూర్యకిరణ
వ్యాతప్తమై యిట్లు నా
తనువు ఇంకన్, ఇకమీద దప్పిగొను
పాంథశ్రేణి యెందేగునో
యని దుర్వార నిరంతర వ్యథల
నిత్యకార్శ్యము జెందు తీ
యని మార్గహ్రద జీవనంబులకె
ధన్యత్వంబు—ధీ వారిధీ!

*　　*　　*

చంద్రుడు

శంకరుడూ, మన్మథుడూ గర్భ శత్రువులని అందరికీ తెలిసిన విషయమేకదా! చంద్రుడుమాత్రం ఈ ఇద్దరికీ సన్నిహితుడే. ఇద్దరికీ చంద్రుడంటే గౌరవం, అభిమానం, నమ్మకం ఉన్నాయి. అతడిని ఒకడు నెత్తిమీద పెట్టుకున్నాడు, మరొకడు జైత్ర యాత్రలలో సహాయకునిగా ఉంచుకున్నాడు. చంద్రుని యొక్క ఉత్కృష్ట సౌశీల్య సంపదకి ఇంతకన్న వేరే నిదర్శనం ఏం కావాలి?

వసంతతిలక

మారస్య మిత్రమసి కించసుధా మయూఖ!
శంభావపి ప్రణయితాం ప్రకటీ కరోషి
విశ్వాసపాత్ర మసి యద్విషత స్తయోర
ప్యేత త్తన ప్రకృతి శుద్ధతనో శ్చరిత్రమ్.

ఉత్పలమాల

కాముని ప్రాణమిత్రుడవు కల్వలరాయడ!
తద్విరోధియౌ
సోమునియందు స్థైతమును చూపెదు
నెయ్యము — వార లిర్వురున్
ప్రేమయు నమ్మకమ్ము కురిపింతురు
నీ యెడ—ఇంతకంటె వే
రేమిటి సాక్ష్యముండు భవదీయ
విశుద్ధ మహచ్చరిత్రకున్.

*　　*　　*

ఒక్కొక్క మహానుభావుడు ఎన్ని కష్టాలు వచ్చినాసరే చెక్కుచెదరకుండా, తన ప్రతిభకు కళంకం రాకుండా, బహు ఉదాత్తంగా ప్రవర్తిస్తాడు. అందాకా ఎందుకూ? చంద్రకళని చూడరాదూ? శివుని ఫాలా

నల జ్వాలలచేత మాడిపోతున్నా సరే, నీలకంఠుని కంఠస్థహాలాహలంచేత ఉడికిపోతున్నా సరే, వ్యోమకేశుని జటారణ్యంలో తిరుగులాడే తాచుపాములు నాకేస్తున్నా సరే, ఆయన శరీరం మీాద రాసుకున్న బూడిదరాలి కప్పబడి పోతున్నాసరే, పుర్రెల దండలు ఒరుసుకుంటున్నాసరే, ఏనుగు చర్మపు బట్టనుంచి కాలుతున్న రక్తంచేత తడిసిపోతున్నాసరే హర శిరోరత్నమైన చంద్రుని కళ తన సహజ సౌందర్య మాధుర్యాలను కోలుపోయిందా?

శార్దూల విక్రీడితం

ధ్మాతాఫాల తలానలైః కబళితా
కంఠస్థ హాలాహలై
రాలీ ఢాఢ జటాటవీ విలుఠితై
రాశీ విషాణాం గణైః
ఛన్నాభస్మభి రాహతా స్థి పటలైః
క్లిన్నార్ద్ర చర్మాంబరైః
స్వీయాం ముంచతి మాధురీం
హరశిరోరత్నం కిమిందోః కలా

మత్తేభ విక్రీడితం

హరఫాలాగ్నుల వేచినన్, గళతటీ
హాలాహల జ్వాలలన్
మరుగంబెట్టిన, భూషణాహి వితతిన్
నాకించినన్, పుర్రెలన్
అరుగన్‌రాచిన, బూదిరాలి పడినన్,
ఆర్ద్రాంబరం బొత్తినన్
తరుగన్నేర్చునె భర్గమస్తక
కళానాథ ప్రభామాధురుల్

* * *

సూర్యుడు

సూర్యుణ్ణి మెచ్చుకుంటూ బహుచమత్కారమైన కల్పన ఒకటి చూడు పండితరాయలు.

సూర్యునికి పద్మిని ప్రియురాలనే విషయం జగద్విదితం. అటువంటి పద్మినితో సంగమించి, మధువును తెగతాగి, రాత్రివేళ ఆ పద్మకోశంలోనే పడుకుని నిద్రపోతాడు భ్రమర రసికుడు. ఇదే మరో మరో సామాన్యుడైన భర్త అయితే ఆ ఇద్దరినీ తవ్వి పాతేసి ఉండును. కాని, సూర్యుడు బహు ఉదారుడు. దయా సముద్రుడు. తనకు జరిగిన అపచారాన్ని పట్టించుకోకుండా, ఆ తుంటరి మధుపాన్ని తమ్మి చెరలోనుంచి విడిపిస్తూ ఉంటాడు ప్రభాత సమయంలో. ఓహో! దయాళువులు దోషాన్వేషణం చేయకుండా ఇతరులకు సాయం చేయడమే పరమావధిగా పెట్టుకుంటారుకదా!

పద్మిని ప్రియుడు అస్తమిస్తున్నాడు. అంటే భర్త పరదేశం వెడుతున్నప్పుడు పరపురుషుడైన తుమ్మెదవచ్చి పద్మంలో ప్రవేశించింది. పద్మం అతడిని తన బాహువులతో బంధించింది. ఇక్కడ పద్మమూ, తుమ్మెదా కూడా దోషులే. అయినప్పటికీ సూర్యుడు తిరిగివచ్చి ఇద్దరినీ క్షమించాడు, దయాంతరంగుడు కనక.

భుజంగ ప్రయాతం

అజస్రం లసత్పద్మినీ బృంద సంగం
మధూని ప్రకామం పిబంతం మిళిందమ్
రవిర్మోచయ త్యబ్జ కారాగృహే భ్యో
దయాళుర్హి నోదుష్ట వద్దోష దర్శీ.

మత్తేభ విక్రీడితం

నిరతం బంబుజినీ సమూహములతో
స్నేహాను రాగంబు బొం
పిరివో సంగమ సౌఖ్యముం గనుచు
మాధ్వీకమ్ములం జుర్రు తుం
టరి తేటిన్ విడిపించు చుండు
నలినీనాథుండు నాళీక పుం
జెరలోనుండి—దయాంతరంగులు
వృథా చింతింతురే దోషముల్

* *

ఒక్కొక్క ప్రతిభావంతుడు పదవీ భ్రష్టుడైనాసరే, ఎన్నెన్నో అవమానాలకూ ఇబ్బందులకూ గురి అయినాసరే, తాత్కాలికంగా తేజోవిహీనుడైన

సరే, మళ్ళీ పుంజుకుని, మహారాజుల తలదన్నేటట్లు ప్రకాశిస్తాడు.

సూర్యునిలో ఈ లక్షణం కనిపిస్తోందిట.

సూర్యుడు కాంతి విహీనుడై పశ్చిమ దిక్కునకు వెడితే వెళ్ళుగాక, ఆకాశంనుంచి జారిపడితే పడుగాక, సముద్రంలో మునిగిపోవుగాక, అయినాసరే మళ్ళీ మహాపర్వత శిఖరాగ్రాలమీద కాలుమోపి, చీకట్లను తెగనరుకుతూ తప్పక ఉదయిస్తాడు.

హరిణీ

పతతు నభసో గచ్ఛ త్వస్తం నిమజ్జతు వారిధౌ
వ్రజతు వరుణాగార ద్వారం ప్రభాభి రనాదృతః
తదపి తరణి ర్దత్త్వా పాదం శిరస్సు మహీభృతాం
దళిత తిమిర వ్రాతః ప్రాతః పునస్సకృదేష్యతి

మత్తేభ విక్రీడితం

శరధిం గ్రుంకునుగాక, అంబరపద
నాలిత్యవౌ గాక, త
ద్వరుణాగారము చేరుగాక విగత
ప్రాచీన రోచిష్కుడై
ధరణీ భృద్వర మౌళి మండలిని
పాదంబూని హేలన్ ప్రభా
కరు డేతెంచు ప్రభాతవేళ
తమమున్ ఖండించున్ క్రమ్మరన్.

* * *

కొత్తుంబరి

కొత్తుంబరి (కొత్తిమీర) పచ్చడి అంటే ఆంధ్రులందరికీ ఇష్టమే. అందులో పండితరాయలకి మరీనూ. దానిని ఎల్లా మెచ్చుకుంటున్నాడో చూడండి.

చింతపండు మంత్రిగారితో కలిసి కొత్తిమీర రాజావారు విజయం చేస్తున్నారు. ఓ కూరగాయలారా! పేరుకేగాని మీరు ఎందుకు ఇక్కడ? పొండి. త్వరగా పొండి.

అనుష్టుప్

కుస్తుంభరీ సమాయాతి
తింత్రిణీ మంత్రిణా సహ
పలాయధ్వం పలాయధ్వం
రే రే శాక విడంబకాః!

ఆటవెలది

కొత్తిమీర రాజసత్తముం డరుదెంచె
చింతపండు మంత్రి చెట్టవట్టి
మీరు దేనికింక పేరునకేగాని
కూరగాయలారా! పారిపొండు.

* * *

రవిక

షాజహాను దర్బారులో కుండ నెత్తిమీద పెట్టుకుని నృత్యం చేస్తున్న రాజనర్తకి లవంగి తొడుక్కున్న మఖ్‌మల్ రవికని చూచి జగన్నాథుడు పరవశించి ఇల్లా మెచ్చుకుంటున్నాడు. ఓహో రవికా! నీ పురాకృత పుణ్యం ఏమని పొగడనూ? రత్నహారాలంకృతమైన హరిణాక్షుల హృదయసీమలయందు జన్మయావత్తూ హాయిగా దర్జాగా గడుపుతావుకదా! ధన్యురాలివి.

రథోద్ధతా

శ్రీమతా కథయ కంచుక! పూర్వం
కాని కాని సుకృతాని కృతాని
జన్మయా పయసి యేన సమస్తం
హార హృద్య హృదయే హరిణాక్ష్యాః.

తేటగీతి

పూర్వ జన్మమ్ములో నెట్టి పుణ్యములను
చేసికొన్నావొ దయచేసి చెప్పు రవిక !
హేమ మణిహారముల దర్శనీయమైన
కలువకంటుల హృదయసీమల వసింతు.

* * *

సాలీడు

నలుగురూ తిరస్కరించే వస్తువును మెచ్చుకోవడమూ, అందరూ అవునన్నదానిని కాదనడమూ పండితరాయలకి ఒక విలాసం. ఇటువంటి సందర్భాలలో అతడు సాధారణంగా శ్లేషను ఆశ్రయిస్తాడు.

సాలీడుకీ సజ్జనుడికీ చాలా పోలికలు ఉన్నాయిట! ఇద్దరూ కూడా స్వీయగుణజాలంచేత శూన్యములను కూడా గుణవంతములుగా చేరుస్తారట !

గుణం అనే మాటకి దారపుపోగు అని మరో అర్థం ఉంది కదా. జాలం అంటే సమూహం అనీ వల అనీ రెండు అర్థాలు. శూన్యప్రదేశాలలో సాలీడు స్వంత దారపు పోగులతో వల అల్లుతుంది. కనుక శూన్యములు గుణవంతములు అవుతాయి.

సాలీడూ, సజ్జనుడూ కూడా రంధ్రములను మూసేస్తారట. రంధ్రములనగా కన్నములు, లోపములు అని రెండు అర్థాలు. మంచివాడు తన సద్గుణ సంపత్తిచేత లోపములను కప్పేసి, శూన్య శుష్క విషయములను కూడా గుణవంతములుగా చేస్తాడు.

ఆర్యా

శూన్యేఽపి చ గుణవత్తా
మాతన్వానః స్వకీయ గుణ జాలైః
వివరాణి ముద్రయన్ ద్రా
గూర్ణాయు రివ సుజనో జయంతి.

ఆట వెలది

శూన్యములను గూడ సుగుణాన్వితము సేయ
జాలు స్వీయ సుగుణ జాలములను
సకల రంధ్రములను సత్వరమ్ముగ మూయు
సాలెపురుగుపోలె సజ్జనుండు.

* * *

పత్తికాయ

పత్తికాయలలో రసం లేదనీ, తినడానికి పనికి రావనీ, వాటివల్ల పశుపక్ష్యాదులకు నిరాశ తప్ప మరేదీ లభించదనీ అనేక సందర్భాలలో పడతిట్టిన పండితరాయలే వాటిని మెచ్చుకుంటున్నాడు మళ్ళీ.

నీరసమైనవి అయితేనేమీ పత్తికాయలంటే నాకు చాలా ఇష్టం. ఏమంటే, మానవుల శరీరాలను కప్పి గుహ్యగోపనంచేసే పరమోద్దేశంతో సుగుణమయమైన (దారపు పోగులతో నిండిన) జన్మ ఎత్తినవి కనుక.

అనుష్టుప్

నీరసాన్య పి రోచంతే
కార్పా సస్య ఫలానిమే
యేషాం గుణమయం జన్మ
సర్వేషాం గుహ్య గుప్తయే.

ఆట వెలది

ప్రత్తికాయలన్న పరమాదరము నాకు
నీరసంబులైన నేమి కొదువ ?
సకల జనుల గుహ్యజాలంబులను మూయ
సద్గుణాఢ్యమైన జన్మమెత్తె.

* * *

అగస్త్యుడు

ఒక్కొక్క మహాపురుషుడు తన అపూర్వ ప్రతిభచేత కన్నతండ్రినికూడా మించిపోయి, కీర్తి పొందుతూ ఉంటాడు.

కుండలోనుంచి అగస్త్యుడు పుట్టాడని పురాణ గాథ ఉంది. కనుక కుండకి అగస్త్యుడు కొడుకు. కుండలో ఎన్ని నీళ్లు పడతాయి? కుండెడు నీళ్లు. మరి కుంభజన్ముడైన అగస్త్యుని పొట్టలో మహా సముద్రాలు ఇమిడి పోలేదూ?

ఆర్యా

కుంభః పరిమిత మంభః
పిబతి, పపౌ కుంభం సంభవో ఽంభోధిమ్
అతిరిచ్యతే సుజన్మా
కశ్చి జ్జనకం నిజేన చరితేన

కందము

కుంభము గ్రోలును పరిమిత
మంభస్సును—కుంభ జన్ము డాపోశనగా
నంబోధి గ్రోలె—తండ్రిన్
డింభకు డొక్కొక డుమించు నిజచరితము చేన్.

* * *

నిప్పు

చచ్చిపోబోతున్న వేళలోకూడా సజ్జనుడు తన ఉన్నతాదర్శాలను విడిచిపెట్టడు. మరొక్షణంలో ఆరి

పోబోతున్న దైనప్పటికీ నిప్పును ముట్టుకుంటే చల్లగా ఉంటుందా?

అనుష్టుప్

మనస్వీ మ్రియతే వాఽపి
స్వోత్కర్షం నైవ ముంచతి
అపి నిర్వాణ మాయాతి
నానలో యాతి శీత తామ్.

ఆటవెలది

విడువ బోడు నైజ విమలోత్తమ గుణాళి
మరణవేళ నైన మానధనుడు
ఆరిపోవు సమయమాసన్న మగుగాక
అగ్గిచల్లదనము నంద గలదె?

*   *   *

పువ్వులు

కుడియెడమలు చూచుకోకుండా తనదగ్గరకు వచ్చిన వాళ్లందరిమీదా సమంగా ప్రేమాభిమానాలు కురిపించడమే గొప్పవాళ్ల లక్షణం.

పువ్వులకు కూడా సరిగ్గా ఇటువంటి స్వభావమే ఉన్నదట. దోసిట్లో పోసుకున్న పువ్వులు ఎడమ చేతికీ కుడిచేతికీ కూడా సమానంగా ఆమోదాన్ని అంద జేస్తాయి కదా! అవి సుమనస్సులు (మంచి మనస్సు కలవి అనీ పువ్వులు అనీ ద్వ్యర్థి) కనుక ఉచితం గానే ఉంది.

అనుష్టుప్

అంజలిస్థాని పుష్పాణి
వాసయంతి కరద్వయమ్
అహో సుమనసాం ప్రీతి
ర్వామ దక్షిణయో స్సమా.

ఆటవెలది

దోసిలు గల పూలు వాసనల్ సమముగా
హస్త యుగళమునకు నంట జేయు
సమముగా రహించు సుమనసామోదంబు
వామదక్షిణముల వాసిలేక.

*   *   *

పిల్లనగోవి

మురళి మంచి వంశంలో (మంచి వెదురు కర్రలు నుంచి, మంచి జాతిలో) పుట్టినది కనుకనే పదునైన పనిముట్టుతో కోయబడినప్పటికీ, శరీరం అంతటా తూట్లుపొడిచేసినప్పటికీ విరసంగా వాగదట! మంచి సంస్కారంగల కుటుంబంలో పుట్టినవాడు ఎన్ని కష్టాలు వచ్చినా దుర్భాషలాడడు కదా!

అనుష్టుప్

ఛిన్నః సునిశితైః శస్త్రై
ర్విద్ధశ్చ నవ సప్తధా
తథా పిహి సువంశోన
విరసం నాప జల్పితమ్.

తేటగీతి

తీవ్రశస్త్రంబుచేత ఛేదింప బడియు
కాయమొక యేడు మారులు కోయబడియు
మంచి వంశములోన జన్మించినట్టి
మురళి విరసంబుగా వాగబోవ దెపుడు

*   *   *

తామలపాకు

ఈ భూమిమీద ఎన్నివేల రకాల తీగలు ప్రాకడం లేదూ? వాటి ఆకులవల్ల లాభం ఏముంది? తీగలన్నిటిలోకీ రాజులాంటిది తమలపు తీగమాత్రమే. దాని ఆకులే అందగత్తెల ముఖ చంద్రమండలములను అలంకరిస్తున్నాయి! (తాంబూలం వేసుకోవడంద్వారా)

వసంతతిలక

కిం వీరుధో భువి నసంతి సహస్రశోఽన్యా
యాసాందళాని నవరోప కృతిం భజంతే
ఏకైకవల్లిషు విరాజతి నాగవల్లీ
యా నాగరీ వదన చంద్రమలం కరోతి

వంశస్థ

పరోపకారార్థము కాని యాకులన్
ధరిత్రి వేవేల లతల్ ధరింపవే?

సరోజ నేత్రానన చంద్ర మండలిన్
విరాజిలున్ తామలపాకు మాత్రమే

* * *

మంచిగంధం

ఈ చెంపనికొడితే ఆ చెంప చూపించే చిత్రమైన మంచితనానికి చందన వృక్షాన్ని ఉదాహరణగా చూపిస్తున్నాడు పండితరాయలు.

నుగ్గునుగ్గుగా నూరబడినప్పటికీ, తాచు పాములు కరిచినప్పటికీ, ముక్కలు ముక్కలుగా తరిగి, నరికి, చీల్చినప్పటికీ సౌరభాన్నే వెదజల్లుతున్న మంచి గంధమా! నీ సౌమ్యతని ఏమని పొగడను?

ఇంద్రవజ్ర

పిష్టోఽపి దష్టోఽపిచ కాలసర్పైః
ఛిన్నోఽపి భిన్నోఽపి విదారితోఽపి
కింబ్రూమహే చందన! సౌమ్యతాంతే
లోకోత్తరం సౌరభమేవ ధత్సే.

చతుష్పది

చీరిన, కోరిన, చిలువలు కరచిన
నూరిన, కోసిన, నుగ్గుగ దంచిన
సౌరభమే వెదజల్లెదు చందన
భూరుహమా! నిను పొగడం గలమా?

* * *

ఎంత నీచవంశంలో పుట్టినా, ఎటువంటి దుర్మార్గులతో సావాసం చేసినా, ఒక్కొక్కడు తన సహజ ప్రతిభచేత అపూర్వమైన కీర్తిని పొందుతూ ఉంటాడు. మంచి గంధాన్నే చూడరాదూ? దాని పుట్టుక పాషాణమయమైన కొండలలో. దాని జాతి వట్టి కట్టె. దాని చెలికాళ్లు భుజంగములు (విటులు, పాములు) అయినాసరే, స్వగుణాతిరేకంచేత మహిమను పొందుతోంది.

ఆర్యా

జనకః సానువిశేషః
జాతిః కాష్ఠం భుజంగమైః సంగః
స్వగుణైరేవ పటీరజ!
యాతోఽసి తథాపి మహిమానమ్.

కందము

కట్టె సుమీ నీవంశము
పుట్టుక శైలముల, చెలిమి భుజగంబులతో
అట్టయ్యును కీర్తిని చే
పట్టితి గందంపు చెట్ట! స్వగుణోన్నతి చేన్.

* * *

ఎంతమంచివాడైనా తనమీద విషం కక్కేవాడికి కూడా తెలిసి ఉండిన్నీ మృష్టాన్న భోజనం పెట్టేవాడు ఉంటాడా? లేకేమీ? చందన వృక్షం ఉంది. తాచు పాములు తన శరీరాన్ని చుట్టబెట్టుకుని, విషాగ్నులు కక్కుతున్నప్పటికీ కోపగించక వాటికి కమ్మని పరిమళభరితమైన వాయువులను ఇచ్చి పరిపోషిస్తున్నాయికదూ? (పాములు గాలితిని బతుకుతాయని కవిసమయం)

ఆర్యా

అయి మలయజ! మహిమాఽయం
కస్యగిరామస్తు విషయస్తే
ఉద్గిరతో యద్గరళం
ఫణినః పుష్ణాసి పరిమళోద్గారైః

తేటగీతి

మంచిగందంపు తరువ! నీ మహిమలెన్ని
ఉచిత పదజాల మెవ్వనికున్నదోయి?
ఘోరగరళంబు గ్రక్కు భోగులను గూడ
మహిత పరిమళానిలముచే మనుచు చుందు

* * *

అగురు

ఒక్కొక్క మహోదారుడు తన ఇబ్బందులను లెక్కచేయకుండా—ఆ మాటకొస్తే ఇబ్బందులున్నప్పుడే మరింత అధికంగా—ఔదార్యాన్ని ప్రకటిస్తూ ఉంటాడు.

అగురు సహజంగా మంచి సువాసన గలది. దానిని నిప్పులలోవేస్తే లోకోత్తరమైన పరిమళాలను వెదజల్లుతుందికదా!

వసంతతిలక

> ఆపద్గతః ఖలు మహాశయ చక్రవర్తీ
> విస్తార యత్యకృత పూర్వ ముదారభావమ్
> కాలాగురు ర్దహన మధ్యగతః సమంతాత్
> లోకోత్తరం పరిమళం ప్రకటీ కరోతి.

తేటగీతి

> ఆపదల జిక్కుకొన్న మహానుభావు
> డెన్నడును లేని యౌదార్య మెరుక పరచు
> తగులబడుచున్న నల్లని గుగురు చిమ్ము
> అనుపమాన పరిమళంబన్ని దిశల.

*   *   *

లేడి

దేశం నలుమూలలూ తిరిగి, కనిపించిన ప్రతీ రాజాస్థానాన్నీ దర్శించి, అక్కడ పేరుకున్న కుళ్ళను చూచి చూచి విసుగెత్తిపోయాడు జగన్నాథుడు. వట్టి దగుల్బాజీ అయినాసరే నాలుగు కాసులున్నవాడి వెనక పెద్దపెద్ద పండితులు కూడా పడుతూ ఉండడమూ, ఆశ్రయిస్తూ చేతులు నలుపుకుంటూ ఉండడమూ, అతడిని అభూతకల్పనలతో పొగుడుతూ ఉండడమూ, ఇతర పండితులను హేళనచేస్తూ ఉండడమూ, లేని పోని డాబులూ దర్పాలూ ఒలకపోయడమూ...వగైరాలు గమనించి ఉడుకెత్తిపోయాడు. తన బాధను ఒక లేడి ముందర వెళ్లబోసుకుంటున్నాడు.

ఓ లేడీ! నువ్వు ధనగర్వాంధుల మొగం కేసి కూడా చూడవు. వాళ్లని ముఖస్తుతులు చేయవు. డంబములు వినవు. నాలుగు డబ్బులు రాలుస్తాడని ఆశపడి వెనువెంట పడిగాపులు పడవు. ఆకలి వేసినప్పుడు పట్టుకుచ్చులాంటి పచ్చగడ్డి కడుపునిండా హాయిగా తింటావు. నిద్ర వచ్చినప్పుడు ఏ పొదరిల్లో చూచుకుని కమ్మగా నిదురపోతావు. ఏ నోములు నోచి, ఏ తపస్సులు చేసి ఇంతటి స్వచ్ఛంద రమణీయమైన జీవితాన్ని గడపగలుగుతున్నావో నకు చెప్పవూ?

శార్దూల విక్రీడితం

> యద్వక్త్రం ముహురీక్షసేన ధనినాం
> బ్రూషేన చాటూ న్మృషా
> నైషాం గర్వవచః శృణోషి నచ తాన్
> ప్రత్యాశయా ధావసి
> కాలేబాలతృణాని ఖాదసి సుఖం
> నిద్రాసి నిద్రాగమే
> తన్మే బ్రూహికురంగ! కుత్ర భవతా
> కిం నామ తప్తం తపః

మత్తేభ విక్రీడితం

> ధనగర్వాంధుల మోములం గనవు,
> అసత్యంబుల్ ముఖప్రీతు లెం
> దును వాకువ్వవు, డంబముల్ వినవు,
> గంతుల్ వేయ వత్యాశతో
> తృణముల్ మేయుదు వేళ పట్టున
> సుషుప్తిం గాంతువు—ఈవే తపం
> బును గావించితొ తెల్పినన్ దొరలునే
> ముత్యాలు? సారంగమా!

*   *   *

[గమనిక : 'స్వైషశ్రీ పలివేలరాజ్య రమణీ పౌగ్గ్వ్యత్సమాకృష్యయః' అనే శ్లోకపాదం పండితరాయలది కాదు. నేను కల్పించినది. క్షంతవ్యుణ్ణి.]

తిక్కయజ్వ ధర్మాద్వైతము

శ్రీ ఓరుగంటి నీలకంఠ శాస్త్రి

"శ్రీయన గౌరినాఁ బరఁగు చెల్వకుఁ
జిత్తము పల్లవింప భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు
రూపముదాల్చి 'విష్ణురూ
పాయ నమశ్శివాయ' యని పల్కెడు
భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వముఁ
గొల్చెద నిష్టసిద్ధికిన్."

అని సకల బ్రహ్మ ప్రార్థనంబు సేసి తత్ప్రసాదాసాదిత కవిత్వ తత్త్వ నిరతిశయానంద భరితాంతఃకరణుండ నగుచుండి యొక్కనాఁ డిట్లని వితర్కించితి—

విద్వత్సం స్తవనీయ భవ్యకవితా
వేశుండు విజ్ఞాన సం
పద్విఖ్యాతుఁడు సంయమి ప్రకర
సంభావ్యాను భావుండు కృ
ష్ణద్వైపాయనుఁ డర్థి లోకహిత
నిష్ఠంబూని కావించె ధ
ర్మాద్వైత స్థితి భారతాఖ్యమగు
లేఖ్యంబైన యామ్నాయమున్.'

ఇవి కవిబ్రహ్మ తిక్కన సోమయాజి తాను రచింపబోవు మహాభారత గ్రంథ భాగమున కాదియందుఁ గావించిన ప్రార్థనోపక్రమ వచనములు.

శ్రీ యనియు, గౌరి యనియు వ్యవహారమును గన్న దేవి చిత్త మానందోల్లసిత మగునట్లు హరిహరాత్మకమగు కల్యాణరూపమును దాల్చి 'విష్ణురూపాయ శివాయనమః' అను హరిహరస్వామి మంత్రము నుచ్చరించుచు నభేదరూపముతోఁ దన్నుఁ గొల్చు భక్త జనుల వైదిక ధ్యానమునకు మది మెచ్చునట్టి పరతత్త్వము నిష్టసిద్ధికిఁ గొల్చెదను.

అని, సగుణ బ్రహ్మమును బ్రార్థించి తదనుగ్రహప్రాప్త కవిత్వ తత్త్వముచేఁ గల్గిన నిరతిశయానందముతోఁ బరిపూర్ణమగు చిత్తముగల వాఁడనగుచు నొక్కనాఁడిట్లని యాలోచించితిని.

జ్ఞానులచే స్తుత్యమగు కల్యాణ కవితావేశము గలవాఁడు, విజ్ఞాన (లౌకిక వైదిక) సంపదచే సుప్రసిద్ధుఁడు కావుననే యతిమండలముచే నాదరింపఁ బడు ప్రభావము గలవాఁడు నగు శ్రీ కృష్ణద్వైపాయన మహర్షి, కోరి సర్వలోకమునకును హితము క - గ వలయునను దీక్షనుబూని ధర్మాద్వైత స్థితి కొఱకు ధర్మాద్వైత ప్రతిపాదకమగు భారతమను లేఖ్యామ్నాయమును రచించెను. అని పైదాని తాత్పర్యము. ధర్మాద్వైత స్థితితో వ్రాసెనను నర్థము చెప్పినను గ్రంథకర్తృ నిష్ఠయే ప్రయోజనము, ప్రతిపాద్య విషయమునగుట కవకాశ ముండుటచేఁ బై తాత్పర్య ముపపన్న మగును.

తానిష్టసిద్ధికై పరతత్త్వమును గొల్చును. ఆ పరతత్త్వము తన భక్తజనముయొక్క వైదిక ధ్యానమున కిచ్చ మెచ్చుకొనును. ఆ ధ్యాన మెట్టిదనఁగా— 'విష్ణురూపాయ శివాయనమః' అను మంత్రార్థ రూపము. తన యథాతథ రూపమును ఆ భక్తజనుల ధ్యేయరూపము ప్రకటించుచున్నది గావున నట్టి ధ్యానమే యా పరతత్త్వమునకు నత్యంత ప్రీతికరము. తిక్కయజ్వ సంప్రార్థ్యమగు పరతత్త్వ

స్వరూప లక్షణము సత్యజ్ఞానానంతానంద మనియు[1] తటస్థ లక్షణము భూతముల జన్మస్థితి లయ కారణ మనియు,[2] శ్రుతులచేఁ దెల్పఁబడుచున్నది. దీనినే ద్వైపాయన మహర్షి తన బ్రహ్మసూత్రములయందు 'జన్మాద్యస్యయతః' (బ్ర. సూ. 1—1—2) అని సూత్రించెను. వైష్ణవ శైవాగమములు మాత్రము ఈ జగజ్జని స్థితిలయ హేతువగు పరతత్త్వమునే హరి యనియు, హరుఁడనియు వేఱు వేఱు దేవత లనుగాఁ బేర్కొని, వాని వానిని సృష్టి స్థితి లయ హేతువులనుగా నితరేతరాధిక్యముతో రూపించుచున్నవి. ఈ రూపణమాగమ చోదితముగాని వైదికము కాదు. అది సత్యము కాకపోవుటచే నట్టి పార్థక్యము పర తత్త్వమున కభీష్టము కాఁజాలదు.

శ్రుతులందు విశ్వోత్పత్తి స్థితిలయ కారణము ఒకచో బ్రహ్మమనియు, వేఱొకచో నాత్మమనియు, మఱియొకచో సత్ అనియు నానా నామములతోఁ బేర్కొనఁబడుచున్నను బ్రహ్మాత్మ సచ్ఛబ్దంబులచేఁ బేర్కొనఁబడు పదార్థము మాత్ర మొక్కటేయని వేద తత్త్వార్థ నిర్ణేతలు నిర్ణయించిరి. కావున, నామ భేదమున్నను లక్షణైక్యమున్నచో నా వస్తు వొక్కటియే యగునని వారల భావన. పరతత్త్వమే హరి హర రూప మగుటంజేసి, యట్టి యభేద జ్ఞానముతో 'విష్ణురూపాయ నమశ్శివాయ'యని కొల్చుటయే వైదిక ధ్యానము. దానికే పరతత్త్వమిచ్చ మెచ్చును. హరిహర రూపములతో వేఱువేఱుగానున్న తన రూపమును హరి హరాత్మకమగు నేక రూపముతో భావించుట తన చిత్తమునే గాక తనవలెనే రూప భేదముచే శ్రీ యనియు గౌరి యనియు వేర్పడిన తన శక్తి చిత్తమునుగూడఁ బల్లవింపఁజేయును. వాస్తవ మగు భద్రదాయిత మూర్తి యయ్యదియే. కావున నట్టి యభేదరూపమే సర్వదా ధ్యేయము, అదియే వైదిక ధ్యానవిషయము, అదియే పరతత్త్వ ప్రసన్నతా హేతువు. ఇది తిక్కయజ్వ పరమ తాత్పర్యము.

మూర్తిత్రయమునఁ జతుర్ముఖ బ్రహ్మ కూడ నన్యతముఁడైనను ఆ బ్రహ్మను సృష్టి స్థితి సంహార కారకుఁడుగాఁ దెల్పునాగమములు ప్రసిద్ధములుగా లేకపోవుటవలనను, అద్దాని యందభి నివేశముగల జనులు లేకపోవుటవలనను ఆ మూర్తి భేదమిటఁ బేర్కొనఁబడలేదు.

పరతత్త్వము వాగ్వ్యాపారమునకుఁగాని మనో వ్యాపారమునకుఁగాని (స్తుతించుటకును ధ్యానించుటకు ననుట) అతీతమైనదగుటచే నది కొలుచుటకు విషయము గాదని తలంచి, శక్తిరూప మాయా సంవలితమగు హరిహరాత్మక సగుణ బ్రహ్మమే యిందు సేవా విషయమని తలంచి, తిక్కయజ్వ 'సకల బ్రహ్మ ప్రార్థనంబుసేసి' అని పలికెను. బ్రహ్మము నిష్కలము, సకలమని ద్వివిధము. అందు నిష్కలము నిర్గుణము శాంతము అనునది బ్రహ్మవాస్తవ రూపము. 'సకలము'ననది సృష్ట్యాదికార్యోన్ముఖ బ్రహ్మరూపము. కాఁగాఁ బరతత్త్వ శబ్దముచే నద్వైత నిర్గుణ బ్రహ్మరూపము, హరిహరంబను దానిచే విశ్వసృష్టి స్థితి లయకారకమగు సగుణ బ్రహ్మరూపమును విషయములుగాఁ జెప్పవలయును.

ఈ పద్యమునందు నర్థ భావనను విడిచి కేవల శబ్దభావనను మాత్రము గ్రహించినచోఁ బర తత్త్వ శబ్దముచే నద్వైత బ్రహ్మ బోధకములగు వేదాంతములు, హరిహరంబను శబ్దముచే భేద బోధక మగు కర్మకాండమును విషయములుగాఁ దెల్పి, కర్మ బ్రహ్మ కాండములతోఁ గూడినవేదరూపమే భారత మను నర్థ సూచనమును గవి బ్రహ్మకావించెనని చెప్పవచ్చును.

---

1. 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' (తై. 2—1)
'విజ్ఞాన మానందం బ్రహ్మ' (బృ. 3–9–28)

2. 'యతోవా ఇమాని భూతాని జాయన్తే, యేనజాతానిజీవన్తి, యత్ప్రయన్త్యభిసంవిశన్తి, తద్బ్రహ్మ' (తై. 3—1)

తొలి పద్యమునందు సూచించిన ఈ యర్థమునే రెండవ పద్యముచే నాతఁడు 'లేఖ్యంబైన యామ్నాయమున్' అను పలుకులతో స్పష్టపఱచెను. ఈ పద్యమునందుఁ గవిబ్రహ్మ కృష్ణ ద్వైపాయనుని 'విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుఁడు, విజ్ఞాన సంపద్విఖ్యాతుఁడు, సంయమి ప్రకర సంభావ్యానుభావుఁడు' అను విశేషణ విశేషితునిగాఁ జేసెను. ఇతని భవ్యకవితావేశము విద్వాంసులచే సంస్తవనీయము. ఇందలి విద్వచ్ఛబ్దము జ్ఞాని శాస్త్రప్రజ్ఞ సామాన్య పరము. దీనికి హేతువాచకము 'విజ్ఞాన సంపద్విఖ్యాతుఁ డ'నునది. నిరుప పదమగు విజ్ఞానశబ్దము లౌకిక వైదిక విజ్ఞానముల రెండింటిని దెలియఁజేయును. కావుననే, యుభయ విధములగు విద్వత్ప్రకరములకు నీతని కవిత సంస్తవనీయము. శ్రుతి స్మృత్యాదులందుఁగల సంశయములకు మూదలయగుచు నిద్వదేక వేద్యములగు బ్రహ్మసూత్రముల రచనము చేతనేగాక, మనోహరములగు నాఖ్యాయికా రూపములతో 'వేదములకు నఖిల స్మృతి వాదములకు బహుపురాణ వర్గంబులకును వాద్యైన చోటులందు' నిర్ణాయక గ్రంథముగా నొప్పుచున్న భారతామ్నాయ రచనముచేఁ గూడ నీ మహాభాగుఁడు సంయమి ప్రకర సంభావ్యానుభావుం డగుచున్నాఁడు. మఱియు నీతని బ్రహ్మసూత్ర రచనము కేవల సంయమి లోకహితమునకే యొప్పచుఁడ నీ భారతామ్నాయము సంయమి తదితర లోకమున కంతకును ధర్మద్వైతస్థితి రూపమగు హితమును బోధించుచుండుట విశేషము. ఈ భారతము గూడ నామ్నాయమే (వేదము) యైనను అనాదినిధనముగావచ్చు నామ్నాయమునకును దీనికిని గల భేదము లేఖ్యత్వా లేఖ్యత్వములయందేగాని గ్రంథ ప్రతిపాదిత విషయ తాత్పర్యమునందు మాత్రము గాదు. భారతము భగవద్గీతాది ప్రకరణములచే నౌపనిషదమగు జ్ఞానబోధక మగుచు, సంయమి ప్రకరమునకును, శాంత్యనుశాసనాది పర్వప్రతిపాదిత ధర్మవిషయములచేఁ దక్కుంగల యాశ్రమత్రయము వారలకును హితమును బోధించుచున్నది. ఇట్లు బ్రహ్మమును (కర్మము) బోధించు చుండుటచే భారతము గూడ శ్రుత్యర్థబోధకము. ప్రతిపాదిత విషయ తౌల్యమున్నను శ్రుతి యలేఖ్యామ్నాయము, భారతము లేఖ్యామ్నాయమును. శ్రుతియనఁగా శ్రవణాత్ శ్రవణముమ (చెవి నుండి చెవిని) బొందుచు గురుశిష్య సంప్రదాయ పరంపరాక్రమమున విని నేర్వఁదగినదని యర్థము. దీనినే పూర్వ మీమాంసకులు 'గురువు, తాను దన గురువుకడ విని నేర్చిన యధ్యయనమునే తన శిష్యునికి నేర్పుచున్నాఁడు.[3]' అని చెప్పిరి. వేదాధ్యయనమంతయు గురువు చెప్పఁగాఁ విని నేర్వఁదగినదే గాని వ్రాసిన గ్రంథమును జూచి, రఘువంశాది కావ్యములవలె స్వయముగాఁ జదివి, నేర్వఁదగిన దెంతమాత్రము గాదని యభిప్రాయము. వేద మంత్రోచ్చారణమున నుదాత్తా నుదాత్త స్వరితాది స్వరమునకును వర్ణ స్పష్టతకును జాల ప్రాధాన్యము కలదు. వానియందు లేశమాత్రము గూడ దోసము కలుగఁగూడదు. దీనినే యాస్కమహర్షి—'మంత్రము స్వరహీనము వర్ణ హీనమగుచు మిథ్యా ప్రయుక్తమై ప్రయోక్తృ భావ గతార్థమును దెలుపక యయ్యది వాగ్వజ్రమై, ప్రయోక్తయగు యజమానునే హింసించును.[4] అని చెప్పి, స్వర వర్ణోచ్చారణ జాగరూకతను హెచ్చరించెను. వేదమంత్రములందుదాత్తా ద్యలౌకిక స్వరోచ్చారణమే గాక, కొన్ని తావులందు వర్ణోచ్చారణము కూడ నలౌకికముగా నుండును. కావున వేదాభ్యాసమునందు గుర్వావశ్యకత యెంతయేని గలదు. ఆచార్యుఁడు పలుకఁగా విని ఛాత్రగణ మదా ని నుచ్చరించి వేదము నభ్యసింతురు. దీనివలన వేదాభ్యాసమున శ్రవణము ప్రధాన స్థానము నాక్రమించినది. ఆ హేతువుచేతనే దీనికి 'శ్రుతి' యను నామము యుక్తమైనది. నేటికిని భారతదేశమునందు వేదపాఠమున నసాధారణ ప్రజ్ఞ గల

---

3. వేదస్యాధ్యయనం సర్వం గుర్వధ్యయన పూర్వకమ్.'

4. మంత్రోహీనః స్వరతో వర్ణతోవా మిథ్యా ప్రయుక్తో న తమర్థమాహ। సవాగ్వజ్రో యజమానం హినస్తి—'.

వేద పూరుషులు వ్రాయను జదువను నేర్వనివార లనేకు లగపడుదురు. లిపి లేఖన పఠనములతో వార లకు నిమిత్తము లేకపోవుటయే దానికి హేతువు. కావున శ్రుతి యలేఖ్యమగు నామ్నాయము.

ఇఁక నీ భారతామ్నాయ మట్టిది గాదు. ఇయ్యది శ్రుతి గాదు. గురు శిష్య సంప్రదాయానుసారముగ శ్రోత్రమునుండి శ్రోతమునఁ బ్రవేశింపవలయు నవస రము దీనికి లేదు. అనఁగా దీనియందలి విషయమునకే గాని వర్ణానుపూర్వికి నంత ప్రాధాన్యము లేదు. దీనిని వ్రాసి చదివికొనవచ్చును. కాఁగా శ్రుతి యలేఖ్యమగు నామ్నాయము, భారతము లేఖ్యంబగు నామ్నాయమును.

ఇఁక నీ పద్యము నందలి చర్చనీయాంశమగు 'ధర్మాద్వైతస్థితి' శబ్దార్థమును విచారింతము. తద్వి చార ప్రసంగమునఁ దచ్ఛబ్ద ప్రయోక్తయగు తిక్క యజ్వ యొక్కయు, దచ్ఛబ్ద విషయుఁడగు కృష్ణ ద్వైపాయనుని యొక్కయు స్వరూపమును మనము తొలుత విచారింపవలసి యున్నది. అట్లు విచారించి నప్పుడే గంభీరార్థ సంపన్నమగు నీ యపూర్వ శబ్దా ర్థము తేటతెల్లమగును. ప్రయోక్తృ జ్ఞానమును బట్టి యాతడు ప్రయోగించిన యపూర్వ శబ్దార్థ మును నిర్ణయించుట న్యాయ్యము. కావునఁ బ్రయోక్త యగు తిక్కయజ్వ స్వరూపము తొలుత విచారింపఁబడు చున్నది.

తిక్కయజ్వ స్వరూపము గాని, యాతని వంశ స్వరూపము గాని, ఆతడు రచించిన నిర్వచనోత్తర రామాయణ, భారత గ్రంథములకంటె నాతని శిష్యు కల్పుఁడై, యాతనిఁ దన కృతిపతిగా గౌరవించిన కేతన దశకుమార చరితమునందు విపులముగ వర్ణింపఁబడి నది. తిక్కన మనుమ భూపాలునికి మంత్రి యనఁగా, నేఁటికాలపు మంత్రులవలె భృత్యాద్యపేక్ష తోడనే యుద్యోగము నిర్వహింపక యా రాజునకు గాత్ర త్రాణమువలె ప్రాణరక్షకుఁడై, ప్రాణ స్వరూపుఁడై కూడ నుండెను. తాను సమస్తరాజపదముల నందు చున్నను, వైదిక కర్మశ్రద్ధను ద్యజింప లేదు.

'అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమిలి శంఖములును
గంబ గట్టు భూమి కానిక గాఁగఁ బెం
పెసఁగు రాచపదవులెల్లఁ బడసె.
(దశ—1—21.)

కేతన తిక్క మహాకవిని మహాసుందరునిగను, నరపతి నయవిద్యా నిపుణునిగను, ఆశ్రిత పోషణుని గను, దెలుఁగున, సంస్కృతమునఁ జతురుండై తా నుభయకవిమిత్ర నామము నందినట్లుగను వర్ణించుట యే గాక, యాతని శాస్త్రవిద్యా వైశారద్యమును, వైదిక కర్మ నిరతిని బెక్కుభంగుల వర్ణించినాఁడు.

1. 'కొట్టరువు తిక్కనికిన్ వేదత్రయాత్మకు నకు' (నిర్వ 1—4)

2. 'వేదాది సమస్త విద్యా విభాసి' (నిర్వ 1—88)

3. 'సకల విద్యాకళా చణుఁ డెవ్వఁడనిన వీఁడని చూపుటకు గుఱియైన వాఁడు' (నిర్వ 1—89)

4. 'వేదాది ప్రకట వివిధ విద్యాభ్యాసా పాదిత మహత్త్వునకు' (నిర్వ 1—94)

5. 'అనూన తపస్స్వాధ్యాయాది సుకృత పరి పాకునకున్' (నిర్వ 1—98)

6. 'సకలాగమార్థ తత్త్వ విచారోదారుఁడు' (నిర్వ 2—119)

7. 'యాగ విద్యాభిరాముఁడు' (నిర్వ3—165)

8. 'నానా వేదవేదాంగ తత్త్వజ్ఞునకున్' (నిర్వ 5—136)

9. 'సార విద్యా పవిత్రుఁడు' (నిర్వ 6—196)

10. 'విద్యా నికషోపలుఁడు' (నిర్వ 7—166)

11. 'అనితర గమ్యవాఙ్మయ మహార్ణవ వర్తన కర్మధారుఁడు' (నిర్వ 8—94)

12. 'ప్రౌఢ విజ్ఞాన దీపుఁడు' (నిర్వ 8—96)

13. 'అగణు గోష్ఠీ ఘనప్రదేశము' (నిర్వ 10—102)

పై విశేషణములవలనఁ దిక్కయజ్వ, వ్యాకరణాదు సకల విద్యలయందును, గళలయందును, ద్రవిడ విద్యయందును మహావిద్వాంసుఁడని తెలియుచున్నది. నానా విద్యలయందుఁ బ్రౌఢ పాండిత్యము నందియుండుటయే గాక, తాను స్వయముగ వైదిక కర్మలను బహు శ్రద్ధాసక్తులతో నొనరించినవాఁడని గూడఁ గేతన తెలిపినాఁడు—'.

1. 'వేద విద్యా ప్రతిపాలకుండు' (1— 3)

2. 'మహిత దక్షిణలైన బహువిధ యాగంబు లొనరించు ననుట వర్ణనము చొప్ప' (1— 93)

3. 'అధ్వరాబ్జదినవాథుఁడు' (1—95)

4. సతత స్వాహా స్వధాది శబ్దద్వయ సంస్కృత హవ్యకవ్య సంతర్పిత మఖ శిఖి ముఖ నిలింప పితృ వర్గుఁడు (1—96)

5. ఆగమ ప్రధిత కర్మ పస్ఫురత్కీర్తి, శ్రౌతస్మార్త కర్మతత్పరమతి' (2—1)

6, 'వేదోదిత కర్మవ్రతుఁడు' (3—164)

7. 'యాగ విద్యాభిరాముఁడు' (3—165)

8. 'సతతాధ్వర క్రియాకర్మఠ పాణిపద్ముఁడు' (5 -134)

9. మఖ సంతోషిత మరుత్సమాజుఁడు (3—135)

10. 'యాగాహరణ నిపుణచిత్తుండు'(9—86)

పై విశేషణములవలనఁ దిక్కన శ్రుతి స్మృత్యుదిత సకల కర్మాచరణ శీలుఁడని తెల్లమగుచున్నది. కేతన తన గ్రంథమునం దెచటను తిక్కన, సోమయాగము చేసినట్లు సోమయాజి బిరుదముతో సూచింపక పోయినను వేదోదితములగు నాధానాది కర్మములను పంచమహాయజ్ఞములను దర్శ పౌర్ణమాస కర్మములను అవశ్య మాచరించు చున్నట్లు పై విశేషణముల కర్థమును జెప్ప నొప్పును. సోమయాగము భారతాన్ధ్రీయ రచనమునకుఁ బూర్వ మొనరించి తన్ను భారత రచనమునకుఁ బరిపూర్ణాధి కారిగా భావించి యుండవచ్చును. మఱియుఁ దిక్కన కర్మాచరణపరుఁడే గాక, శివోపాసన ధురంధరుఁడని గూడ నీతని గ్రంథము వలనఁ దెలియు చున్నది.

1. 'చిత్తనిత్యస్థిత శివుఁ డెవ్వఁడనిన వీఁడను శబ్దమున కర్థమైనవాఁడు (1—89)

2. 'అభవ చరణాంభో జాత న్యస్త చిత్తుఁడు' (1—101)

3. 'సేవాతత్పర శశాంక శేఖరుఁడు(1—103)

4. 'సోమభృత్ భక్తిమత్తుఁడు' (6—196)

5. 'లసిత హారపద పద్మైకావాస చిత్త మధుకరము' (8— 1)

మఱియుఁ దాను గూడ—'మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైక శీలుండ'నని (నిర్వ 1—13) చెప్పుకొనెను.

తిక్కన నేఁడు స్మార్తులని వ్యవహరింపఁబడు వారి సంప్రదాయమునకుఁ జెందియున్నట్లు శ్రౌత స్మార్తకర్మ శ్రద్ధాళుత్వము వలనను, శివచరణ సరోజ సేవాతత్పరతవలనను స్పష్టమగుచున్నవి. మఱియు నీ మహాభాగుఁడు తాను యాగాచరణ శీలి యగుటయే గాక యాజకుఁడు గూడ నైనట్లు కేతన 'యాజక మండలోత్తమా' (8—94) యని సంబోధించినాఁడు.

తిక్కయజ్వకు సాక్షాచ్ఛిష్యుఁడై ధన్యతఁ గాంచిన మారన తన మార్కండేయ పురాణమున కాదియందు గురు స్తుతిని గావించుచు— 'సంవిహితాధ్వర క్రియా ప్రభుఁడ'నియు 'బరతత్త్వ బోధనుఁడు, నవీన పరాశర సూనుఁడ'ని (మార్క 1—10)యు స్తుతించుటచే గూడ నీతఁడు వేదోదిత కర్మ బ్రహ్మములను రెండింటిని జీర్ణించుకొనిన వైదిక శిరోమణి యని విదితమగు చున్నది. మఱియుఁ దానే హరిహరనాథాను గ్రహమున 'జనన మరణాదులైన సంసార దురితంబులకు నగ పడకుండంగఁ దొలఁగు తెరువుగను వెలుంగు' గల వానినిగాఁ జెప్పుకొనెను. (మహాభారతము విరా— 1—24)

ఇఁకఁ గృష్ణ ద్వైపాయన స్వరూపము. భారతీయ వాఙ్మయమున నీతనికిఁగల యుత్తమ స్థానము, పరిపూతయశము, వేఱొకరి కెవ్వరికిని గానము. దానికి హేతువు శ్రుతి శిరోఽర్థ నిర్ణాయకములగు బ్రహ్మసూత్రముల రచనము కృత్స్న వేదార్థ నిరూపణ పరమగు భారత రచనము, తక్కుఁగల భాగవతాది పురాణ రచనమును, వేదములు వేద ధర్మములు ఖిలీభూతములైన సమయమున నీ మహానుభావుఁ డవతరించి వానిని సరియగు పద్ధతిలో నుంచుటచే నీతనికి 'వేద వ్యాస' బిరుదము కల్గినది. ఇట్టి విజ్ఞాన సంపదలే వేఱొకరికి లేకపోవుటచే నీ జగద్గురువు భారతదేశమునందలి ధార్మిక లోకమున ననితర సాధారణమగు గౌరవ ప్రతిష్ఠల నందెను. శ్రీ శంకర భగవత్పాదులు తమ బ్రహ్మసూత్ర భాష్యమున 'యావదధికార మవస్థితి రాధికారికాణాం' ('బ్ర. సూ. 3—3—32) అను సూత్రమునకు భాష్యమును గావించుచు' అపాంతరతముఁడను వేదాచార్యుఁడగు పురాణర్షి సత్తముఁడు విష్ణు నియోగమునఁ గలిద్వాపర సంధియందుఁ గృష్ణ ద్వైపాయన రూపమున నవతరించిన'ట్లు[5] వర్ణించెను. మహాభారతమునందుఁగూడ నీ మహాభాగుని ధర్మ ప్రతిష్ఠాపన మిట్లు వర్ణింపఁబడినది.' ప్రతి యుగమునందును బాదముల కొలఁది తఱుఁగుచున్న ధర్మమును మర్త్యులయాయు స్సామర్థ్యములను యుగావస్థను గాంచి వేదమును వేదప్రవర్తకులఁగు విప్రులను ననుగ్రహింపఁదలఁచి యసంకీర్ణముగ వేదవిభాగము గావించుటచే నీ వేదవేత్త 'వేదవ్యాసుఁడ'ని స్మరింపఁబడెను. మఱియుఁ దాను విభజించిన వేదచతుష్టయమును భారతమను పంచమ వేదమును గ్రమముగా సుమంతు— జైమిని— పైల—శుక— వైశంపాయనులచే నధ్యయనము గావింపఁజేసి ప్రవర్తింపఁజేసెను. [6]నన్నపార్యుఁడుకూడ 'అహిమద్యుతి తేజుఁడు వేదమయుడు అఖిల మునీంద్రాద్యుఁడు వేదవ్యాసుఁడు ఉద్యద్ జ్ఞానంబుతోడ నుదితుఁడయ్యె' ననియు, 'అంబురుహ సంభవు నంశముఁదాల్చి పుట్టి లోకాంచితుఁడైన వాఁడ'నియు, 'నిఖిలాగమ పుంజము నేర్పడన్ విభాగించి జగంబులందు వెలిఁగించి సమస్త జగద్ధితంబుగాఁ బంచమ వేదమై పరఁగు భారత సంహితను జేసినవాఁడ'నియు స్తుతించెను.

(ఆది 3—46)

నన్నపార్యుని దర్శనమున ద్వైపాయన మహర్షి 'అహిమ ద్యుతితేజుఁడు, వేదమయుఁడు, అఖిల మునీంద్రాద్యుఁడు, ఉద్యద్జ్ఞానంబుతోడ నుదితుఁడును'. వేద త్రయమూర్తి యగు సూర్యభగవానునితోఁ దేజము నందే గాక వేదమయత్వమునందుఁ గూడ నీ ద్వైపాయనుఁడు సామ్యము నందెను. మఱియు ఆ జన్మతః జ్ఞానము నందిన వామదేవునివలె నీతఁడు గూడ ఉద్యద్ జ్ఞానముతోడనే యుదితుఁ డయ్యెను, 'బ్రహ్మను సృజించి బ్రహ్మ ద్వారా వేదములను బరమేశ్వరుఁడు ప్రవర్తింపఁజేసె'ననెడి[7] శ్వేతాశ్వతర శ్రుత్యర్థమునే నన్నయ 'అంబురుహ సంభవు నంశముఁ దాల్చి లోకాంచి

---

5. 'అపాంతర తమా నామ వేదాచార్యః
పురాణర్షిః విష్ణునియోగాత్ కలిద్వాప—
రయోః సంధౌ కృష్ణద్వైపాయనః
సం బభూవ ఇతిస్మరన్తి'

6. పాదాప సారిణం ధర్మం సతు
విద్వాన్ యుగే యుగే।
ఆయుః శక్తించ మర్త్యానాం
యుగావస్థామవేక్ష్య చ॥
బ్రహ్మణో బ్రాహ్మణానాం చ
తథాఽనుగ్రహ కాంక్షయా।
వివ్యాస వేదాన్ యస్మాత్ స
'వేదవ్యాస' ఇతిస్మృతః॥
వేదానధ్యాప యామాస
మహాభారత పంచమాన్।
సుమంతుం జైమినిం పైలం
శుకం చైవ స్వమాత్మజమ్॥
ప్రభుర్వ రిష్ఠో వరదో
వైశంపాయన మేవచ'
(మహాభారత. ఆది. 63 అ. 83—90)

7. 'యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వేదాంశ్చ ప్రహిణోతి తస్మై' (శ్వేతాశ్వ. 6—18)

లుఁడై నిఖిలాగమ పుంజము నేర్పడన్ విభాగించి జగంబులందు వెలిఁగించె'నని చెప్పెను. చతుర్ముఖ ప్రవర్తిత వేదములు త్రైవర్ణికులకు మాత్రమే శ్రేయస్సాధనములుగాఁ బరిమితములై యుండ నీ వ్యాస చతుర్ముఖుఁ డయ్యది సకల జగద్ధితము కాఁజాలదని సకల జగద్ధితంబుగా నీ పంచమ వేదమై పరఁగు భారత సంహిత నొనర్చుట విశేషము. ఈ నన్నయ 'సకల జగద్ధిత'మునే కవిబ్రహ్మ 'లోకహిత నిష్ఠం బూని' యని తెల్పెను. నన్నయ కూడ భారతమును వేద పర్యాయ వాచకమగు సంహితా శబ్దముతోఁ బేర్కొనుట వలన వైదికమార్గ నిష్ఠుఁడగు నన్నయకు గూడ నందుగల వేదదృష్టి, యాదరమును వెల్లడియగు చున్నవి. భారతమును సంహితగాఁ బేర్కొనిన నన్న పార్యుఁడు పారాశర్యస్తోత్ర ప్రసంగమున 'భారత భారతీ శుభ గభస్తి చయంబులఁ జేసి ఘోర సంసార వికార సంతమస జాల విజృంభము వాపి, సూరి చేతో రుచి రాబ్జ బోధన రతుండ'ని చెప్పుటచే నీ భారత ముపనిష ద్రూపమని గూడఁ జెప్పినట్లాయెను. కాఁగా, నన్నయ, ద్వైపాయన మహర్షిని బ్రహ్మాంశ సంభూతుఁడనియు, నాతని కృతియగు భారతమును కర్మ బ్రహ్మకాండము లతోఁ గూడిన వేదమే యనియుఁ జెప్పినట్లు గ్రహింప వచ్చును. భక్తవతంసుఁడగు పోతన గూడ ద్వైపాయన మహర్షిని 'ధాతవు భారత శ్రుతి విధాతవు, వేద పదార్థ జాల విజ్ఞాతవు బ్రహ్మతత్త్వ నిర్ణేతవు యోగనేత'వని వేధోఽంశ సంభూతునిఁగాను అతని భారత కృతిని వేదరూపముగాను వర్ణించెను. శిష్టులు గూడ వ్యాస భగవానుని ధర్మప్రవర్తకాచార్య వర్యుఁడగు పరమ హంస పరివ్రాజకాచార్య వర్యునిగాను, తత్రాపి భార తీయ సంప్రదాయమను నొక యుత్తమ సన్న్యాస సంప్రదాయ ప్రవర్తకునిఁగాను నిరూపించిరి—'ఉజ్జ్వల దండధారు. ఆగమపుంజ పదార్థతత్త్వ నిస్సంశయ కారు, కృష్ణమృగ చర్మ కృతాంబర కృత్య, భారతీ వంశ వివర్ధనున్.'

ఇంతవరకు నిరూపించిన దానినిబట్టి ధర్మా ద్వైత శబ్ద ప్రయోక్తయగు కవి చతురాస్యుఁడు. శ్రుతి స్మృతి విహిత కర్మాచరణ శీలియగు వైదిక పుంగవుఁడనియు ఆ శబ్ద మెవ్వానిని గూర్చి ప్రయోగింపఁబడినదో యట్టి శ్రీ కృష్ణ ద్వైపాయన మహర్షి వేదోక్త ధర్మోద్ధరణమునకును, వేదోద్ధరణమున కును నవతరించిన బ్రహ్మాంశ సంభూతుఁడనియు, సుస్పష్టమైనది.

ఇఁక ధర్మాద్వైత శబ్దార్థ విచారము:—

ధర్మాద్వైత పదము సమస్త పదము. ఈ సమస్త పదమునందు— ధర్మ + న + ద్వి + ఇత అను నాలుగు పదములంత ర్భూతములై యున్నవి. 'ఇణ్' (గతౌ) అను ధాతువునకు భావార్థమునందు 'క్త' ప్రత్యయము గలుగఁగా నీ 'ఇత' అను రూపము నిష్పన్నమైనది. 'యే గత్యర్థాః తే జ్ఞానార్థాః' అను శబ్దార్థ తత్త్వజ్ఞుల నిర్ణయమునుబట్టి 'ఇత' అను శబ్దమునకు జ్ఞానమను నర్థమును గ్రహింపవలయును. అట్టి 'ఇత' శబ్దమునకు ద్విశబ్దముతో సమాసము గలుగ 'ద్వి + ఇత = ద్వీత' అను రూపమేర్పడును. అనఁగా రెండు జ్ఞానములని యర్థము. 'ద్వీత' శబ్దము కంటె స్వార్థమునందు 'అణ్' ప్రత్యయముగల్గి యాది వృద్ధిరాఁగా 'ద్వైత' మను రూపము నిష్పన్న మైనది. ఇందలి ద్విశబ్దమునకు ద్విత్వ సంఖ్యయందే గాక భేదార్థమునందుగూడఁ దాత్పర్యము గలదు. కాఁగా ద్వైతమనఁగా రెండు జ్ఞానములు లేక భేద జ్ఞానమను నర్థము సిద్ధించును. ఈ భేదమును శాస్త్రకారులు, 'జీవునికిని ఈశ్వరునకును భేదము, జడమునకును ఈశ్వరునకును భేదము, జీవులకుఁ బరస్పరము భేదము, జడమునకును జీవునకును భేదము, జడములకుఁ బరస్పరము భేదము'[8] అని అయిదు విధములుగా నున్నట్లు నిరూపించిరి. విశ్వము ఇట్టి యైదు విధములగు భేదములతో నొప్పుచుండుట చేతనే ఈ జగమునకు 'ప్రపంచ' మను నామము సార్థకము. ద్వైత శబ్దమున

8. 'జీవేశ్వరభిదా చైవ జడేశ్వరభిదా తథా ।
జీవభేదో మిథశ్చైవ జడజీవభిదా తథా ।
మిథశ్చ జడభేదోయః ప్రపంచో భేద సంజ్ఞకః'

కీ పంచవిధ భేదములను గూడ నర్థముగాఁ జెప్ప వలయును. అట్టి యీ 'ద్వైత' శబ్దమునకు 'నఞ్' శబ్దముతో సమాసముగావించిన 'అద్వైత' శబ్దము ఏర్పడినది. వాఙ్మయమున 'నఞ్' శబ్దమునకుఁ గల నానార్థములలో[9] విరోధార్థమును గ్రహించి నచో ద్వైత విరోధియను నర్థము గలుగును. లేదా యభావార్థమును గ్రహించినచో ద్వైతాభావమను నర్థమును అద్వైత శబ్దమునకుఁ జెప్పవలయును. ఇట్లు నిష్పన్నమగు నద్వైత శబ్దమునకు ధర్మ శబ్దముతో ద్వంద్వ సమాసము గావించినచో 'ధర్మాద్వైత' శబ్ద మేర్పడును. అప్పుడు ధర్మము అద్వైతము అను నర్థమును దెలుపవలయును. ఈ ధర్మాద్వైత రూప ద్వంద్వ సమాస పదమునకు స్థితి శబ్దముతో షష్ఠీ తత్పురుష సమాసమును గావించినచో 'ధర్మాద్వైత స్థితి' యను పదము నిష్పన్నమగును. 'ద్వంద్వాంతే శ్రూయమాణం పదం ప్రత్యేకమను సంబధ్యతే' యను నియమముచేఁ దుదినున్న 'స్థితి' శబ్దము ను ద్వంద్వ గతోభయ శబ్దములతో సంబంధింపఁ జేయఁగా 'ధర్మ స్థితి—అద్వైతస్థితి' అను నర్థము వాచ్యమగును. అనఁగా ధర్మస్థితి కొఱకును అద్వైతస్థితి కొఱకును భారతామ్నాయము కృష్ణ ద్వైపాయన మహర్షిచే రచింపఁబడియెనను నర్థము ఫలించును. ఇఁక సమస్త ధర్మాద్వైత శబ్దములోని ధర్మ శబ్దమునకును అద్వైత శబ్దమునకును విస్పష్టమగు నర్థము విచారింపవలసి యున్నది. సమ నన్తర పద్యముననే తిక్కయజ్వ భారత మునుగూర్చి—

'వేదములకు నఖిల స్మృతి
వాదములకు బహు పురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా
మాదల ధర్మార్థకామ మోక్ష స్థితికిన్.

అని చెప్పుటచే శ్రుతిస్మృతి పురాణములలో వివదాద ములగు తావులయందు నర్థ నిర్ణాయకమగుచు నీ భారతము ధర్మార్థ కామ మోక్షములకు హేతు వగుచున్నదని చెప్పెను. భారతము ప్రభు సమ్మితముగాఁ గాక పురాణ రూపముననఁగాని కావ్యరూపముననఁగాని జిజ్ఞాసువులకు మనోహరాఖ్యాయికా రూపమున వేదార్థ మును బోధించుచు వివ్రతి పన్నములగు శ్రౌతస్మార్త పౌరాణిక ధర్మముల నిర్ణయము చేయుచుఁ బురుషా ర్థప్రయోగి యగుచున్నదని తాత్పర్యము. కావున భారతమునందుఁ దెల్పఁబడిన ప్రధాన విషయము శ్రౌత స్మార్త రూపమే. శ్రుతియందుగల రెండు కాండ ములలోను బూర్వకాండము, కర్మను బోధింప నుత్తర కాండము బ్రహ్మమును బోధించునట్లును. ఆ కర్మ బ్రహ్మములకు ఫలము స్వర్గాపవర్గములనియు' కాండ ద్వయముచేఁ ప్రతిపాదింపఁబడుచుఁ గర్మబ్రహ్మ స్వరూపములనంది స్వర్గాపవర్గ ఫలములను సమకూర్చు యజ్ఞేశునకు నమస్కారము[10] అను శిష్టుల నవనేశ ప్రార్థనముచేఁ దెలియును. కావున శ్రుత్యపరరూప మగు భారతముగూడ నట్టిదే కావలయును. ఇట్టి యర్థమును బోధించుటకే శ్రౌత స్మార్త కర్మయోగి యగు తిక్కయజ్వ 'ధర్మాద్వైత' శబ్దమును వ్యాసుని విషయమునఁ బ్రయోగించినాఁడు.

ధర్మ శబ్దమునకు నానార్థములున్నను ఇందు ధర్మశబ్దమునకు శ్రుతి స్మృతి విహితమగు ధర్మమునే ప్రధానార్థముగా గ్రహింప వలయును. వేదార్థ నిర్ణయ మునకుఁ బూనిన జైమిని మహర్షి స్వోపజ్ఞమగు ధర్మ మీమాంసా గ్రంథమునకుఁ దొలి సూత్రముగా 'అథాతో ధర్మజిజ్ఞాసా' (జై. సూ. 1–1–1) అని ప్రతిజ్ఞసేసి ప్రతిజ్ఞాత ధర్మ స్వరూపమును 'చోదనా లక్షణార్థో ధర్మః' (జై. సూ. 1–1–2) అని

9. 'తత్సాదృశ్య మభావశ్చ తదన్య త్వం తదల్పతా ।
అప్రాశస్త్యం విరోధశ్చ నఞర్థాః షట్
ప్రకీర్తితాః'

i అబ్రాహ్మణః ii అపాపం iii అనశ్వః iv అను దరా కన్యా v అపశవోఽన్యేగో అశ్వేభ్యః vi అధర్మః.

10. 'కాండ ద్వయోప పాద్యాయ
కర్మబ్రహ్మ స్వరూపిణే।
స్వర్గాప వర్గ రూపాయ
యజ్ఞేశాయ నమోనమః'

సూత్రించెను. చోదన యనఁగా విధి బోధక ప్రత్యయాన్తము. (లిజ్ లోట్ తవ్యదాది ప్రత్యయాన్త శబ్దము) అట్టి శబ్దముచే విధింపఁబడి మేలును సమకూర్చు కర్మము ధర్మశబ్దవాచ్యమని యా సూత్రార్థము. 'జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత' (స్వర్గమును గోరువాఁడు జ్యోతిష్టోమమను యాగమును జేయవలయును) అను మున్నగు వాక్యములలోని విధ్యర్థకములగు 'యజేత, 'అహరహస్సంధ్యా ముపాసీత' (ప్రత్యహము సంధ్యోపాసనమును గావింపవలయును) ఉపాసీత' అను మున్నగు వానిచే బోధింపఁబడు జ్యోతిష్టోమ యాగ సంధ్యోపాసనాదులు ధర్మశబ్ద వాచ్యములని తాత్పర్యము ఇట్టివి శ్రౌత ధర్మములు.

ఖిల శ్రుతులయందలి ధర్మములను, విప్రతిపన్నములై గహనములగు శ్రుతిబోధిత ధర్మములను ధర్మతత్త్వజ్ఞులగు మన్వాది మహనీయులు తమ సూక్ష్మదృష్టిచే స్మరించి తమతమ స్మృతి గ్రంథములను సంతరించినట్లు స్మృతి తత్త్వకోవిదులు వాక్రుత్తురు. వీనియందు వర్ణాశ్రమాది ధర్మములు విపులముగఁ దెలుపఁబడినవి. ఈ స్మృతి గ్రంథములందు భారతీయుల జీవితమునకు సంబంధించిన పెక్కులు విషయములు దెలుపఁబడినను, జన్మాది మరణ పర్యంతము చాతుర్వర్ణ్యములవారు అవార్య సంస్కారముకొఱకుఁ జేయవలసిన కర్మములను ప్రధాన ధర్మములుగా గ్రహింతురు. స్మృతికర్తలందఱును దొలుత శ్రుత్యుక్తమును ప్రధాన ధర్మముగా నెన్ని, తరువాత స్వోక్తమును ధర్మముగా నెన్నిరి. మనువు— 'వేదమంతయు ధర్మమునకు మూలమనియు, వేద విదుల స్మృతులు, శీలములు, ధర్మమునకు మూలమనియు, అనంతరము సత్పురుషుల యాచారము, ఆత్మతుష్టియు, మూలమ'[11]నియుఁ దెల్పెను. ఈ యాశయమునే గౌతముఁడు 'వేదో ధర్మమూలం; తద్విదాంచ స్మృతి శీలే' అని తెల్పెను. ఇట్లు ధర్మప్రమాణమును దెల్పి స్మృతి కర్తలు ఇట్టి ధర్మములకుఁ బరమ ప్రయోజనము చిత్తశుద్ధియనియు శుద్ధచిత్త వృత్తులను ప్రధాన ధర్మలక్షణములుగా మన్వాది మహనీయులు పేర్కొనిరి. 'పది విధములగు లక్షణములు గల ధర్మము నెట్లయినను సేవింపవలయును. ఆ ధర్మ లక్షణములేవనఁగా ధృతి, క్షమ, దమము, అస్తేయము, శౌచము, ఇంద్రియ నిగ్రహము, ధీ, విద్య, సత్యము, అక్రోధము'[12] (మను. 7—91, 92) అని మనువు వాకొనెను.

ఇట్లు ధర్మ స్వరూపమును స్మృతి గ్రంథములు విపులముగ నిరూపించి ధర్మోపదేష్టలగు శిష్టులకు ఒక హెచ్చరిక గూడఁ జేసినవి. 'వేదోక్త ధర్మమును, స్మృత్యుక్త ధర్మమును వేదశాస్త్రములకు విరుద్ధముకాని తర్కముతో ననుసంధానముచేసి చెప్పువాఁడే ధర్మము నెఱిఁగినవాఁడుగాని తదితరుఁడు కాఁడు'[13] (మను. 12—106) అట్లే 'శాస్త్రముచేఁ దెలుపఁబడని ధర్మము విషయమున శిష్ట వచనమే పరమప్రమాణమ'నియు[14] (మను. 12-108)

---

11. 'వేదోఽఖిలో ధర్మమూలం
స్మృతి శీలేచ తద్విదామ్।
ఆచారశ్చైవ సాధూనా
మాత్మన స్తుష్టి రేవచ'
(మను. 2—6)

12 'దశలక్షణకో ధర్మః
సేవితవ్యః ప్రయత్నతః।
ధృతిః క్షమా దమోఽస్తేయం
శౌచ మింద్రియ నిగ్రహః।
ధీర్విద్యా సత్యమక్రోధో
దశకం ధర్మలక్షణమ్'
(మను. 7—91, 92)

13. ఆర్షం ధర్మోప దేశంచ
వేదశాస్త్ర విరోధినా।
యస్తర్కే ణాను సంధత్తే
సధర్మం వేద నేతరః'
[మను. 12—106)

14. 'అనామ్నాతేషు ధర్మేషు
కథం స్యాదితి చేద్భవేత్।
యం శిష్టా బ్రాహ్మణా బ్రూయుః
సధర్మః స్యా దశంకితః'
(మను. 12—108)

ధర్మ విషయమున సర్వధర్మ శాస్త్రములు నైక కంఠ్యమునఁ బేర్కొనినవి. మఱియు శ్రుతిచే విధింపఁ బడిన శ్యేన యాగాదులు అభి చారిక కర్మములగుటచే చోదనా లక్షణములయ్యు ఉత్తమ ప్రయోజన సాధనములు కావు గావున నట్టివి ధర్మమెంతమాత్రము కావని మీమాంసకుల నిర్ణయము.

శ్రుతి స్మృత్యాదులిట్లు ధర్మ స్వరూపమును ధర్మ ప్రమాణములను బేర్కొని ధర్మాతి శయమును గూడఁ బేర్కొనినవి.

'ధర్మమునందే జగత్తు ప్రతిష్ఠ గలదు. ధర్మిష్ఠునే ప్రజలు సమీపింతురు. ధర్మముచేతనే పాపము తొలఁగును. వేయేల ధర్మమునందే సర్వము ప్రతిష్ఠితమై యుండుటచే ధర్మమే పరాయణము'[15] (తై. ఆ. 10—63) 'శ్రేయోరూపమగు ధర్మమును బరమేశ్వరుఁడు సృజించెను. 'ధర్మముకంటెఁ బరమమగు వస్తువు వేఱొండు లేదు. బలహీనుఁడు గూడ ధర్మముచే బలవంతుఁడగుచున్నాఁడు'[16] (బృహదారణ్యక 1—4—14) 'ప్రజలను లెస్సగా నిలువఁ బెట్టునది గాన ధర్మమయ్యెను'[17] 'పై లోకమున నీకు సాహాయ్యమును గావించునది ధర్మమే గాని నీ మాతృ పితృ దార పుత్రజ్ఞాతు లెంతమాత్రము గారు'[18]

ఇట్లు శ్రుతి స్మృత్యాదులు ధర్మ స్వరూపమును ధర్మ ప్రమాణములను ధర్మాతిశయమును వేనోళ్లఁ బేర్కొనుచు ధర్మము భారతీయ జీవనమునకాధారస్తంభముగాఁ జేసిరి.

కొన్ని తావులందు శ్రుతి ప్రతిపాదిత ధర్మము దురవగాహమగుటచే నట్టిదానిని స్మృతి వాక్యముల ద్వారా నిర్ణయింపవలసియున్నది. ధర్మ విషయమున స్మృతి గ్రంథముల కిట్టి ప్రామాణ్యము కల్గుటచేఁ గాల్రకమముఁనఁ గొందఱు తమ యింద్రియ లోలత్వమునఁ గాని దేశకాలములనుబట్టి గాని జరిగిన కొన్ని యశాస్త్రీయ ప్రవృత్తులను శాస్త్రీయము గావించుటకై మహర్షుల పేరిటఁ గొన్ని స్మృత్యాభాసములను సంతరించి ప్రచురించిరి. దానిచే స్మృతి ధర్మమునందుఁ గొంత విప్రతిపత్తి యేర్పడినది. అట్లే పురాణములందుఁ గూడఁ దమరాగ ద్వేషానుకూలమునఁ గొందఱు కొన్ని కథలను గారికలను గల్పించి చొన్పిరి. వేయేల, బహువిధముల సంరక్షింపఁబడు వేదముల యందుఁ దక్క మిగిలిన ధర్మ ప్రమాణ గ్రంథములందు నన్నింటను నిట్టి ప్రక్షేపములు జరుగ నారంభించి ధర్మ నిర్ణయమునకు నొక సంక్లేశము గలుగ నట్టి ప్రమాదముఁ జరుగకుండ ధర్మసంస్థాపనమున కవతరించిన శ్రీకృష్ణ ద్వైపాయన మహర్షి యీ భారతామ్నాయమును స్మరించి లోకమున ధర్మ వ్యవస్థ గావించెఁ వ౦ తిక్కయజ్వ -

'వేదములకు నఖిల స్మృతి
వాదములకు బహు పురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా,
మూదల ధర్మార్థకామ మోక్షస్థితికిన్'

(భా. వి. 1—4)

అని దెల్పెను. వివాదగ్రస్తములగు ఘట్టములందు భారత ముదాహరణ పూర్వకముగా నిర్ణాయకమని

---

15. 'ధర్మోవిశ్వస్య జగతః ప్రతిష్ఠా,
లోకే ధర్మిష్ఠం ప్రజా ఉపసర్పన్తి,
ధర్మేణ పాప మపనుదతి,
ధర్మే సర్వం ప్రతిష్ఠితం,
తస్మాద్ధర్మం పరమం వదన్తి'
(తై. ఆ. 10—63)

16. 'తచ్ఛ్రేయో రూప మత్యసృజత ధర్మం,
తదేతత్ క్షత్రస్య క్షత్రం,
తస్మాత్ ధర్మాత్ పరం నాస్తి,
అథో అబలీయాన్ బలీయాం సమాచష్టతే
ధర్మేణ' (బృ. 1—4—14)

17. 'ధారణాత్ ధర్మ మిత్యాహుః
ధర్మో ధారయతి ప్రజాః'

18. నాముత్రహి సహాయార్థం
పితామాతాచ తిష్ఠతః।
న పుత్రదారా నజ్ఞాతిః
ధర్మస్తిష్ఠతి కేవలః' (మను. 4—239)

చెప్పుటచే ధర్మసంగతులయందు భారతమునకుఁగల విశిష్టస్థానము తెలియఁబడుచున్నది. ఈ విషయమునే ద్వైపాయన మహర్షి తన భారతమున 'ఇతిహాస పురాణముల వలన వేదార్థమును సంగత పఱచి పెంపొందింప వలయును. అట్లు కానిచో నల్పజ్ఞుఁడగు ప్రవక్తను గని వీడు నన్నుఁ బ్రతారణము గావించునే యని శ్రుతి భీతినందు చున్నదని'[19] (భార. ఆది 1—267) తెలియఁజెప్పెను. కావుననే పోతన 'ఆగమ పుంజ పదార్థతత్త్వ నిస్సంశయకారు'నిగా ద్వైపాయనుని వర్ణించెను.

భారతము, ధర్మ నిర్ణేతలగు మను జైమిన్యాదులు పేర్కొనిన విధముననే పలువిధముల విధి బోధక ప్రత్యయాంత పదములచేతను దదర్థకములగు పదములచేతను ధర్మమును బోధించుచు ఆఖ్యాయికాదుల మూలమున సోదాహరణముగ ధర్మనిర్ణయము చేయుచుఁ గర్తవ్యా కర్తవ్య విషయమున శ్రుతివలెనే ప్రమాణ పదవి నధిరోహించినది — మిగిలిన పర్వములకంటె శాన్త్యను శాసనాది పర్వములయందు సవిస్తరముగ నీ ధర్మము ప్రతిపాదింపఁబడినది. చతురాశ్రమ ధర్మములు—చాతుర్వర్ణ్య ధర్మములు, కర్తవ్యా కర్తవ్య కర్మ స్వరూపము ధర్మ సమవేత నీతి ప్రశస్తి, వర్ణముల యాపద్ధర్మములు మున్నగు ధర్మ కార్యశైలి యంతయు నిందుఁ బ్రతిపాదింపఁబడియెను. ఉదాహరణమునకు—

'ఏతా నేవ వేదేషు నిశ్చయః కవిభిః కృతః।
అద్వైత వ్యా త్రయీ నిత్యం, భావితవ్యం విపశ్చితా।
సర్వథా ధనమాహార్యం యష్టవ్యం చాపి యత్నతః।
అధీయతేఽధ్యాపయన్తే యజన్తేయా జయన్తి చ'
(శాన్తి 8—27, 29)

మాతరం పితరం చైవ విద్వాంసంచ తపోధనం।
క్షమావంతంచ దేవేంద్ర నావమన్యేత బుద్ధిమాన్'
(ఆది 87—7.)

ఎల్లపుడు త్రయీ విద్యాభ్యాసము చేసి తదర్థమును భావనము సేయవలయును. ధర్మమార్గమున నన్నివిధముల ధన మార్జించి యెట్లయినను గ్రతువుల నొనర్పవలయును. అధ్యయనా ధ్యాపనములు, యజన యాజనములును నొనర్పవలయును. వేద ప్రతిపాదిత నిర్ణయ మిదియే యని క్రాన్తదర్శుల వచనము.

'మాతా పితరులను విద్వాంసునిఁ దపోధనుని క్షమావంతుని బుద్ధిమంతుఁడు అవమానింపఁగూడదు.'

లోకమున నేఁడు ధర్మ శబ్దముచేఁ జెప్పఁబడు నర్థమునకును వైదిక ధర్మమునకును గొంత భేదము గలదు గావున ధర్మ స్వరూప నిర్ణయ విషయమును దగు శ్రద్ధ వహింపవలసియుండును. లోకదృష్టిలో హింస యనునది కేవలము అధర్మము. వేదదృష్టిలో యాగమునందుఁ గావింపఁబడు పశు విశసన రూపమగు హింస వేదచోదిత మగుటచే ధర్మము. కావున వేదోక్త ధర్మమునకును లోకదృష్టిలోని ధర్మమునకును గొంత భేదము గలదు. భారతము వేదరూపమగుటచే నిందలి ధర్మ శబ్దముచే వేదోక్తము లేదా విరుద్ధమునగు శ్రౌతస్మార్త ధర్మమునే గ్రహింపవలయును.

ఇట్లు ధర్మాద్వైత శబ్దములోని ధర్మ శబ్దముచే శ్రుతి స్మృత్యాదితములగు ధర్మములనే ప్రధానముగా గ్రహింపవలయుననియు నట్టి ధర్మస్థితికొఱకే భారతామ్నాయమును వ్యాస మహర్షి రచించెననియుఁ దిక్క సోమపీథి హృదయము.

ఇఁక నద్వైత శబ్దార్థమును బరిశీలింతము. అవయవార్థమును బట్టి యద్వైత శబ్దమునకు జ్ఞాన ద్వయ విరుద్ధము, జ్ఞానద్వయము లేనిది అనఁగా భేద జ్ఞానములేనిదను నర్థమును గ్రహింపవలయునని పూర్వము నిరూపింపఁబడినది. పూర్వోక్త పంచవిధ భేద జ్ఞానశూన్య మద్వైత జ్ఞానమని పరమార్థము. ఆ భేదములలో నెట్టి భేదము సత్యముగా నున్నదని చెప్పినను అది యద్వైతము కానేరదు. ఇట్టి

19. 'ఇతిహాస పురాణాభ్యాం
వేదం సముప బృంహయేత్।
బిభేత్యల్పశ్రుతా ద్వేదో
మామయం ప్రత రిష్యతి'
(మహా. 1—267)

యర్థమునందే 'అద్వైత' శబ్దమును శ్రుతి స్మృతులు పేర్కొను చున్నవి. మాండూక్యోపనిషత్తు జాగ్రద వస్థయందలి భేద సహకృతమగు స్థూలభుగ్జాగ్ర ద్వ్యవహారమును, స్వప్నావస్థయందలి భేదసహకృత సూక్ష్మ భుక్స్వాప్నిక వ్యవహారమును, సుషుప్తావస్థ యందలి యేకీ భూత కారణ రూపానంద భుక్సౌ షుప్త వ్యవహారమును వర్ణించి తురీయావస్థను, 'అదృశ్యము అవ్యవహార్యము అగ్రాహ్యము లక్షణ రహితము అచింత్యము ఇదమిత్థమని వ్యపదేశింప శక్యము కానిది ఏకాత్మ ప్రత్యయసారము ప్రపంచోపశమ రూపము శాంతము శివము అద్వైతము నగు భావమును చతుర్థ పాదముగా జ్ఞానులు దలచు చున్నారు. అదియే యాత్మ[20] అని యాత్మ స్వరూపమును నిషేధ రూపమున వాస్తవముగా వర్ణించినది.

లోకములోఁ దనకంటె వేఱు వస్తువున్నచో చూచువాఁడు, చూడఁబడు వస్తువు, చూచుటయను క్రియయు సంభవించును. అట్టి భిన్న వస్తువు లేక పోవుటచే నీ చతుర్థ పాదరూపమగు నాత్మపదార్థము అదృశ్యము కావుననే యయ్యది అవ్యవహార్యము (వ్యవహరింప శక్యముకానిది) అగ్రాహ్యమునుఁ (గ్రహింప శక్యముకానిది) అగుచున్నది. అలక్షణమనఁగా ననుమాన ప్రమాణముచేఁ దెలియఁబడనిది. ఆ యాత్మవస్తువు, వాఙ్మనసముల కందరాని దగుటచే నవ్యపదేశ్యమున చింత్యము నగుచున్నది. జాగ్రదాద్యవస్థలు తొలఁగినను ఈ యాత్మ మన్నింటియందును అనుస్యూత ముగా నుండుటచే నిది ఏకాత్మ ప్రత్యయ సారమగు చున్నది. బాల్యాద్యవస్థలు తొలఁగినను 'నేను' అను వ్యవహారము బాల్యాదివార్ధక పర్యంతము ఏకరూపముతో నున్నట్లు జాగ్రదాద్యవస్థలు తొలఁగినను ఈ యాత్మ జ్ఞాన మేకరూపమున నున్నదనియు, ఒకే యొక యీ యాత్మజ్ఞానమే యిందుఁ బ్రమాణమనియు భావము. దృశ్యత్వ వ్యవహార్యత్వాది ధర్మములన్నియు ద్వైత స్థితియందే సంభవించుటచే అట్టి ద్వైతస్థితితోఁ గూడిన ప్రపంచము సుషుప్త్యతీత తురీయస్థితియందు లేదు గావున, ఆ యద్వైతస్థితి, ప్రపంచోపశమము, కావుననే శాంతము శివము నగుచున్నది. ఇది పై శ్రుతి తాత్పర్యము.

ఇట్టి ప్రపంచోపశమ శాంత శివాద్వైతమగు తురీయాత్మ స్థితినే తద్వాచకమగు ప్రణవ రూపమునఁ గూడఁ దెల్పుచు మాండూక్య శ్రుతి—'అమాత్ర శ్చతుర్థో ఽ వ్యవహార్యః ప్రపంచోపశమః శివో ఽద్వైత ఏవమోంకారః ఆత్మైవ సంవిశతి' (మాండూక్య. 12) అని పలికినది. కావున సజాతీయ విజాతీయ స్వగత భేదశూన్యమగు స్థితియే యద్వైత స్థితి యనియు నట్టి జ్ఞానమే యద్వైత జ్ఞానమనియు నదియే మోక్ష సామ్రాజ్య రూప మనియు శ్రుతి తాత్పర్యము.

దీనినే గౌడ పాదమహర్షి — 'పృథగ్భూతము లగు సర్వపదార్థముల యద్వైత రూపమగు తురీయ రూపమే సర్వవ్యాపకమగు పరమేశ్వరుని రూపము'[21] (గౌ. ఆగమ. 10) 'ఈ ద్వైత ప్రపంచ మంతయు మాయామాత్రము. యథార్థము అద్వైతమే'[22] అని వివరించి యిట్టి యద్వైత స్థితి చేతనే యుత్తమమగు నపవర్గము గల్గునని—' అనాది యగుట మాయచే సుప్తుఁడగు నీ జీవుఁడు ఎప్పుడు మేల్కాంచునో (మాయా ముక్తుఁడగునో) అప్పుడే యా తఁడు జన్మాది రహితము మాయారూప నిద్రా

20. 'అదృశ్య మవ్యవహార్యం
అగ్రాహ్యం అలక్షణం అచింత్యం
అవ్యపదేశ్యం ఏకాత్మ ప్రత్యయ
సారం ప్రపంచోపశమం
శాంతం శివం అద్వైతం
చతుర్థం మన్యన్తే, స ఆత్మా
(మాండూక్య. 7.)

21. 'అద్వైత స్సర్వభావానాం దేవస్తుర్యో విభుః స్మృతః' (మాం. కా. ఆ. 10)

22. 'మాయా మాత్ర మిదం ద్వైత మద్వైతం పరమార్థతః'
(మాం. కా. ఆగమ. 17)

తత్కార్య స్వప్నాది విరహితమునగు నద్వైత బ్రహ్మ భావమును దెలియఁగలఁడు'[23] (ఆగమ. 16.)

'కామ క్రోధాది విరహితులు వేదాన్త పర మార్థమును దెలిసిన జ్ఞానులు సర్వ వికల్ప శూన్యము ద్వైత భేదరహితము, కావుననే యద్వైత రూపము నగు నాత్మను దెలిసికొనుచున్నారు.'[24] (వైతథ్య. 35)

బృహదారణ్య కోపనిషత్తుగూడ, ద్వైత భావము భయకారణమని 'ద్వితీయా ద్వైభయం భవతి' (బృహ. 1—42) దెల్పి, అట్టి ద్వైత స్థితియున్నపుడే లోక వ్యవహారము జరుగుననియు, ఏ నాఁడు (అద్వైతస్థితి భేదము) లయమునొందెనో సర్వమును ఆత్మరూపమే యగునో అపుడు ఆ జ్ఞాని జగద్వ్యాపారము గతింప స్వస్వరూపముననే నిలుచుననియు, ఆ స్థితిలో దర్శనాది వ్యాపారమునకు వలయు ద్వితీయ వస్తువే లేదనియు (బృ. 2—4—14)[25] దెల్పెను.

ఇట్లుపనిష త్ప్రపంచమంతయు నద్వైత స్థితినే పరమ పురుషార్థముగాఁదెల్పి నిరూఢమగు నీ యద్వైత జ్ఞానమే పరమ పురుషార్థ సాధనముగాఁ దెల్పినది. మనువుగూడ నాత్మజ్ఞానమునే పరమ పురుషార్థ సాధనముగాఁదెల్పి అట్టి యాత్మజ్ఞానమునకు స్వస్వధర్మవృత్తి రూపముగ తపస్సు చిత్తశుద్ధిద్వారా సాధనమగుచున్నదని చెప్పెను.

'తపము విద్యయు (ఉపాసనము) ఉత్తమమగు మోక్షసాధనము. తపనుచే బాపము తొలఁగి శుద్ధ చిత్తుఁడై విద్యచే నమృతభావము నందును.[26] (మను. 12—104) 'వేదాభ్యాసాది సకల కర్మలలో ఉపనిషదుక్తమగు నాత్మజ్ఞాన ముత్తమమైనది. మోక్షమునకు హేతువగుటచే నది సర్వవిద్యలలో నగ్రగణ్యము.'[27] (మను. 12. 85) తప మనఁగా శాస్త్ర విహిత స్వధర్మ వృత్తియని యర్థము.

పైని దెల్పిన తీరున నిశ్శ్రేయస సంపాదకమగు నద్వైత జ్ఞానము వేదమునందలి యుత్తర కాండమునందుఁ దెలుపఁబడినది. శ్రుతి గత పూర్వ కాండోక్తమగు ధర్మమును దెల్పుచు భారతము ఎట్లు సంహితారూపము నందెనో యట్లే శ్రుతి గతోత్తర కాండ ప్రతిపాదితమగు నద్వైత బ్రహ్మమును బోధించుచు భారత ముపనిషద్రూపమును గూడ నయ్యెను. కాఁగా సమగ్రమగు వేదార్థమును దెల్పుచుండుటచే నీ భారతము సమగ్రామ్నాయ మయ్యెనని

---

23. 'అనాది మాయయా సుప్తో
యదా జీవః ప్రబుధ్యతే।
అజమనిద్ర మస్వప్నం
<u>అద్వైతం</u> బుధ్యతే తదా'
(మాం. కా. ఆగమ. 16)

24. 'వీతరాగ భయ క్రోధై
ర్మునిభిర్వేద పారగైః।
నిర్వికల్పో హ్యయం దృష్టః
ప్రపంచోపశమోఽద్వయః
(మాం. కా. వై. 35)

25. 'యత్రహిద్వైత మివ భవతి
తదితర ఇతరం పశ్యతి।...యత్రవా అస్యసర్వ ..
మాత్మైవా
భూత్ తత్కేనకం పశ్యేత్,...
విజ్ఞాతారమరే కేన విజానీయాత్'
(బృ. 2—4—14.)

26. 'తపోవిద్యాచ విప్రస్య
నిశ్శ్రేయస కరం పరమ్।
తపసా కిల్బిషం హన్తి
విద్యయాఽమృత మశ్నుతే'
(మను. 12—104)

27. 'సర్వేషామపి చైతేషా
మాత్మజ్ఞానం పరం స్మృతమ్।
తద్ధి అగ్ర్యం సర్వవిద్యానాం
ప్రాప్యతే హ్య మృతం తతః'
(మను 12—85)

'తపః స్వధర్మ వృత్తిత్వం' (మహాభారతము.)

గ్రహింప వచ్చును. భారతమునందుఁ బెక్కుచోటుల జ్ఞాన సాధనములను జ్ఞాన రూపమును జ్ఞాని స్థితిని అపవర్గ రూపమును వర్ణించుట యట్లుండ గీతా రూపములగు నుపనిషత్తులను స్వాంతర్భూతములను గావించుకొనుటచే భారత ముపనిషదర్థ ప్రతిపాదక మని వేఱఁ జెప్ప నవసరములేదు.

ఇట్లు కర్మ బ్రహ్మ ప్రతిపాదకములగు గ్రంథ భాగములచే శ్రీ మహాభారతము ధర్మా ద్వైతములను బ్రధానములుగాఁ బ్రతిపాదించుటఁ జేసి యీ గ్రంథము ధర్మబోధక వచనములచే ధర్మార్థ కామములను, జ్ఞాన (అద్వైత) బోధక వాక్యములచే మోక్షము నొడఁ గూర్చుచు ధర్మార్థ కామమోక్ష స్థితికిఁ బ్రధాన సాధనమగుచున్నది. ధర్మార్థ కామమోక స్థితి కొఱకు ధర్మాద్వైత ప్రతిపాదకమగు భారతమును రచించెనను నిట్టి గంభీరమగు నభిప్రాయముతో శ్రీ తిక్కయజ్వ 'ద్వైపాయనుఁడు లోకహిత నిష్ఠన్ బూని ధర్మాద్వైత స్థితి భారతాఖ్యమగు లేఖ్యా మ్నాయమును గావించె'నని తెల్పెను.

తాను దెల్పిన భారతోక్తార్థమున కనుగుణము గనే దాను గృతిపతిగా నెంచిన పరమేశ్వరుని భారత ప్రతిపాదిత విషయ విషయిగాఁ బేర్కొనెను. గ్రంథ గత విషయమును గృతిపతికి సమన్వయించుటయే వాస్తవమగు గ్రంథ సమర్పణమని మహామనీషియగు కవి పరమేష్ఠి యాశయము కాఁబోలు. పరిశీలింపుఁడు. హరిహరనాథుఁడు— 'క్రతుభూషణమణి (విరాట— 1—34) యజ్ఞాత్మక రూపుఁడు (వి 3–239) 'యాగ భోగో ద్వికాసుఁడు' (ద్రో. 5–433)' 'యజన విధి ఫలత్వ వ్యాప్తుఁడు' (కర్ణ 2—401) సాయం ప్రాతర్హుత ప్రజ్వలిత హుతవహుఁడు (సౌప్తి. 134) హవ్య కవ్య ప్రసాద్యుఁడు (శాం. 4–457) ఓంకార వాచ్యుఁడు' (వి. 1–32) (తస్య వాచకః ప్రణవః' (పాతం జలయోగ సూత్రము) 'శ్రుతి సీమంతమణి' (వి. 1—34) 'భేదరహిత ప్రకార' (ద్రో. 1—396) అన్నమయత్వాది విరామోన్న తుఁడు' (విరా 1—334) 'జగదభిన్న రూపుఁడు' (వి. 1—33) వేదవ్యాస వ్యంజిత విహారుఁడు (భీ 1—1) 'సాత్యవతేయ వాఙ్మయ విశాల గృహ స్ఫురిత ప్రదీపితుఁడు' (ద్రో. 1–395) 'భేద రహిత ప్రకారుఁడు' (ద్రో 1–396)

తిక్కన హరిహరనాథుని స్తుతించునిట్టి కర్మ బ్రహ్మ ప్రతిపాదకములగు విశేషణములలో గొన్ని స్థాలీ పులాకముగా మాత్రమే నీయఁబడినవి. ఇట్టి విశేషణములతో స్తుతింపఁబడు హరిహరస్వామి 'సాత్య వతేయ వాఙ్మయ విశాల గృహస్ఫురిత ప్రదీపితుఁడ' నని విశేషింపఁబడుటచేఁ దిక్కనార్యునికి 'భారత గ్రంథ విషయము కర్మబ్రహ్మ రూపమగు ధర్మాద్వైతమని చెప్పుట కవకాశము గలదు. ఏతావతా తేలిన యర్థము–వ్యాస భగవానుఁడు తాను ధర్మాద్వైత స్థితితో ధర్మాద్వైతస్థితి రూప హితమును లోక మునకుఁ గోరి ధర్మాద్వైతస్థితి ప్రతిపాదకమగు భారత గ్రంథమును రచించెనని.

ఇంతవఱకు గ్రంథ స్వరూపమునుబట్టి తిక్క యజ్వ శ్రీకృష్ణ ద్వైపాయన విషయమునఁ బ్రయో గించిన 'ధర్మాద్వైత' శబ్దమునకుఁగల ప్రధానార్థ మును వివరించితిని. ఇట్టి శబ్దములు శబ్ద స్వభావ మునుబట్టి నానాభావవ్యంజకము లగుటచే నన్యార్థ ములు గూడ వ్యక్తములు కాకపోవు. కావున నర్థాన్తర ములను గూడ మన మూహింప వచ్చును. అందు ధర్మ ప్రవర్తకాచార్యుఁడగు వ్యాసమహర్షి తాను ధర్మముతో నద్వైత భావమునంది యట్టి స్థితిని యథాయోగ్య ముగ లోకమున కందించుటకే గ్రంథమును రచించె ననియు, లేదా భారతమున బహుముఖములగు మానుష హృదయ తత్త్వములు సహజములుగా వర్ణింపఁబడు టచే నట్టి మానుష హృదయ ధర్మములతోఁ దా నద్వైత భావమునంది యట్టి స్థితిలో నీ గ్రంథ రచనమును గావించెననియు లేదా శైవ వైష్ణవ శాక్త సౌర గాణాపత్యా ద్యాగమములు స్వస్వప్రతిపాదిత శివ విష్ణుశక్తి సూర్యగణపత్యాది దేవతలనే పరతత్త్వ రూపములతో జగదుత్పత్తి స్థితిలయ హేతువులుగా వర్ణించుటం జేసి యాయా దేవతలు పృథగ్రూపులను

భావము కల్గునేమోయని భావించి తత్పార్థక్య నిరాస మునకై తత్తద్దేవతాధిక్య ప్రతిపాదకములగు మతము లను సమన్వయపఱచుచుఁ దద్ధర్మముల యద్వైత స్థితినిఁ గోరి యీ భారత గ్రంథమును రచించె ననియు నిట్లు పలుతెఱఁగుల నర్థమునీ 'ధర్మా ద్వైత' శబ్దమునకు వర్ణింప నవకాశము గలదు.

ఆనుషంగికములగు నీ యర్థము లెట్లున్నను శబ్ద ప్రయోక్తయగు తిక్కన సోమయాజి యోగ్య తను దెల్పు పూర్వోక్త విశేషణములచేతను ప్రయుక్త శబ విషయుఁడగు ద్వైపాయన మహర్షి స్వరూప ప్రతిబోధకములగు ప్రశస్తి రూపిత విశేషణ సంతతిచే, తను 'ధర్మాద్వైత స్థితి' శబ్దమునకు శ్రుతిస్మృత్యు దిత ధర్మస్థితి కొఱకును అద్వైత స్థితి కొఱకును ఈ భారతామ్నాయమును లోకహిత దీక్షఁబూని మహర్షి రచించె ననుటయే ముఖ్యార్థముగా నాకుఁ దోఁచుచున్నది.

వ్యాస భారత రచనమున కుపయుక్తమగు నీ విశేషణము తదర్థమునే ప్రతిబింబింపఁ జేయుటచేఁ బరివర్తితమగు నాంధ్రమహా భారతమునకును వ్యాస మార్గాను యాయులగు కవిత్రయము వారికినిగూడ నన్వయింపక పోదు. కావున కవిత్రయము వారును ధర్మా ద్వైత స్థితితోడనే తదర్థ సిద్ధి కొఱకై తమ భారత రచనమును గావించిరని చెప్పవలను గలదు. ఆది కవియగు నన్నయ భట్టారకుఁడు భారత స్వరూప వర్ణనా ప్రసంగమున తొట్టితొలుతనే పలికిన 'ధర్మ శాస్త్రజ్ఞులు ధర్మశాస్త్రంబని—యధ్యాత్మవిదులు వేదాంతమనియు' అనెడి వచనమే తిక్కన ధర్మా ద్వైత శబ్దమునకు నిదానమా యను సందేహమునకుఁ దావీయక పోదు. వైదికమార్గ ప్రవృత్తి తత్పరుఁ డగు తిక్కయజ్వకీ వేదతత్త్వార్థ ప్రతిపాదకమగు 'ధర్మాద్వైత' శబ్దమెంతయో ప్రీతిపదమని యని పించుచున్నది. మూలమున కృష్ణద్వైపాయన వర్ణనా ప్రసంగమున—'

'కృష్ణ ద్వైపాయనం వ్యాసం
విద్ధి నారాయణం భువి।
కోహ్యన్యః పురుష వ్యాఘ్ర
మహాభారత కృద్భవేత్

(మహాభారతము, శాన్తి 346—12)

అనియుండఁగాఁ దిక్కయజ్వయిట్లు వర్ణించెను.

'విద్వన్మోద విధాయి నిర్మల వచో
విస్ఫూర్తి విఖ్యాతుఁ గృ
ష్ణ ద్వైపాయను నీ వెఱుంగుము
విభున్, నారాయణుంగా, వివ

శ్వి ద్వంద్యంబగు భారతాధ్యయనముం
జేయంగ శక్తుండు ధ
ర్మా ద్వైతుండు సరోజలోచనుఁడ
కాకన్యుండు తద్వ్యూహ్యుఁడే.

(శాంతి. 6—476)

కేతన తన్ను 'వేదత్రయాత్మకుఁడని వర్ణించి నట్లు తాను వ్యాసభగవానుని ధర్మాద్వైత రూపుని గానే యభేదాధ్యవసాయముతో వర్ణించుట యిందు విశేషము. తన నిర్వచనోత్తర రామాయణమునఁ గూడఁ గృతిపతి వంశము నభివర్ణించుచుఁ బ్రథమ మనుమ సిద్ధిరాజును గూర్చి

'తద్వంశంబునఁ బోషిత
విద్వజ్జనుఁడ హిత భుజగ విహగేంద్రుఁడు ధ
ర్మాద్వైత మూర్తి పరయో
షిద్వర్గ స్మరుఁడు మన్మసిద్ధి జనించెన్'

(నిర్వ 1—29)

అని చెప్పెను. ఈ మన్మసిద్ధి వంశము 'మఘ విద్యా ప్రియులు, వైదికవిధి శ్లాఘాదర స్వాంతులు ముని లోకంబుచే బ్రశంసలనందు రాఘవరాజన్యులకు మూల కందమై యొప్పుటచే నీ విశేషణము మన్మసిద్ధికిఁ గూడ నొప్పిదమై యుండునేమో! కాని రెండవ మన్మ సిద్ధిచే 'మామా' యని యాదరముతోఁ బిల్పించుకొను తిక్కన తన తారుణ్యాభావముచేఁ గాఁబోలు వెనువెంటనే 'పరయోషిద్వర్గ స్మరుఁడని' (స్వీయలకు సామాన్యులకే గాక) యాతని సంభావించి నాఁడు. వివేకియు శబ్ద

ప్రయోగము నతిజాగరూకతతోఁ జేయు తిక్కన ఇట్లేల ప్రయోగించెనో దురూహము. అనంతరము పేర్కొను విశేషణముచే 'ధర్మాద్వైత మూర్తి' శబ్దమస్థానపతితమా యనిపించును గదా! ఆ కాలమున మహారాజుల నట్లు స్తుతించుట యొక సంప్రదాయమేమో! ఇందుఁ బకారమునకు బదులు 'వ'కారమును బఠించినచో నిట్టి దోషము నంతగాఁ దిక్కన కాపాదించుట కవకాశము లేదు. అట్టి పాఠ మున్నచో లెస్స. అది యట్లుండుఁ గాక!

తిక్కయజ్వ ప్రయోగించిన 'ధర్మాద్వైత' శబ్ద పర్యాయ పదమే వ్యాసభారతమునఁగూడ శ్రీకృష్ణ ద్వైపాయన విశేషణముగా నుపయోగింపఁబడినది.

'కృష్ణేన మునినా విప్ర నిర్మితం సత్యవాదినా
సర్వజ్ఞేన విధిజ్ఞేన <u>ధర్మజ్ఞానవతా</u> సతా'

(స్వర్గారోహణము 37)

ఇందలి జ్ఞానపద మౌపనిషదాద్వైత జ్ఞానపరమను భావనతోఁ దిక్కయజ్వ 'ధర్మాద్వైత' శబ్దమును గ్రహించెనేమోయను ననుమానముగూడఁ గల్గుట కవకాశము గలదు.

తిక్కయజ్వ యిట్లు శ్రీకృష్ణ ద్వైపాయనుని భారత రచనమునఁగల హృదయమును ధర్మాద్వైతముగాఁ దెల్పినను దన్నుఁగూర్చి మాత్రము పరమేశ్వరార్పణముతోఁ గ్రత్వాది కర్మల నాచరించి చిత్తశుద్ధినంది జ్ఞానియై యద్వైత రూపమగు మోక్షము నందఁదలఁచిన మహాభక్తునిఁగానే యతి విధేయతతోఁ దెల్పుకొనెను. తన్నుఁగూర్చి పరమేశ్వరుఁ డిట్లు పల్కెనఁట!

'వైదికమార్గ నిష్ఠమగు వర్తనముం
దగ నిర్వహించుచున్
భేదములేని భక్తిమతి నిర్మల వృత్తిగఁ
జేయుచుండు మ—
త్పాద నిరంతర స్మరణ తత్పర
భావము కల్మి నాత్మ న
మోదముఁ బొందఁ గావ్య రసమున్
గొనియాడుచునుండు దెప్పుడున్

(విరాట—1—15)

తిక్కయజ్వ శ్రౌతస్మార్త కర్మముల నాచరించుచునే యద్వైత రూపమగు భక్తిగలవాఁడు గాని 'సంధ్యావందన భద్రమస్తు భవతే, భో స్నాన తుభ్యం నమః, భోదేవాః పితరశ్చ తర్పణ విధౌ నాహం క్షమః క్షమ్యతాం' అని భక్తి పేరిటఁ గర్మల నెగఁగొట్టు భక్తుఁడు మాత్రముకాఁడు. కర్మాచరణ పూర్వకమగు భక్తియే మతిని నిర్మల వృత్తిగఁ జేయుచుండుననియు, నట్టి భక్తియే యాత్మానందము నొనఁగూర్చుననియు నట్టివాఁడే యుత్తమ కావ్యరసానందానుభూతికి నర్హుఁడనియుఁ బరమేశ్వరుని వక్కాణ. పరిశుద్ధము స్నిగ్ధముకాని ఫలకమునఁ జిత్తరువు నిర్మింపఁబడనట్లే శుద్ధముగాని చిత్తమునందుత్తమ కావ్యము' వలనఁగల్గు రసము స్ఫురింపదు. (ఇందలి భేదములేని భక్తిన్ అనుదానిని 'దిక్కయజ్వ భక్తి భావము'నెడి వేఱొక వ్యాసమున వివరింపఁ గలను.) పరమేశ్వరుఁడిట్లు తిక్కయజ్వను బొగడి వేదవ్యాస కర్తృకమగు భారతము పంచమ వేద మగుటచే జనుల కారాధ్యము. అట్టి దానిని దెనుఁగుబాస నిర్మింపఁ దివురుట భవ్య పురుషార్థ తరుపక్వఫలము; మత్పాద నిరంతర స్మరణ తత్పర భావముగల నీవా ఫలమును మత్పాద పద్మములయందు సమర్పింపుమ'ని కోరెను. తిక్కశర్మయు పరమేశ్వర వచనామృత ములంబున వెల్లిఁగొన మహానందముతోఁ బునఃపునః ప్రణామంబు లాచరించి బహుకాల దీర్ఘ కఠోర తపములకుఁ గాని యనుగ్రహింపని 'య' ప్రతిమేయ ప్రభావ భావనాతీతుఁడగు పరమేశ్వరుఁడు ఆశ్రితుల కత్యంత సులభుఁడని' తెలిసికొని తనబోఁటి బాల స్వభావునకుఁ గూడ నిట్టి మహనీయ మహిమ గల్గెనను సంతసముతోఁ దాను దండ్రి యనుమతి నంది యెట్టి వినయోక్తులఁ బచరించెనో గనుఁడు—

'అఖిలాండపతీ, భవత్కారుణ్యాంబుధి నాదు తుచ్ఛ—చిత్తంబు ననుచితివి. నేను మదీయవాణి

నిన్నుఁ గొనియాడఁజేత నెంతటి పెద్దను? నీ కరుణ నిట్లు పదస్థుఁడనైతిని. ఇంక జన్మాంతర దుఃఖముల్ దొలఁగునట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే' యని. పావనములగు కర్మములవలనఁ దన చిత్తమెంత నిర్మలమైనను బరమేశ్వర సాన్నిధ్యమునఁ దనదు చిత్తమును దుచ్ఛముగా వాకొనుట యెంతయో భక్తికృతమగు వినయము గదా! పరమేశ్వర కరుణా ప్రసాదముననే తాను పదస్థుఁడగుటయే గాని తన యోగ్యత యేమియు లేదని తెల్పుకొనుట యెంతటి నిరహంకారము! మఱియు—జనన మరణ రూప సంసారమును దొలఁగించి తద్దుఃఖముల్బాపి ఆనంద రూపమగు బ్రహ్మాత్మ భావ సంస్థితి రూపమగు మోక్షమును గోరుట యుపలాలితుండగు డింభకుఁడు తన కొలంది యెఱుంగక మహాపదార్థమును వేఁడు విధంబున నున్నదఁట! ఆహా! ఎంత వినయము!! కించిద్విజ్ఞాన లేశమున్నను లేకున్నను దమ్ముఁ బ్రహ్మవేత్తలనుగాను సర్వదా సమాధి నిమగ్నులనుగాను సంభావించుకొను నేఁటి బ్రహ్మవిదాభాసులతోఁ బరిపూర్ణమగు నీ కవి విలసనమున, యాజ్ఞవల్క్యునివంటి విజ్ఞాన సంపన్నుఁడగు తిక్కయజ్వ యెంతటి వినయభావము నగపఱిచెనో వర్ణనాతీతము. పరమేశ్వర చరణకమల సమర్పిత కర్మఫలము గల మహానుభావులకుఁ గల్గు చిత్తశుద్ధియన నిదియే. ఇదియే యీతని పరిణత ప్రజ్ఞకుఁ బరిపక్వ చిత్తవృత్తికి నిదర్శనము.

'అమలోదాత్తమనీష నే
నుభయకావ్య ప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుఁడన్
గళావిదుఁడన్ దిక్కాంకుండన్
సన్మాన్యుఁడన్' అను నీ పూర్వాహంకారము చిత్తశుద్ధిచే నెట్లు పటాపంచలయ్యెనో గనుఁడు! దీనిని బట్టియే నిర్వచనోత్తర రామాయణ రచయితయగు తిక్కనకును, మహాభారత నిర్మాతయగు తిక్కయజ్వకును నంతఃకరణ వృత్తులయందుఁ బోలికయే లేదు. ఆ రెండు గ్రంథములను జదివినచోఁ దిక్కనలోఁ గలిగిన మానసిక పరిణతి మనలకు స్పష్టముగ గోచరించును.

ఇట్లు తిక్కన మహేశ్వరాంఘ్రికమల ధ్యానైకశీలుఁడై తద్ధ్యానైక ఫలముగ విధి విహిత శ్రౌత స్మార్త కర్మాచరణ పరిణతుఁడై హరిహరాత్మక పరమేశ్వరార్పిత కర్మఫలుఁడై తద్ధర్మ ఫలముగా చిత్తశుద్ధి నంది తన పరిశుద్ధ కవితాశక్తితో ధర్మబ్రహ్మ ప్రతిపాదకమై యామ్నాయ రూపము నందిన పారాశర్య భారతము దెలుఁగుసేఁత కుద్యమించి యట్టి యుత్తమకృత్య సంకల్పముచేఁ బారమేశ్వర ప్రత్యక్షము నంది తదనుగ్రహంబున సంసార దుఃఖముల వీడి సమాసాదిత బ్రహ్మభావుఁడై 'అవిద్యయా (విహిత కర్మణా) మృత్యుం తీర్త్వా, విద్యయా (జ్ఞానేన) అమృత మశ్నుతే' (ఈశా. 11) అనెడి యౌపనిషద సూక్తికి విషయుఁడై దాను భావించిన ధర్మాద్వైత స్థితిని దాను గూడనంది గవిబ్రహ్మమూర్తి అయ్యెనని మనము భావించుట యుత్తమము.

ద్రవ్యాలోకం

శ్రీ వి. సి. బాలకృష్ణ శర్మ

ద్రవ్యం మానవసృష్టి. మనిషిచేత సృష్టించబడి, మనిషి మీదనే సర్వాధికారాలూ చెలాయిస్తూన్న ద్రవ్యలక్షణం చాలా చిత్రమైనది. తన పనులు సుఖంగా సాఫీగా నెరవేరడానికి మనిషి ద్రవ్యాన్ని సృష్టించుకున్నాడు. ఏ గడ్డిపోచనైనా మనిషి 'ద్రవ్యం' అని నామకరణంచేసి చెలామణీ చెయ్యగలడు. కాని ద్రవ్యంగా తయారైన తరువాత అది మనిషిచేత ఏ గడ్డినైనా తినిపించగలదు. వేసినప్పుడు వేపకొమ్మా, తీసినప్పుడు అసిరెమ్మా—అన్న సామ్యం ప్రకారం నడుస్తుంది ద్రవ్య వ్యవహారం.

ద్రవ్యం లేకపోతే

ద్రవ్యహీనమైన ప్రపంచంలో వస్తువులకు వస్తువులే వినిమయం చెయ్యబడాలి. అందులో లెక్కలేనన్ని చిక్కులుంటాయి. ఏ మనిషి దగ్గరైనా ఏవో కొన్ని వస్తువులే ఉండడానికి వీలవుతుంది. మరి అతడికి కావలసిన వస్తువులు లెక్కలేనన్ని. తన వస్తువులు అక్కరలేని వాళ్ల దగ్గరే తనకు కావలసిన వస్తువులు చాలావరకూ ఉంటాయి. అప్పుడు వస్తు వినిమయం దుష్కరమవుతుంది. అంతేకాక, లోకంలో ఉన్న కోటానుకోట్ల వస్తువులను ఒక దానితో ఒకటి వినిమయం చెయ్యాలంటే, ప్రతిరెండు వస్తువుల మధ్యా పరస్పరం విలువలు ఏర్పడాలి. అవి అందఱూ అంగీకరించాలి. గుర్తుపెట్టుకోవాలి. తీరాచేస్తే, పెద్ద వస్తువులను ఛిన్నాభిన్నం చెయ్యడానికి వీలుపడదు. చిల్లర వ్యవహారాలకు చిక్కులెక్కువవుతాయి. అంచాత ఈ ఇబ్బందులన్నింటినీ తొలగించడానికి ఒక విధానం అవసరమయింది.

ద్రవ్య సృష్టి

ద్రవ్యాన్ని ఏదో ఒక మంచిరోజు చూసి హఠాత్తుగా ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టినట్లు ఎవ్వరూ ఏర్పాటు చెయ్యలేదు. క్రమక్రమంగా అది ప్రచారంలోనికి వచ్చింది. స్థూలంగా చూస్తే ఈనాడు ద్రవ్యం నాలుగు విధులు నిర్వర్తిస్తూంది: వస్తువులను వినిమయం చెయ్యడానికి మాధ్యస్థంగా ఉంటూంది; వస్తువుల విలువలకు ఒక కొలమానంగా ఉంటూంది; అన్ని వస్తువులనూ యథాతథంగా నిలువ చేసుకోవడం కష్టంగా ఉంటుంది కనుక కావలసినప్పుడు ఏవస్తువు నైనా కొనుక్కునేందుకు వీలుగా వాటి విలువలను మాత్రం నిలువచెయ్యడానికి ద్రవ్యం ఆధారంగా ఉంటుంది; ఇది గాక బాకీలు వాయిదా పడినప్పుడు భవిష్యత్తులో వాటిని చెల్లించడానికి ఆధారంగా ఒక ప్రమాణంగా పని చేస్తుంది. అంటే వినిమయ మాధ్యస్థం (Medium of Exchange) గా, మూల్య మానదండం (Measure of Value) గా, మూల్య నిక్షేపం (Store of Value) గా, ఋణ విమోచన ప్రమాణం (Standard of deferred payments) గా, పని చేస్తుంది. ఈ విధులు నిర్వర్తించడానికి ఏదైనా ఒక వస్తువును ఎన్నుకుని, దాన్ని మనం ద్రవ్యంగా పేర్కొంటూ ఉంటాం.

ద్రవ్య నిర్వహణ

ఏ దేశాని కాదేశం తన ద్రవ్యానికి ప్రత్యేక నామధేయం చేసి చెలామణీ చేసుకుంటుంది. ప్రతి దేశం తన ద్రవ్యంయొక్క యూనిట్‌కు ఒక పేరు పెట్టుకుంటుంది. ఉదాహరణకు భారతదేశంలో దాని పేరు రూపాయి (Rupee). అమెరికాలో డాలర్

(Dollar). ఇంగ్లండ్‌లో పౌండ్ స్టెర్లింగ్ (Pound Sterling). జర్మనీలో మార్క్ (Mark). జపాన్‌లో యెన్ (Yen). రష్యాలో రూబుల్ (Rouble). ఈ విధంగా తలా ఒక పేరూ ఉంటుంది. ఈ ద్రవ్యాన్ని ఏ పదార్థంతో తయారు చెయ్యాలి? అంటే, ఎవరి ఇష్టం వారిది. కాలానుగుణంగా ఆ పదార్థాలు మార్చుతూ ఉండవచ్చును. మొదట్లో బంగారం, తప్ప మరేవీ ద్రవ్యంగా ఉండడానికి పనికి రావను కునేవారు. వ్యవహారాలు పెరిగి, చాలినంత వెండిబంగా రాలు దొరక్కపోవడం, చేతులు మారినప్పుడంతా అరిగిపోవడం, ఎవరి చేతుల్లో పడితే వారికే వాటి మీాద మోజు పెరిగి, అవి బయటపడక పోవడం, ముఖ్యంగా అవి విదేశాలకు వెళ్లినట్లయితే తిరిగి రాక పోవడం, మనుషులకూ దేశాలకూ కూడా సువర్ణదాహం విపరీతం కావడం మొదలైన కారణాలవల్ల వెండి బంగారాలను వెనకవేసి, వట్టి కాగితపు ముక్కలను మాత్రమే ముద్దర్లు కొట్టి ద్రవ్యం క్రింద చెలామణీ చెయ్యడం మొదలుపెట్టారు. దేనికైనా ధనీకరణ (Moneti ation) చెయ్యడానికి ప్రభుత్వాలకు అధి కారం ఉంటుంది. మార్పు చెయ్యడానికికూడా వీలుం టుంది. కనుక కరెన్సీ కాగితాల రంగు, రూపం, పరి మాణం, సంఖ్య, వగైరాలన్నీ స్వేచ్ఛగా మార్చుతూ ఉంటారు. ప్రభుచిత్తం ఏ విధంగా ఉంటే ఆ విధంగా ద్రవ్యరూపం, పరిమాణం మారుతూ ఉంటుంది. 'ధనమూలం మిదంజగత్' అని గ్రహించి ప్రతివారూ ద్రవ్యాన్ని భద్రపరచడం, తమ సంపదను ద్రవ్య రూపంలో లెక్కవేసుకుని ఆధిక్యాన్ని సాధించడం జరుగుతున్నాయి. ఇక్కడ ధనం, ద్రవ్యం, అనే మాటలు ఒకే అర్థంలో ఉపయోగించబడు తున్నాయి. ప్రభుత్వం తలుచుకుంటే దేశంలో ఎంతయినా ద్రవ్యాన్ని సృష్టించి చెలామణీ చెయ్యగలదు. ఐతే ఏవో కొన్ని సూత్రాలను అనుసరించడం మాత్రం ఉంటుంది. కాని ఎంతటి సూత్రాలనైనా ఇట్టే త్రెంచి పారవెయ్యడం, క్రొత్త సూత్రాలు కట్టడం ప్రభుత్వం తలుచుకుంటే ఏమంత కష్టమైన పని? ద్రవ్యంయొక్క పరిమాణం పెరిగినప్పుడు ద్రవ్యో ల్బణం (Inflation) జరిగిందంటారు. ఈ ప్రక్రియ వలన దేశంలో కొందరికి అనవసరంగా చెప్పరాని అగ చాట్లు కలుగుతాయి. మరి కొందరికి అమాంతంగా ఐశ్వర్యం పెరుగుతుంది. ఈ ఫలితాలనన్నింటినీ గుర్తించినప్పటికీ ప్రభుత్వానికి ద్రవ్య పరిమాణాన్ని పెంచడం అప్పుడప్పుడు అత్యావసరమవుతూ ఉంటుంది. దేశరక్షణకోసం యుద్ధం చెయ్యాలంటే అధికంగా ద్రవ్యం కావాలి. ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలంటే ఎక్కువగా ద్రవ్యం కావాలి. అప్పుడు ఆ పనులకోసం వీలైనంతవరకూ పన్నుల ద్వారాగాని, తదితర మార్గాల్లోగాని, అదనంగా ద్రవ్యాన్ని సంపా దించి, చాలకపోతే ప్రజల దగ్గర ఋణాల రూపంలో ద్రవ్యాన్ని సేకరించి, ఇంకా అవసరం తీరకపోతే కాగితపు నోట్లు కొంచెం హెచ్చు సంఖ్యలో అచ్చుకొట్టడం జరుగుతుంది. దీని ఫలితమే స్థూలంగా ద్రవ్యోల్బణం. దీనికే ఆర్థికశాస్త్రవేత్తలు సున్నితమైన సునిశిత మైన నిర్వచనాలు చెబుతారు.

దేనికైనా పరిమాణం పెరిగితే విలువ తగ్గి పోతుందని సామాన్యంగా గుర్తించవచ్చును. ఇంజినీర్లు ఎక్కువ సంఖ్యలో తయారయ్యేవరకూ వాళ్లకు గిరాకీ హెచ్చుగా ఉండేది. వాళ్ల సంఖ్య పెరిగి, వాళ్లకు పనులు దొరకడం కష్టం కావడం, వాళ్ళు చిన్న పనుల్లో చేరడం జరుగుతూంది. అదే విధంగా ఏవస్తువు విషయంలోనైనా విలువ తగ్గడం కనబడు తుంది. కూరగాయలు విపరీతంగా మార్కెట్‌కు వస్తే వాటి ధర పడిపోతుంది. ద్రవ్యోల్బణంలో కూడా ద్రవ్య పరిమాణం ఎక్కువ కావడంతో దాని విలువ తగ్గడం జరుగుతుంది. ఎంతవరకూ ద్రవ్య పరి మాణం పెరిగితే ఎంతవరకూ విలువ తగ్గుతుంది. అసలు తగ్గకుండా కూడా ఉండవచ్చునా, అనే ప్రశ్నలు ఆర్థిక శాస్త్రవేత్తలను గత నూరు సంవత్సరాలనుండి కలవర పెడుతున్నాయి. క్రొత్త సిద్ధాంతాలు బయలుదేరుతున్నాయి. ద్రవ్య పరి మాణం పెరిగినంతమాత్రంచేత పెద్దఫలితాలు కన బడవనీ, ఆ ద్రవ్యం ఆదాయాల (Incomes)

రూపంలో ప్రజల చేతుల్లోపడి వాళ్లు మళ్లీ ఆదాయాలను ఖర్చు (Expenditure)చేస్తే వేరే ఆదాయాలు ఏర్పడతాయనీ, ఈ వర్తులాకారపు ప్రవాహంలో తేడావస్తే ధరల్లో మార్పులు సంభవిస్తాయని ఈ నాడు అంగీకృతమైన సిద్ధాంతం వ్యాప్తిలో ఉంది. ప్రభుత్వపరంగా ద్రవ్యాన్ని సృష్టించి చెలామణీ చేసేఅధికారం కేంద్రబాంక్ (Central Bank)కు ఉంటుంది. దానికి తోడుగా వ్యాపార బాంక్‌లు (Commercial Banks) అప్పులు మంజూరుచేసి, ఆ ఋణాల రూపేణా కొంత ద్రవ్య సృష్టి చేస్తాయి. అది అసలు ద్రవ్యంవలె చట్టసమ్మతం (Legal Tender) కాకపోయినా, వ్యవహారాల్లో ద్రవ్యంచేసే పనిచేస్తూ ద్రవ్య పరిమాణాన్ని పెంచడానికి సహాయపడుతుంది.

విదేశ ద్రవ్యం

ఏదైనా ఒక దేశంలో ఈ ద్రవ్య వ్యవహారాలు నడిచే తీరుకంటె, ప్రపంచదేశాల మధ్య ద్రవ్య సంబంధాలు మరికొంచెం క్లిష్టంగా ఉంటాయి. నిజానికి ద్రవ్యలక్షణం ఎక్కడైనా ఒక్కటే కాని అంతర్జాతీయ ద్రవ్యాలోకంలో కొన్ని ప్రత్యేక ధోరణులు కనబడతాయి. గత రెండు సంవత్సరాలలో అంతర్జాతీయ ద్రవ్య వ్యవహారాలు పడినంత గందరగోళం చాలాకాలం నుండి ప్రపంచంలో లేదు. ఒక దేశానికీ మరొక దేశానికీ మధ్య ఆర్థిక సంబంధాలు తప్పవుగదా! వాటికి అనుబంధాలైనవే ద్రవ్య సంబంధాలు కూడానూ. మన దేశంలో ఒకను మరొకడికి బాకీ పడితే రూపాయల్లో చెల్లిస్తాడు. కాని మనదేశం మరోదేశానికి బాకీపడితే ఈ రూపాయలు చెల్లవు. ఆ దేశానికి మన దేశంలో ఉన్న సరుకేదైనా అవసరముంటే, రూపాయలను తీసుకోవచ్చును. కాని అన్ని వ్యవహారాలూ ఆ విధంగా పరిష్కరించడం అసాధ్యం. ఏదో ఒక ప్రత్యేక పద్ధతి ఏర్పాటుకావాలి. ఒక దేశపు ద్రవ్యానికి మరోదేశపు ద్రవ్యంలో విలువ నిర్ణయించబడాలి. ఈ విధానాన్ని అందరూ అంగీకరించాలి. అప్పుడు ఏదేశపు ద్రవ్యాన్నయినా మనం తీసుకుంటూ ఉండవచ్చును. ఎంచాతనంటే దాని విలువ లోకంలో రూఢిగా ఉంటుంది గనుక. మళ్లీ దాన్ని సుళువుగా చెలామణీ చెయ్యవచ్చు. ఒక దేశపు ద్రవ్యానికి మరోదేశపు ద్రవ్యంలో ఏర్పడిన ధరనే 'విదేశీ మారకం' (Foreign Exchange) అంటారు. దీన్నిమాత్రం ఎవరు నిర్ణయిస్తారు? అసలు ద్రవ్యమే మానవ సృష్టి కనుక విదేశ మారకం కూడా మనుష్యులే నిర్ణయించుకోవాలి. పూర్వం ఒకప్పుడు ప్రపంచంలో స్వర్ణప్రమాణం (Gold Srandard) ఉండేది. అంటే ద్రవ్యం బంగారు నాణేల రూపంలోనే చెలామణీ ఆయ్యేది. లేదా కరెన్సీ నోట్లు బంగారంలో మార్చుకునే అవకాశం ఉండేది. కొన్ని దేశాలు రజత ప్రమాణం (Silver Srandard) అనుసరించేవి. అక్కడ వెండినాణేలు అమల్లో ఉండేవి. ఉదాహరణకు మనదేశంలో 1835 వరకూ అనేక రకాల వెండి బంగారు నాణేలు మెసులుతూ ఉండగా, ఆ గందరగోళాన్ని విడదీసి, తూర్పు ఇండియా కంపెనీ అప్పుడు రజత ప్రమాణాన్ని ప్రవేశపెట్టింది. దాని ప్రకారం ఒక వెండి రూపాయిలో 165 గ్రెయినుల స్వచ్ఛమైన వెండి, 15 గ్రెయినుల మిశ్రమం కలిపి మొత్తం 180 గ్రెయినుల కల్తీ వెండి ఉండేది. ఆభరణాలు తయారు చెయ్యడానికైనా బంగారంలో రాగి కలపడం పరిపాటే. ఈ రకం వెండి రూపాయిలో 11/12 వంతు స్వచ్ఛతగల వెండి ఉందన్నమాట. ఇంకో దేశంలో వెండి నాణెం చలామణీ అవుతూ ఉంటే, దానికీ వెండి రూపాయకూ మధ్య సంబంధం ఆయా నాణేలలోని స్వచ్ఛమైన వెండినిబట్టి అప్రయత్నంగానే ఏర్పడుతూ ఉంటుంది. అదే విదేశీ మారకపు రేటు (Foreign Exchange Rate) ఈ విధంగానే స్వర్ణప్రమాణం ఉపయోగించే దేశాలలో ఆయా నాణేలలోని బంగారాన్నిబట్టి ఒక ద్రవ్యానికి మరో ద్రవ్యంలో విలువ తేలుతుంది. రజతప్రమాణ దేశానికీ, స్వర్ణప్రమాణ దేశానికీ మధ్య ద్రవ్యపు మారకం రేటును నిర్ణయించడంకూడా తేలికే. లోకంలో బంగారానికి వెండికీ మధ్యగల సంబంధాన్ని బట్టి అది ఏర్పడుతుంది. ఈ విధంగా ఏర్పడిన

రేట్లు సుస్థిరంగా ఉంటాయి. ఇట్లా ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం కాకుండా స్వేచ్ఛా విపణి (Free Market) లో వేరే రేటు నెలకొంటే, ఆయా ద్రవ్యాలను ప్రభుత్వ ఖజానాలలో అసలు రేటుకు మార్చుకునే అవకాశం ఉంటుంది, గనుక మార్కెట్ రేటులో ఎక్కువ తేడా రాదు. కొద్ది తేడా పరిగణించ దగినదికాదు. ప్రపంచంలో ప్రముఖ దేశాలు స్వర్ణ ప్రమాణాన్ని అనుసరించి నన్నాళ్ళూ విదేశీమారకం నిర్ణయించడంలో కష్టాలు లేవు. అప్పుడు ఇంగ్లండ్‌లో ఉపయోగించబడే పౌండ్‌లో 113.0016 గ్రెయినుల స్వచ్ఛ సువర్ణం ఉండేది. అమెరికాలో బంగారపు ఈగిల్ (Golden Eagle) అనే నాణెం ఉండేది. దాని విలువ పది డాలర్లు. ఈగిల్‌లో 232.2 గ్రెయినుల స్వచ్ఛ సువర్ణం ఉండేది. దాన్నిబట్టి ఒక్క డాలరులోఉన్న బంగారాన్ని లెక్కవేసి, ఆధారంగా చేసుకుని, ఒక పౌండ్‌కు ఎన్ని డాలర్లో నిశ్చయించ డానికి వేరే సూత్రాలూ అంగీకారాలూ అక్కర్లేదు. అందులో ఉన్న బంగారాలను సరిపోల్చిచూస్తే సరి. ఆ విధంగా ఒక పౌండుకు 4.8665 డాలర్లు అని విలువ తేలింది.

విదేశద్రవ్య మారకపు రేటు నిర్ణయించడం

బంగారు ప్రమాణం 1930 తరువాత పడిపోయింది. అప్పటినుంచి ఇతర ఆధారాలను బట్టి విదేశీ మారకపు రేటు ఏర్పాటు కావలసివచ్చింది. దేశ దేశాల ద్రవ్యాలయొక్క కొనుగోలు శక్తులనుబట్టి వాటి మారకపు రేటు ఏర్పాటు కావడం ఒక పద్ధతి. విదేశాలకు చెయ్యవలసిన చెల్లింపులకూ విదేశాలనుండి వచ్చే రాబడికీ తూకం (Balance of Payments) చేయడం, దాన్నిబట్టి ఆ దేశపు ద్రవ్యానికి లోకంలో ఉన్న విలువను మార్చుతూఉండడం మరో పద్ధతి. ఇది ఎవరికి నచ్చిన విధంగా వారు నిర్ణయించుకుని అనుక్షణం తమ అవకాశాలనూ ప్రయోజనాలనూ అనుసరించి మార్పు చేస్తూఉంటే, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలలో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడతాయి. శాశ్వతంగా సుస్థిరంగా ఉంచి మార్పుచెయ్యడానికి వీలులేకుండా, అన్ని దేశాలూ తమ విదేశీ మారకపు రేటును నిర్ణయించడానికి వీలైన పరిస్థితులు స్వర్ణప్రమాణం పతనమైన తరువాత ఉద్భవించలేదు. అంతేకాకుండా అటువంటి శాశ్వత నిర్ణయాలుచేసి, ఫలితంగా ఏర్పడిన మారకపు రేటును సంరక్షించుతూ ఉండాలంటే, దేశంలో ఆర్థిక కార్యకలాపాలన్నింటినీ తదనుగుణంగా మార్పుచేస్తూఉండాలి. ఏ దేశానికైనా అంతర్దేశీయ ఆదాయాలూ, ధరలూ, ఉపాధి సౌకర్యాలూ, నిరుద్యోగితా సమస్యలూ ప్రాణాంతకంగా ఉంటాయి. ఇటువంటి నిర్ణయాలను తృణీకరించి, విదేశీ మారకపురేటు నిర్ణయంకోసం వీటిని మార్పు చెయ్యడం అవివేకం. ప్రపంచంలో స్వర్ణప్రమాణం పతనం కావడానికి ఇది ఒక ప్రముఖ కారణం. స్వర్ణ ప్రమాణం అంటే మార్పుచెయ్యడానికి వీలుకాని విదేశ మారకపు రేటు పద్ధతి. ఆర్థికాభివృద్ధి, ఆర్థిక సమ తౌల్యం, సంపూర్ణ ఉద్యోగితా సాధన, మొదలైన ఆశయాలు ఉత్కృష్టమైనవని ఈ రోజుల్లో అన్ని దేశాలూ భావిస్తున్నాయి. ఇటువంటప్పుడు స్వర్ణ ప్రమాణంలో తప్పక ఆవశ్యకమయ్యే సుస్థిర విదేశీ మారకపు రేటు అసాధ్యం. ఈ మహత్తర ఆర్థిక లక్ష్యాలకోసం మారకపు రేటును మార్చగలిగే సౌకర్యం కావాలి. ఐతే ఎప్పటికప్పుడు వీలు వెంబడిని మార్పులు పొందుతూఉండే రేటు కూడా ప్రమాదకరమే. స్వర్ణ ప్రమాణం పోయిన తరువాత అట్లాంటి పరిస్థితులు ఎన్నో ఏర్పడి, లెక్కలేనన్ని సమస్యలు ఉత్పన్నమై, ఎన్నో మార్గాల్లో అవి పరిష్కరించబడేవి. ఆ సందర్భంగా విదేశీ మారకం మీద కఠినమైన నిర్బంధాలు (Exchange Controls) విధించవలసి వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం నాటికి ఈ సమస్యలు మరింత క్లిష్టంగా తయారైనాయి. ఈ పరిస్థితులన్నీ అవగాహన చేసుకుని వివిధ దేశాల మేధావులంతా కలిసి అంతర్జాతీయ ద్రవ్యనిధి (International Monetary fund)ని ఏర్పాటు చేశారు.

ద్రవ్యనిధి

అంతర్జాతీయ ద్రవ్యనిధి అంటే ప్రపంచ దేశాలమధ్య ద్రవ్య సంబంధాల పరిష్కారానికి నెల

కొల్పబడిన ఒక సంస్థ. ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం గల దేశాలన్నింటికీ ఈ ద్రవ్య నిధిలో సభ్యత్వానికి అర్హత ఉంది ద్రవ్యనిధి నిబంధనావళి IV వది విదేశ మారకపు రేటును గురించి చెప్పింది. అందులో ఒకటవ విభాగం (Section) లో నిర్దేశించబడిన ప్రకారం ప్రతిదేశమూ తన ద్రవ్యానికి ఒక మారకపు రేటును నిర యించి ప్రకటించాలి. అది ఏ ద్రవ్యంలో నిర్ణయించ బడాలి? అనే ప్రశ్న వస్తుంది. బంగారం లోనే ప్రతిదేశపు ద్రవ్యానికీ ఒక విలువ ప్రకటించ బడాలి. లేదా, ప్రతిదేశపు ద్రవ్యంయొక్క విలువనూ అమెరికా దేశపు డాలర్లలో ప్రకటించాలి. ద్రవ్యనిధి స్థాపనకు సమావేశాలు 1944 జూలై నెలలో ఇంచుమించు చివరకు వచ్చాయి. అప్పుడు డాలరు ప్రపంచంలో ఉత్కృష్ట స్థానంలో బలిష్ఠంగా ఉండేది. డాలరు బంగారంతో సమానం. ఒక డాలరుకు 0.888671 గ్రాముల స్వచ్ఛసువర్ణం. కావలిస్తే ఏ దేశమైనా డాలర్లను సంపాదించి బంగారంలోనికి మార్చుకోవచ్చును. అంచాత 1944 జూలై ఒకటవ తేదీ నాటికి డాలర్‌కుగల బంగారు విలువను అనుస రించి ప్రతిదేశం తన ద్రవ్యానికి ఎంత బంగారమో ఎన్ని డాలర్లో, నిర్ణయించి ప్రకటించింది. అప్పటికి ప్రతిదేశానికీ ఉన్న విదేశ వ్యాపారం, ఆ దేశ ద్రవ్యా నికి లోకంలోఉన్న చెలామణీ రేటు, పరిగణనలోనికి తీసుకుని ఈ ఏర్పాటు చెయ్యబడింది. ప్రతిదేశం తన ద్రవ్యపు విలువను ప్రకటించే ముందు ఇతర దేశాల తోనూ, ద్రవ్యనిధితోనూ, సంప్రతింపులుచేసి నిర్ణ యించింది. ఏ దేశం ప్రతిపాదించిన విలువకైనా, ప్రత్యామ్నాయ విలువను సగాచించే హక్కు ద్రవ్య నిధికి ఉన్నా, సుమారు ఆయాదేశాలు స్వయంగా ప్రతిపాదించిన విలువలనే ద్రవ్యనిధి అంగీకరించింది. ఒకసారి ప్రకటితమైన విలువను మార్పు చెయ్యడాన్ని గురించి ద్రవ్యనిధి సూత్రాల్లో నాలుగో నిబంధనలో, 5 వ విభాగంలో వివరించబడింది. ఈ విధానంలో తఱుచుగా మార్పులు చెయ్యడం ఉండదు. కాని అవసరమైతే 10% వఱకూ స్వేచ్ఛగా మార్చుకో వచ్చును. ఆ పరిమితి దాటితే ద్రవ్యనిధితో సంప్ర తించాలి.

ద్రవ్యపు విలువ తగ్గించడం

ఈ విధానం సుమారు ఒక పావు శతాబ్దంపాటు సజావుగా జరిగిపోయింది. అంటే ప్రపంచ ద్రవ్య వ్యవహారాల్లో వడిదుడుకులు రాలేదని కాదు. వచ్చినా ఈ విధానంలో సులభంగా సర్దుబాట్లు జరిగాయి. చాలా దేశాలు తమ ద్రవ్యపు ప్రకటిత విలువలను తగ్గించుకున్నాయి.అదే డివాల్యుయేషన్ (Devaluation) అనబడుతుంది. ఉదాహరణకు భారతదేశం రెండుసార్లు రూపాయ విలువను తగ్గించింది. 1949 సెప్టెంబర్ 20 వ తేదీకి పూర్వం, రూపాయికి బంగారపు విలువ 0.268691 గ్రాములు. ఇది అంతర్జాతీయ ద్రవ్య నిధి సభ్యత్వం వచ్చినప్పుడు ప్రకటించబడింది. ఈ ధర ప్రకారం భారతదేశంలో బంగారం బాహాటంగా మార్కెట్లో దొరుకుతుందని కాదు. అంతర్జాతీయ వ్యవహారాల్లో రూపాయిని ఆ స్థాయిలో అంగీకరిస్తారు. తరువాత 1949 విలువ తగ్గింపు మూలంగా 0.186621 గ్రాములకు దిగిపోయింది. మళ్లీ 1966 జూన్‌లో జరిగిన తగ్గింపు మూలంగా 0.118489 గ్రాములకు పడిపోయింది. ఈ విధంగా ఎన్నో దేశాలు విలువ తగ్గించుకున్నాయి. ఇది అంతగా గర్హించదగిన విషయం కాదు. ఆలోచనా పూర్వకంగా అటువంటి మార్పు చేసినందువలన కొన్ని సత్ఫలితాలు కూడా ఉంటాయని నిశ్చయంగా చెప్పవచ్చును. మార్పు సహజం. ఈ రోజుల్లో లోకంలోని ఉత్కృష్టమైన విషయాలకే, శాశ్వత సత్యాలకే, మార్పులు వస్తు న్నాయి. ద్రవ్యపు విలువ మారడం అసహజం కాదు. దాన్ని గుర్తించి సర్దుబాట్లు చేసుకోవడంలో నేర్పు కావాలి. ప్రపంచంలో చాలా మార్పులు వచ్చాయి. ఏ సిద్ధాంతమైనా చలనాత్మక ప్రపంచంలో ఒక శాశ్వత స్థానంలో కూర్చోవడం కష్టం. కాని ద్రవ్య వ్యవహా రాల్లో వచ్చే మార్పులు క్లిష్టంగా ఉండి తీవ్ర సమస్య లకు దారితీస్తాయి.

అంతర్జాతీయ ద్రవ్యావసరాలు

మామూలు ప్రజల్లో గొప్పవాళ్లూ పేదవాళ్లూ ఉన్నట్టే, దేశాల్లో కూడా ఉంటాయి. కష్టపడి పని చేసి తెలివితేటలతో ఆర్థికాభివృద్ధి సాధించిన దేశాలకు ప్రపంచస్థాయిలో గొప్పతనం రాకతప్పదు. దేశం లోకంలో అప్పులు చేస్తుంది, ఆస్తులు సంపాదిస్తుంది. ఆ రెండింటికీ మధ్యనున్న తేడాలోనే ఆ దేశపు గొప్పతనం విదితమవుతుంది. ఇందులో ఒక రకపు గొప్పతన మేమిటంటే, ఒక దేశపు ద్రవ్యానికి విదేశీ మారకపు రేటు ఏ స్థాయిలో ఉంది? అనుకూలంగా మార్పు పొందుతూన్నదా? ప్రతికూలంగానా?—అనే విషయం. ద్రవ్యనిధి స్థాపన జరిగిన తొలి రోజుల్లో డాలరు దైవతుల్యంగా ఉండేది. దాని తరువాత స్థానాన్ని ఇంగ్లీషువారి పౌండు స్టెర్లింగ్‌కు ఇచ్చారు. ఈ ద్రవ్యాల గొప్పతనాన్ని గుర్తించడానికి ఒక సూచన ఏమిటంటే, ప్రతిదేశం తన అంతర్జాతీయ ద్రవ్య నిక్షేపాల (Monetary Reserves) ను డాలర్లలోనో స్టెర్లింగ్‌లోనో నిలువ చేసుకునే ఆచారం ఏర్పడింది. ఆ ద్రవ్యాలను సంపాదించుకోడానికి విశ్వప్రయత్నాలు చేసేవారు. రెండవ ప్రపంచ యుద్ధం పూర్తికాగానే యూరప్‌లోని దేశాలన్నీ నేలమట్టమై పునర్నిర్మాణ ప్రయత్నంలో అష్టకష్టాలు పడుతూ ఉండేవి. ఆనాడు ఒక్క డాలరు మాత్రమే చీకూ చింతా లేని స్థితిలో ఉండేది. ఆహారధాన్యాల మొదలు యంత్రసామగ్రి వరకూ సర్వం అమెరికాలో లభించేవి. వాటిని కొనడానికి అమెరికన్ ద్రవ్యమైన డాలరును సంపాదించడం ఎట్లాగ? అనేది గడ్డుసమస్యగా తయారైంది. అప్పుడు అమెరికానుంచి మార్షల్ సహాయం (Marshall Aid) అనే పథకం బయలుదేరింది.

మార్షల్ సహాయ పథకం ఆనాటి యూరప్ దేశాలకు అమృతవర్షంలాంటి డాలర్ వర్షం కురిపించింది. సగం చచ్చి పడిఉన్న దేశాలన్నీ మళ్లీ ఆర్థిక జీవనాన్ని పుంజుకున్నాయి. 1947 జూన్ 5 వ తేదీన జార్జి మార్షల్ హార్వర్డ్ యూనివర్సిటీలో ఒక మహోపన్యాసం చేస్తూ, అమెరికాకు ఇటువంటి సహాయంచేసే అభిలాష ఉన్నట్టు వెల్లడి చేశాడు. వెంటనే యూరప్‌లో ఒక్క నెలలోనే ఒక ఆర్థిక సహకార సంఘం పుట్టింది. అది ఒక సంవత్సర మయేసరికి బృహత్ సంస్థగా తయారైంది. (Organisation of European Economic Co-operation–O. E. E. C.) ఈలోగానే ఫ్రాన్సు, ఆస్ట్రియా, ఇటలీ దేశాలకు 522 మిలియన్ల డాలర్ల సహాయం ప్రకటితమైంది. పాల్ హాఫ్‌మన్ (Paul G. Hoffman) ఈ ఆర్థిక సహకార కార్యక్రమానికి పరిపాలనా నిర్వాహకుడైనాడు. అవరల్ హారిమన్ (Averell Harriman) అమెరికా తరఫున యూరప్‌లో ప్రత్యేక ప్రతినిధిగా నియమింపబడ్డాడు. ఈ మార్షల్ సహాయంతో ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, మొదలైన యూరప్ దేశాలన్నీ ఆర్థిక పునర్నిర్మాణం సుస్థిరంగా చేసుకున్నాయి. అచిరకాలంలో మంచి పటిష్ఠస్థానాన్ని పొందాయి. జర్మనీ విషయం అన్నిటికంటె విచిత్రమైనది. యుద్ధంలో అణగారిపోయి, రెండు భాగాలుగా చీల్చబడిన దేశం జర్మనీ. అందులో పశ్చిమ జర్మనీ అద్భుతమైన ఆర్థిక విధానాలు చేపట్టి అత్యధికమైన స్వయంకృషితో ఆశ్చర్యకరమైన ఆర్థిక సామర్థ్యాన్ని సాధించింది. అంతకంటె విపరీతమైన ప్రగతిని సాధించిన దేశం తూర్పున జపాన్. యుద్ధంలో చావుదెబ్బలు తిని, అటంబాంబు ధాటికి తట్టుకుని, యుద్ధంలో ప్రపంచాన్ని దింపినందుకు నష్టపరిహారాలు చెల్లించుకుని, చిన్నద్వీపంలో ఇమిడిఉన్నా, ఆర్థికంగా మహాకాయాన్నీ విశ్వరూపాన్నీ ప్రదర్శించగలిగిన దేశం జపాన్. జర్మనీ జపాన్‌ల ఆర్థిక దార్ఢ్యంమూలంగా అంతర్జాతీయ వ్యాపారాల్లో మిగులు (Surplus) దేశాలుగా తయారైనాయి. అందువలన జర్మన్‌దేశపు మార్క్, జపాన్‌దేశపు యెన్, ప్రపంచంలో బలిష్ఠమైన ద్రవ్యాలుగా తయారైనాయి.

బ్రిటన్ · స్టెర్లింగ్

ఒక ప్రక్క జర్మనీ జపానుల ద్రవ్యాలు ఆధిక్యత పొందుతూఉంటే, అదివరకు ఆధిక్యతలో ఉన్న డాలర్, స్టెర్లింగ్‌లు తమ ఔన్నత్యాన్ని వదిలి కొంచెం

కొంచెం దిగజారడం మొదలుపెట్టాయి. ‘మొదట స్టెర్లింగ్‌కు ఈ ధోరణి పట్టింది. ఈ మధ్య సుసాన్ స్ట్రేంజ్ (Susan Strange) అనే రచయిత స్టెర్లింగ్ మీద ఒక గ్రంథం వ్రాస్తూ, ప్రపంచంలోని ద్రవ్యాలను (Currencies) నాలుగు రకాలుగా విభజించాడు: అవి అగ్రస్థాయి ద్రవ్యాలు (Top Currencies), నాయక ద్రవ్యాలు (Master Currencies), తటస్థ ద్రవ్యాలు (Neutral Currencies), లావాదేవీ ద్రవ్యాలు (Negotiated Currencies). అంతర్జాతీయ వ్యవహారాలన్నింటికీ ఉపయోగించే ద్రవ్యం అగ్రస్థాయికి చెందినది. దాని శక్తి దేశ ఆర్థిక సంపన్నత మీద ఆధారపడుతుంది. నాయకద్రవ్యం కూడా ప్రపంచ ద్రవ్య వ్యవహారాల్లో నాయకత్వం వహిస్తుంది కాని దీనికి ఆర్థిక స్తోమత కాకుండా రాజకీయమైన పలుకుబడి ఆధారం. ఏదేశానికి బాగా నోరుంటే ఆ దేశ ద్రవ్యం ఈ తరగతికి చెందుతుంది. స్టెర్లింగ్‌ది ఆ స్థితిగా ఉండేది. తటస్థ ద్రవ్యం తన బలం తాను సంపాదించుకున్నదే కాని నాయకత్వంవరకూ రాదు. లావాదేవీ ద్రవ్యం ఏదోవిధంగా తనకు నష్టం లేకుండా సంప్రతింపులమీదా, సంధి బేరాలమీదా ఆధారపడి జీవయాత్ర గౌరవంగా సాగిస్తుంది. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం చితికి చిన్నదైనందువలన స్టెర్లింగ్‌కు కొంత అధోగతి వచ్చిందని ఒక అభిప్రాయం ఉంది. నిజానికి స్టెర్లింగ్ ప్రపంచంలో ఒక శతాబ్దంపాటు ఏకచ్ఛత్రాధిపత్యం చేసింది. ఏదేశానికైనా ఇంగ్లండ్‌లో స్టెర్లింగ్ రూపేణా నిలువలు కావలసి ఉండేవి. ప్రపంచ వ్యాపారమంతా ఇంగ్లండ్‌లోని కేంద్ర బ్యాంక్ ద్వారా నడిచేది. ప్రపంచ ద్రవ్య రక్తప్రసరణానికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ (Bank of England) ఒక హృదయంవలె పని చేసేది. రెండవ యుద్ధం తరువాత ఆ దేశానికి స్థితిగతులు మారిపోయాయి. ప్రపంచం మేలుకుంది. వలసతత్వాన్ని కూలద్రొయ్యడానికి అందరూ సన్నద్ధులైన సమయంలో బ్రిటన్ చాలా ఉదారంగా ప్రవర్తించి అంతవరకూ చెలాయించిన అధికారానికి తృప్తిపడి సన్నసన్నగా తప్పుకుని పెద్దమనిషి తరహా చూపించింది. ఈనాటికైనా బ్రిటన్, ఎన్నోవిధాల మార్గదర్శిగా ఉంది. కాని కష్టాలు పెరిగి 1949 లో ఒకసారి, 1967 లో రెండోసారి స్టెర్లింగుకు విలువ తగ్గింపు (Devaluation) జరిగింది. విదేశ వ్యాపారాల్లో నిలకడ సాధించడానికే విలువ తగ్గింపు అవసరమైంది. సూయజ్ కాలువ మూసివెయ్యడం, అరబ్బీదేశాల తగువుల మూలంగా నూనె దిగుమతికి ఖర్చు పెరగడం, దేశంలో హఠాత్తుగా అతివిజయవంతమైన సమ్మెలు జరగడం ద్వారా ఆర్థికవ్యవస్థ దెబ్బతినడం, ఇటువంటి కారణాలవలన స్టెర్లింగ్‌కు కొంత పతనం వచ్చింది.

అమెరికా : డాలరు

అమెరికాలో కూడా పరిస్థితులు నెమ్మదిగా మార్పు పొందాయి. మార్షల్ సహాయంతో ప్రారంభమైన ఖర్చులు క్రమంగా పెరిగిపోయాయి. అమెరికా ప్రపంచ పోలీసు వృత్తికి దిగవలసివచ్చింది. కొరియా యుద్ధం, ముఖ్యంగా వియత్నాం యుద్ధం, విపరీతమైన డాలర్ ప్రవాహానికి దారితీసాయి. అంతరిక్షగమనాలూ, అడిగినా అడక్కపోయినా అప్పులియ్యడం, దానధర్మాలూ ఎక్కువైనాయి. దీనికితోడు ఉత్తర అట్లాంటిక్, కేంద్ర ఆసియా, ఆగ్నేయ ఆసియా మొదలైన ఒడంబడికలు. ఇందులో చిక్కుకుని అమెరికా ప్రపంచ వ్యాప్తంగా మిలిటరీ బందోబస్తుకోసం ఖర్చు పెంచింది. రహస్య సమాచారాలు సేకరించడం వగైరా ఖర్చులు మరికొన్ని. ఈ విధంగా ప్రపంచంలో అన్ని ప్రాంతాలలోనూ ఎక్కడ యుద్ధం జరిగినా అమెరికన్ సామగ్రితోనే జరగాలి. ఎక్కడ అభివృద్ధి కార్యక్రమాలైనా అమెరికన్ డాలర్లతోనే జరగాలి. అంచాత లోకమంతటా డాలర్లు వెదజల్లబడ్డాయి. దీనికి తోడు విదేశ వ్యాపారంలో మిగులు అంతరించడం 1960 లో మొదలైంది. అంతవరకూ అదనంగా వస్తూన్న వ్యాపారపు మిగులులో ఈ ఖర్చులు కొంత మేరకు సర్దుకునేవి. 1971 వచ్చేసరికి అంతర్జాతీయ వ్యాపారంలో తరుగు (Deficit) వచ్చింది. ఈ విధంగా రావడం 1893 నుంచి ఇది తొలిసారి. అమెరికన్ వస్తువులకు ధరలు విపరీతంగా పెరగ

డమే దీనికి కారణం. ద్రవ్యోల్బణం ద్వారా ఆ ఫలితం వచ్చింది. 1971 లో రెండు బిలియనుల డాలర్ల వ్యాపారపు లోటు (Deficit) కనబడింది. (బిలియన్‌కు వెయ్యి మిలియనులు; అంటే నూరు కోట్లు) డాలర్లు అధిక సంఖ్యలో ప్రపంచంలో తిరుగుతూ ఉండేసరికి, ఆర్థికంగా బలపడిన దేశాల్లో దాని విలువ తగ్గడం మొదలైంది. డాలర్లు కూడబెట్టిన దేశాల్లో డాలర్ మీద మోజు తగ్గి, డాలర్లను బంగారంలోకి మార్చుకోవాలనే ఆరాటం బయలుదేరింది. అందరికంటె అమెరికాలో బంగారపు నిలువలు అధికమే ఐనా, అవి చాలాకాలంనుండి తగ్గుముఖం పట్టాయి. బంగారంలోకి మ రే అవకాశం ఒక్క డాలరుకేఉంది. అందుకే డాలరు అంతర్జాతీయ మూల్య నిక్షేపం (International Store of Value) గా అంగీకరించబడి, బంగారంతో తుల్యంగా గౌరవించబడుతూ ఉండేది. కాని ఈ గౌరవం నిలబడాలంటే డాలర్లను మార్చుకోదలచిన దేశాలన్నింటికీ బంగారం పంచిపెట్టాలి. అంటే బంగారు కోటయైన నాక్స్ కోట (Fort Knox) ను ఖాళీ చెయ్యవలసిందే. 1971 నాటికి సుమారు 10 బిలియనుల విలువగల బంగారం అక్కడ నిలువ ఉంది. కాని అప్పుడు చెల్లించవలసిన తాత్కాలిక బకాయిలు సుమారు 35 బిలియన్ల మేరకు కనబడ్డాయి. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో ధైర్యంగా కొన్ని విప్లవాత్మక చర్యలు తీసుకోవడం అమెరికా ప్రభుత్వానికి తప్పనిసరి అయింది.

1971 లో డాలర్ సమస్య

1971 ఆగస్టు 16 వ తేదీన అమెరికా తీసుకున్న చర్య లో మొదటిది : అంతవరకూ సమస్త విదేశ కేంద్ర బాంకుల (Foreign Central Banks) కూ, డాలర్లను బంగారంలోనికి మార్చి చెలిస్తామని ఇచ్చిన హామీని తాత్కాలికంగా రద్దు చెయ్యడం. దీనితో డాలరు కూడా సుమారు సామాన్యస్థితికి వచ్చి అన్ని ద్రవ్యాలతోబాటూ సమాన గౌరవానికి దిగిపోయి నట్లే. గౌరవం అలా ఉంచి విలువ కూడా పడిపోకుండా మరికొన్ని చర్యలు అవసరమైనాయి. ధరల మీదా, వేతనాలమీదా 10% బిగింపు (Freeze) విధించబడింది. చాలా రకాల దిగుమతులమీద 10% అదనపు సుంకం వెయ్యబడింది. విదేశాలకుచేసే ఆర్థిక సహాయాలమీద 10% కోత వెయ్యబడింది. ఇంకా కేంద్రప్రభుత్వ ఖర్చులుకూడా తగ్గించబడ్డాయి. ఐతే ఇవన్నీ తాత్కాలిక చర్యలే అని అమెరికా అధ్యక్షుని ప్రకటన. అంతటితో ఆగకుండా, ఇతర ప్రముఖదేశాల ద్రవ్యాలకూ డాలరుకూ ఉన్న సంబంధాలను సమీక్షించి క్రొత్త సంబంధాలను ఏర్పరచడానికి సంప్రతింపులు ప్రారంభం చెయ్యబడ్డాయి. ఆర్థిక దార్ఢ్యాన్ని సంపాదించిన దేశాలు, ముఖ్యంగా జపాన్, పశ్చిమ జర్మనీ, నెదర్లాండ్స్, ఇటలీ, ఫ్రాన్సు, బెల్జియం, స్విట్జర్లండ్ లు. తమ ద్రవ్యపు విలువలు తక్కువ స్థాయిలోనే ఉంచి, అవి తద్వారా ప్రపంచ వ్యాపారంలో మిగులు సాధిస్తున్నాయి. ఆ దేశాలు తమ ద్రవ్యానికి విలువను సర్దుబాటు (Revaluation) చేసి పెంచితే, డాలరుకు కొంత చిక్కు తగ్గుతుంది. అప్పుడు ఆ దేశాల దిగుమతులు అమెరికాను అంతగా బాధించవు. డాలరు విలువ స్వేచ్ఛా విపణుల (Free markets)లో దిగజారుతూ, ఎక్కువమంది డాలర్లను అమ్మజూపడంతో, ప్రపంచ ద్రవ్యాలలో ముఖ్యంగా మార్కుకూ యెన్‌కూ ఒత్తిడి ఎక్కువైంది. మార్కు అప్పటికే ప్రపంచ ద్రవ్య సముద్రంలో స్వేచ్ఛగా తేలుతూ ప్రవాహవశంగా ఉండడం (floating) ప్రారంభించింది. హఠాత్తుగా అమెరికా ఈ చర్యలు తీసుకోగానే ప్రపంచ రాజధానులన్నింటిలోనూ కలవరం బయలుదేరింది. విదేశీ ద్రవ్య విపణులన్నీ మూతబడ్డాయి. చెకర్స్‌లో విశ్రాంతి తీసుకుంటూన్న ఆంగ్ల ప్రధాని ఎడ్వర్డ్ హీత్ రాజధానికి తిరిగి వెళ్లవలసి వచ్చింది. ఈ అమెరికన్ చర్యలు జపాన్‌కు మహాబాధ కలిగించాయి. 1970 లో జపాన్‌నుండి అమెరికాకు ఎగుమతులు సుమారు 6000 మిలియన్ల డాలర్లు. డాలరంటె అప్పటికి రు. 7—50. ఈ చర్యల వలన జపాన్ ఎగుమతులు 1500 మిలియన్ల డాలర్లయినా తగ్గిపోయే సూచన కనబడింది. అమెరికన్

ప్రజలకు జపాన్‌వారి మోటారు కార్లూ, ట్రాన్సిస్టర్ టెలివిజన్ సెట్లూ, ఇతర సరదా వస్తువులూ అంటే అమితమైన మోజు. ధరకూడా అమెరికా వస్తువుల కంటె చౌక. డాలరుకు గల కష్టాలకు ఇది పెద్ద కారణం.

అప్పటికే యూరప్ ఉమ్మడి మార్కెట్ (European Common Market) లో సభ్యులైన ఆరు దేశాలూ కలిసి, డాలర్‌ను ఎదుర్కోడానికి ఒక నిర్ణయం తీసుకోవాలని యత్నిస్తూ ఉండేవి కాని అంగీకార మేదీ కుదరలేదు. అమెరికా దిగుమతి సుంకం పెంచడం ఎవ్వరికీ ఇష్టంలేదు. ప్రత్యామ్నాయంగా ఏమి చెయ్యవలసినదీ ఎవరికీ స్పష్టంగా తెలియదు. డాలరు విలువ తగ్గించాలని అందరూ అంటే, మార్కు, యెన్‌ల విలువ పెరగాలని అమెరికా అంటుంది. అసలు ముందు ఉమ్మడి మార్కెట్ ద్రవ్యాలు పరస్పరంగా మారకపు రేటును ఒక త్రాటి మీదకు తేవడం డాలర్‌తో వ్యవహారంకంటె కూడా అత్యవసరమయింది. ఏది ఏమైనా డాలర్ గాని పతనమైతే అన్నిద్రవ్యాలకూ క్రమంగా ఆ గతే పట్టవచ్చునన్న పరమసత్యాన్ని అందరూ గ్రహించారు. అంచాత డాలరును అధోగతిలో పడవెయ్యాలనే దుస్సంకల్పం ఎవరికీ రాలేదు. రష్యావంటి కమ్యూనిష్టు దేశాలు అంతర్జాతీయ ద్రవ్యనిధి వ్యవహారాలకు దూరంగా ఉండి, ప్రతి దేశంతోనూ అవసరమైనంత మట్టుకే సంబంధం పెట్టుకుంటూ ఉండిపోయాయి. తక్కినవారు కూడా 'ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటికా రేటు' సిద్ధాంతాన్ని అనుసరించారు. ఫ్రాన్స్ తన ఫ్రాంక్ (Franc) కు ద్విముఖమైన (Two lier) మారకపు రేటును ప్రకటించింది. ఒకటి అధికార రీత్యా జరిగే వ్యవహారాలకూ, రెండోది స్వేచ్ఛా ద్రవ్య విపణికీ, అనుసంధించి ఉంటాయి. జపాన్ కూడా జర్మనీలాగే తన ద్రవ్యమారకపు రేటును గాలికి వదిలేసింది. బక్కదేశాలు మతిపోయి ఏ విధానం మంచిదో తెలియని అయోమయ స్థితిలో ఉండిపోయాయి. కొందరు గోడమీాది పిల్లి విధానం అనుసరించారు. ఈ గందరగోళాన్ని పరికించి, ద్రవ్యనిధి ప్రధానాధికారి ష్క్విట్‌జర్ (Schwitzer) 'ఇది చివరకు ప్రపంచాన్ని స్వర్ణ ప్రమాణాని (Gold Standard) కి తీసుకుని పోక తప్పద'న్నాడు. ఈ అస్తవ్యస్త పరిస్థితిలో డాలర్లను తీసుకుని ప్రపంచంలో యాత్రా పర్యటనకు బయలుదేరినవారిలో సామాన్యులు నానా యాతనా పడ్డారు. ఎక్కడ చూపినా డాలరుకు లభించే ఇతర ద్రవ్యాలు తగ్గిపోయాయి. డాలరు విలువను అధికార రీత్యా తగ్గిస్తారనే నమ్మకం ప్రబలింది. పర్యాటకులలో కొందరు ఢిల్లీలో కొన్న సితార్‌ను లండన్‌లో అమ్ముకోవడం, కెమెరాలు, కలర్ ఫిల్ములు, ఏదో ఒక ధరకు విక్రయించి ఖర్చులు పెట్టుకోవడం జరిగింది.

1971 సెప్టెంబర్ 14 వ తేదీని యూరప్ ఉమ్మడి మార్కెట్‌వారు డాలరు విలువ తగ్గించవలసిందని నిర్మొగమాటంగా హెచ్చరించారు. అంటే ఆదెబ్బతో డాలరు ప్రపంచంలో నిర్వర్తిస్తూన్న పాత్రను కొంత వరకూ విరమించాలన్నమాట. విలువ తగ్గిపోతున్న ద్రవ్యాన్ని ఆధిక్యతతో ఎవరు చూస్తారు? బంగారం లాగ మూల్య నిక్షేప (Reserve currency) స్థానం వహించడానికి ఎట్లా పనికి వస్తుంది? అమెరికా ససేమిరా డాలరుకు విలువ తగ్గించే ప్రశ్నేలేదని నిష్కర్షగా ప్రకటించింది. ఖజానా కార్యదర్శి జాన్ కావలీ (John covally) మాట్లాడుతూ, ప్రపంచం నుంచి ఏడాదికి 13,000 మిలియన్ల డాలర్లు చొప్పున మూడేళ్ళపాటు వెనక్కు రప్పించుకుంటామని ప్రకటించాడు. అంటే అప్పటికి ఏడాదికి 9000 మి. డాలర్ల లోటు చెల్లింపులను (Dificit Balance of Payments), ఏడాదికి 4000 మి. డాలర్ల మిగులుగా రూపొందించే ఏర్పాటన్నమాట. ఇది ప్రపంచాన్ని చాలా కలవర పెట్టింది. కాని ఇటువంటి ప్రకటనలు కొంచెం గంభీరతా ప్రదర్శనకే గాని నిజం కావు. భారత దేశంకూడా రూపాయి విలువ తగ్గింపు విషయంలో 1966 లో ఆ విధంగానే చెప్పి, వెంటనే తగ్గించింది. అమెరికాకూడా అలాగే 1971 లో చేసింది.

డాలర్ విలువ తగ్గింపు

1971 డిసెంబరు 19 వ తేదీని అమెరికా తన ద్రవ్యమైన డాలర్లులో బంగారపు ధరను పెంచింది. ఇది దశరాజ్యకూటం (Group of ten)తో జరిగిన ఒడంబడికకు ఫలితం. ఈ చర్యవలన డాలరుకు అంతవరకూ ప్రకటితమైన బంగారు విలువ తగ్గింది. స్వచ్ఛమైన బంగారానికి ఒక ఔన్సుకు 35 డాలర్ల చొప్పున అప్పటికి ధర ఉండేది. అది ఆ నాడు 38 డాలర్లకు పెంచబడింది (ఔన్సు) అంటే 28.3495 గ్రాములు. ఒక గ్రాము అంటే 0.09 తులం.) అంటే అధికార రీత్యా అమెరికా బంగారపు ధరను 8.57% పెంచిందన్న మాట. ఎప్పుడో 1934 జనవరి 31 తేదీన ఔన్సు 35 డాలర్లని నిర్ణయించ బడింది. అంతకుముందు ఔన్సు 20.67 డాలర్లు. అంటే అమాంతంగా 70% వరకూ బంగారం ధర అప్పుడు పెంచారన్నమాట. ఆ తరువాత యుద్ధం వచ్చింది. ద్రవ్యనిధి స్థాపించబడింది. అన్ని వస్తువులకూ ధర పెరిగింది. సామాన్య ధరల పెరుగుదల సుమారు నాలుగురెట్లు వరకూ పోయింది. అన్ని దేశాల ద్రవ్యాలలోనూ బంగారం ధర పెరిగింది. కాని డాలర్‌మాత్రం కొండ శిఖరంమీద అలాగే కూర్చుని ఇతర దేశాలెంత కటకట పడుతూన్నా చలించకుండా ఉండిపోయింది. బంగారపు ధర పెరిగితే బంగారాన్ని ఉత్పత్తి చెయ్యగలిగిన దక్షిణాఫ్రికా, రష్యావంటి దేశాలకు లాభం. అలాగని పెంచకుండా ఉంటే ఇతర దేశాలకు ఆర్థికంగా కష్టాలు. అమెరికా చేసిన పని ఏదో విధిలేక చేసిందిగాని మనస్ఫూర్తిగా, ఉన్న పరిస్థితిని స్ఫుటంగా ప్రతిబింబించే విధంగా చెయ్యలేదు. అంత కొద్దిగా విలువ తగ్గించడమంటే పరిస్థితిని గుర్తించినట్లు సూచన మాత్రమే కాని అది ఏవిధంగానూ చాలదు. ఇక్కడ రెండు దృక్పథాలు గుర్తుంచుకోవాలి. ద్రవ్యానికి బంగారు విలువ తగ్గించడం ఒకటి. బంగారానికి ధర పెంచడం రెండోది. బంగారపు ధర డాలర్లలో 8.57% మేరకు ఎక్కువయిందంటే, డాలరుకు విలువ 7.89% మేరకు తగ్గిందన్న మాట. అదివరకు 35 డాలర్లకే కొనబడుతూన్న ఒక్క ఔన్సు బంగారాన్ని 38 డాలర్లకు కొనవలసి వచ్చింది. అంటే అదే బరువుగల బంగారానికి ఎక్కువ డాలర్లు చెల్లించాలి. అనగా డాలరుకు విలువ తగ్గింది.

ఈ ఒడంబడిక ప్రకారం, అమెరికా వేసిన అదనపు 10% దిగుమతి సుంకం రద్దు చెయ్యబడింది. అమెరికనులు అమెరికాలో తయారైన వస్తువులనే కొనేలాగ చెయ్యాలని తీసుకోబడిన చర్యలు కొంచెం తగ్గించాలని అంగీకరించబడింది. ఈ ఒడంబడిక ఫలితంగా జర్మన్ మార్కు విలువ 12.6% వరకూ డాలరుపట్ల పెరిగింది. జపాన్‌వారి యెన్‌కు 16.88% వరకూ డాలరుపట్ల విలువ పెరిగింది. అంతవరకూ డాలరుకు 360 యెన్‌లు. అప్పుడు 308 యెన్‌లు. అంటే డాలరు విలువ యెన్‌పట్ల 14.44% మేరకు తగ్గిపోయిందన్నమాట. ఈ విధంగా అందరి ద్రవ్యాల లోనూ వచ్చిన మార్పులను లెక్కగట్టి ప్రకటించారు. ఇది పునర్వ్యవస్థీకరణ (Realignment). దీని ప్రకారం కొన్ని కరెన్సీల విలువలు బంగారంలో ఈ క్రింది విధంగా అధికం చెయ్యబడినాయి.

జపాన్—యెన్	7.66%
జర్మన్—మార్క్	4.61%
స్విస్—ఫ్రాంక్	4.61%
బెల్జియం—ఫ్రాంక్	2.76%

ఈ సందర్భంలో ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు మాత్రం తమ ద్రవ్యాల బంగారు విలువలు మార్పు చెయ్యలేదు.

ఇంగ్లండ్—స్టెర్లింగ్=2.13281 గ్రాములు స్వచ్ఛ సువర్ణం

ఫ్రాన్స్—ఫ్రాంక్=0.16 గ్రాములు.

భారతదేశం కూడా ఇంగ్లండ్‌ను అనుసరిస్తూ రూపాయయొక్క బంగారు విలువను మార్చలేదు. అంటే ఒక పౌండ్ స్టెర్లింగ్‌కు రు. 18.9677 రేటు అలాగే ఉంచబడింది. డాలరుతో మాత్రం రేటు మార్పు పొందడం సహజం. అదివరకు

డాలరుకు రు 7.50 రేటు. అప్పుడు ఆ రేటు రు. 7.279 వరకూ వచ్చింది. డాలరుపట్ల రూపాయి విలువ ఆ విధంగా సుమారు 3% హెచ్చింది. ఈ రేట్లు ఖచ్చితంగా ఇలాగే ఉండాలని లేదు. ద్రవ్యనిధి అంగీకారం ప్రకారం ఎప్పుడైనా 2.25% వరకూ మార్పులు పొందుతూ ఉండవచ్చును. ఈ నిర్ణయం మన దేశానికిగల ఎగుమతి దిగుమతి లావాదేవీలకు అనుగుణంగా నిర్ణయించబడింది. ఇంగ్లండ్ ద్రవ్యం మార్పు పొందక పోయినా సరే, డాలరు విలువ తగ్గింపును సంపూర్ణంగా వినియోగించుకుంటే, మనకు స్టెర్లింగ్‌తో వైషమ్యం రాకతప్పదు. భారతదేశానికీ ఇంగ్లండ్‌కూ ఉన్న వ్యాపార సంబంధాల ఆధిక్యత దృష్ట్యా స్టెర్లింగ్‌పట్ల విలువ మార్చడం మంచిది కాదు.

1973 లో డాలర్ విలువ తగ్గింపు

1971 డిసెంబర్ ఒడంబడిక ఫలితంగా వచ్చిన మార్పులు తాత్కాలిక సంతృప్తిని కలిగించినా, అవి శాశ్వత పరిష్కారాలు కావు. ప్రపంచంలో ఒక ముఖ్యద్రవ్యమైన స్టెర్లింగ్ తేలుతూ ఉండడం మొదలుపెట్టింది. 1971 లోని ఒప్పందం ఈ నాటికి అప్పుడే చెదిరిపోయింది. ఇప్పుడు మారకపు రేట్లు సుస్థిరంగానూ లేవు. గాలికి తేలుతూనూ లేవు. త్రాగిన వాడిలాగ తూలుతూ ఉన్నాయి. నడుస్తూ, పరుగెత్తుతూ గంతులేస్తూ నానా విధాలుగా ఉన్నాయని ఒక ఆర్థికశాస్త్రవేత్త వ్యాఖ్యానించినది నిజం. 1971 లోనే యూరప్ ఉమ్మడి మార్కెట్ దేశాలు ఒక నిర్ణయం చేసుకుని, తమ మారకపు రేట్లమధ్య పరస్పరం $2\frac{1}{4}\%$ కంటె ఎక్కువగా మార్పులేకుండా చెయ్యాలనుకున్నాయి. కాని అందులో కొన్ని దేశాలు ఆ విషయమే పట్టించుకోవడం లేదు. ఈ లోగా జర్మనీలోనూ జపాన్‌లోనూ ఎలాగైనా డాలర్లను వదిలించుకోవాలనే యత్నం ఎక్కువైంది. డాలరు సప్లయిని బట్టి, డాలరు గలవారు ఇతర ద్రవ్యాలకోసం ఎగబడడంబట్టి, డాలరు పతనం త్వరపడుతుంది. ఇతర ద్రవ్యాల మారకపు రేటు బిగిసిపోతుంది. డాలరును నిలబెట్టడానికి వేలకొద్దీ మిలియనులను జర్మనీ జపానులు కొన్నాయి. 1973 ఫిబ్రవరిలో భయోత్పాతం పెరిగి, విదేశీద్రవ్య మార్కెట్ల తలుపులు మూతలు పడ్డాయి. చివరకు డాలరుకు మళ్ళీ విపరీతంగా విలువ తగ్గడంతో అధికారరీత్యా చర్య తీసుకోవలసి వచ్చింది. 1973 ఫిబ్రవరి 13 వ తేదీని అమెరికా డాలరు విలువను మళ్ళీ 10% తగ్గించింది. అంటే డాలర్లలో బంగారపు ధర అధికార రీత్యా పెరిగింది. ఒక ఔన్సు బంగారం ధర 38 డాలర్ల నుండి 42.22 డాలర్లకు పెంచబడింది. ఇదివరకు 1971 లోనే చాలినంత మేరకుతగ్గిస్తే ఇంతతొందరలో ఈ భయోత్పాతాలు కలిగేవి కావేమో! ఇదివరకు ఇతర దేశాలు తమ ద్రవ్యాల విలువలను తగ్గించినప్పుడు 35% వరకూ కూడా తగ్గించాయి. అవసరమైతే విరివిగా తగ్గించడంలో తప్పులేదు. కాని అమెరికా అభిప్రాయంలోగాని, ప్రపంచంలో డాలర్లు గల ఇతర దేశాలకుగాని, డాలరు విలువ తగ్గకుండా ఉండడమే ప్రయోజనకరం. అమెరికా ద్రవ్య వ్యవస్థలో దార్ఢ్యం నెలకొంటేగాని అటువంటి పరిస్థితి రాదు. వియత్‌నామ్ యుద్ధం అమెరికాకు సంబంధించినంతవరకూ పూర్తయింది గనుక డాలరు విలువ ఇక ముందు నిలకడగా ఉండడం, బలపడడం కూడా జరగవచ్చునని ఎంతోమంది విశ్వసిస్తున్నారు.

ఇప్పుడు చెయ్యబడిన విలువ తగ్గింపుతోబాటు, 1971 లో మాదిరిగా యూరపులోని ఇతర కరెన్సీలు విలువలను సర్దుబాట్లు చేసుకోలేదు. అంటే విలువ హెచ్చింపులు చేసుకోలేదు. అమెరికా అర్థించినప్పటికీ ఈ పని జరగలేదు. బ్రిటన్, జపాన్, కెనడా, ఇటలీ, స్విట్జర్లండ్‌లు తమ కరెన్సీలను ప్రవాహవశంగా వదిలేశాయి. అమెరికాకు ఇదంతా ప్రాణాంతకమైన గొడవ. 1971 లో డాలరు విలువ తగ్గించబడిన తరువాత కూడా ఏడాదిలో ఒక్క జపాన్‌తోనే అమెరికాకు వ్యాపారపు లోటు 84 బిలియన్ల డాలర్ల మేరకు వచ్చింది. ఈసారి విలువ తగ్గింపుతోనైనా, అమెరికన్ వస్తువుల వైపు ప్రజలు మళ్ళీ, జపాను వస్తువులు పోటీ

పడలేకుండాఅయి, అమెరికా వ్యాపార చెల్లింపుల లోటు భర్తీ అవుతుందని ఆశించవచ్చును. సామాన్యులైన అమెరికన్ పర్యాటకులు ప్రపంచాన్ని దానికి పాటికి దాన్ని వదిలిపెట్టి, స్వదేశంలోనే విలాస కేంద్రాలను పునీతం చెయ్యవలసి ఉంటుంది. దీనివలన భారతదేశం లాంటి దేశాలకు కొంత కష్టం కలుగుతుంది.

మన రూపాయమీద ప్రపంచ ద్రవ్య సమస్యల ప్రభావం

ఈ విలువ తగ్గింపుతో కూడా ప్రపంచ ద్రవ్య మార్కెట్లలో డాలరు పరిస్థితి పూర్తిగా తేరుకోలేదు. అధికారరీత్యా ఔన్సు బంగారం 42.22 డాలర్లయితే, మామూలు బజారు రేటు పెరగడం తీవ్రంగా ఉంది. లండన్‌లో రేటు ఈ క్రింది విధంగా ఉంది. ఒక ఔన్సు బంగారం—

1973 ఫిబ్రవరి	13 తేదీ	69.10	డాలర్లు
	14	70.10	,,
	15	72.80	,,

ఈ మార్పు లన్నింటివలనా మన రూపాయకు కలిగిన పరిస్థితి కొంతవరకూ చెప్పుకోవలసి ఉంది. 1971 డిసెంబర్ 20 వ తేదీన ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రకారం మన రూపాయిని పౌండ్ స్టెర్లింగ్‌తో అనుబంధించి, ఒక పౌండుకు రు 18.9677 మాత్రమే అని నిర్ణయించబడింది. ఐతే డాలరు విలువ పడిపోయినా కూడా, ఆ తగ్గుదలను మనం ఉపయోగించుకుని బాగుపడకుండా, పౌండుతో ముడిపెట్టుకుని కూర్చోవడ మేమిటని దేశంలో పెద్ద విమర్శ బయలుదేరింది. పౌండ్‌కు తన బాధలు తనకున్నాయి. డాలరు విలువ తగ్గింది కదా అని అందులో లాభం పొందగలిగిన శక్తి లేదు. లోకంలో పౌండ్ మీద అదివరకున్న విశ్వాసం ఇప్పుడెవరికీ బలంగా లేదు. పౌండ్‌ను కూడా విలువ తగ్గించకుండా ఉంచడం కష్టంగానే ఉండేది. కాని ఈసారి డాలరు విలువ తగ్గించడంతో మార్కెట్‌లో పౌండుకు కొంచెం వెసులుబాటు కలుగుతుంది. మన దేశానికి ఉన్న విదేశీ ద్రవ్య నిలువలు 1973 ఫిబ్రవరిలో ఇచ్చిన వివరాలను బట్టి రు 712.99 కోట్ల విలువ గలవి. అందులో డాలర్లు సుమారు 4.8% మాత్రమే ఉన్నాయి. పౌండు స్టెర్లింగ్‌లు మాత్రం 25.57%. తక్కిన నిలువలలో బంగారం, S. D. R లు కలిసి 51.53%. వర్తక వ్యాపారాల్లో కూడా భారతదేశానికి అమెరికాతో కంటె ఇంగ్లండ్‌తో ఎక్కువ సంబంధం ఉంది. అంచాత మన ప్రభుత్వపు దృష్టి డాలర్‌మీద కంటె పౌండ్‌మీద ఎక్కువగా కేంద్రీకృతమై ఉండడం సహజం. ఈ కారణంగా రూపాయిని పౌండుతో అనుబంధించి మార్పు లేకుండా ఉంచడం జరిగింది. దీని ఫలిత మేమిటంటే జర్మను మార్కు ఫ్రెంచి ఫ్రాంక్‌లతో సరిపోల్చి చూస్తే రూపాయకు సుమారు 6% విలువ తగ్గింపు జరిగినట్లే. జపాన్‌వారి యెన్‌తో చూస్తే 10% వరకూ విలువ తగ్గినట్లే. దీని కారణ మేమిటంటే పౌండ్‌కు యూరప్‌దేశాల బలిష్ఠ ద్రవ్యాలతో సరిపోల్చి చూస్తే బలం తగ్గుతూ ఉండడమే.

ఇప్పుడిప్పుడే భారతదేశపు వ్యాపార శేషం (Balance of Trade) కొంచెం మెరుగుపడి, కొంత మిగులు కనబడే సూచన వచ్చేసరికి, కఱవు కాటకాల మూలంగా ఆహారధాన్యాలు దిగుమతి చేసుకోవలసిన దుఃస్థితి పట్టింది. కాని ఇది తాత్కాలికమే అని ఆశించవచ్చును. అమెరికా ఆర్థిక సహాయాన్ని నిలుపు చెయ్యడం కూడా ఒక విధంగా మేలే చేసింది. వ్యాపార విషయాల మాట అట్లా ఉండగా, అమెరికానుంచి తీసుకున్న అప్పులు మనకు ఎక్కువగా ఉన్నాయి. డాలరు విలువ తగ్గింపును మనం పూర్తిగా వినియోగించుకుంటే ఈ అప్పులభారం తగ్గుతుంది. కాని దానికంటెకూడా ఉమ్మడి మార్కెట్లో చేరిన ఇంగ్లాండ్‌తో ఉన్న వ్యాపార లావాదేవీలలో జాగ్రత్తగా వ్యవహరించకపోతే, మనకు విదేశమారకాన్ని సంపాదించే శక్తి సామర్థ్యాలే కుంటుపడవచ్చును. జర్మనీ, జపాన్, అమెరికాలవంటి ప్రముఖ దేశాలతో వ్యాపార సంబంధాలు ముందు ముందు కొంత మెఱుగుపడినా, ఆ వ్యాపారశేషంలో గణుతించదగిన మిగులు కనబడు

తుందని ఆశించడానికి వీలులేదు. అంచాత మనదేశం ప్రస్తుతానికి తీసుకున్న చర్య సమంజసంగానే ఉన్న దని భావించవచ్చును. అచిరకాలంలో అమెరికన్ డాలరుకూడా తన బలాన్ని పుంజుకోవచ్చును. పౌండ్ కూడా ఇంకా సుస్థిరమైన స్థాయిలో నిలబడవచ్చును. పౌండ్‌ను రిజర్వు కరెన్సీగా ఇతర దేశాలు అంగీకరించక పోతే, బ్రిటనుకు ఇంకా పెద్ద సమస్యలు వస్తాయి. అవి ఆ ఇతరదేశాలుకూడా అనుభవించాలి. ఐతే క్రమంగా బలహీనంగా తయారవుతూన్న స్టెర్లింగ్‌ను రిజర్వుగా పెట్టుకుంటే దేశాలు దెబ్బతింటాయి। ఒక నిర్ణీత స్థాయికంటె స్టెర్లింగ్ దిగజారిపోకుండా బ్రిటన్ గ్యారంటీఇస్తే, దాన్ని రిజర్వు కరెన్సీగా అను సరించడానికి ఏ దేశానికైనా అభ్యంతరం ఉండదు. ప్రస్తుతానికి అటువంటి గ్యారంటీ ఇవ్వాలంటే తట పటాయించవలసిన స్థితిలో బ్రిటన్ ఉన్నదనిచెప్ప వచ్చు. ఇంతకూ ప్రపంచంలో పరిశీలనలో ఉన్న ద్రవ్య సంస్కరణలు త్వరలోవస్తే ఈ అస్తవ్యస పరిస్థితి తొలగిపోతుంది.

ప్రపంచ ద్రవ్యత

డాలర్ స్టెర్లింగ్‌లు రెండూ తమ తమ దేశా లకు ద్రవ్యాలుగా ఉపయోగించడమే కాకుండా, ప్రపం చానికి మూల్యనిక్షేపయోగ్యాలుగా ఉండడంవల్లనే, ప్రపంచ వ్యాపారం సజావుగా సాగుతూంది. అవి నమ్మ దగిన స్థితిలో లేకపోతే బంగారంతప్ప మరేదీ అంత ర్జాతీయ ద్రవ్యంగా ఉండే అధికారంగల ద్రవ్యం లేదన్నట్లే. ఆ బంగారం చాలినంత లేకపోవడనే సమస్య. ఉన్నా కొన్ని దేశాల హస్తగతంగా ఉంది. అంచాత ఈ ద్రవ్య సమస్యలు లోకానికంతకూ పెద్ద సమస్యను తెచ్చిపెట్టాయి. డాలర్లు ఉచ్చస్థితిలో ఉన్నప్పుడుకూడా, బంగారం డాలర్లూ కలిసి ప్రపం చంలో తగినంత ద్రవ్యత (Linquidity) ను సమ కూర్చలేకపోతున్నాయి. ఈ విషయంలో అభివృద్ధి పొందుతూన్న దేశాలు ఎంతో బాధపడుతున్నాయి. ప్రపంచ వ్యాపారం పెరిగినంత తొందరగా ప్రపంచ మూల్యనిక్షేపాలు, దానికి యోగ్యాలైన ఆధారాలు పెరగక పోవడమే దీనికి కారణం. అందువలన అద్భుత మైన పథకాన్ని ద్రవ్యనిధి అధ్వర్యంక్రింద రూపొం దించారు. అదే కాగితపు బంగారం (Paper Gold). దాని అసలు పేరు ప్రత్యేక ద్రవ్యోపయోగ అధికారాలు (Special Drawing Rights: S. D. R's) ఈ విధానం 1969 లో ప్రవేశపెట్టబడింది. ద్రవ్యనిధిలో సభ్యత్వం గలిగి తమ చందా కోటాలను చెల్లించిన దేశాలన్నింటికీ, ఆయా కోటాల ననుసరించి ఈ అధికారాలు పంచిపెట్టారు. ఒక్కొక్క ద్రవ్యోప యోగాధికారం (S.D R.) విలువ ఒక డాలరులో 1971 పూర్వం ఉన్న బంగారం విలువకు సమానం. అనగా 0.888671 గ్రాముల స్వచ్ఛమైన బంగారం మొత్తం సృష్టించబడిన కాగితం బంగారం విలువ 9.3 బిలియన్ల డాలర్లు. అది మూడు వాయిదాలలో సభ్యదేశాలకు పంచిపెట్టారు.

1970 లో	3400	మిలియన్లు
1971 లో	2950	......
1972 లో	2950	......
	9300	

ఇప్పుడు ద్రవ్యనిధి అకౌంట్లు S.D.R. లలోనే ఉంటున్నాయి. ద్రవ్యనిధి లెక్కల ప్రకారం ప్రపంచంలో 1972 లో అధికార హస్తాలలో ఉన్న మొత్తం బంగారం 41 బిలియనుల S.D R. లకు మాత్రమే లెక్కకు వచ్చింది. ఈ పద్ధతిలో మానవుడు తన మేధాశక్తిని వినియోగించి, సంఘీభావాన్ని బలపరచు కుంటూ, వేరే నామ మాత్రపు బంగారాన్ని కూడా సృష్టించి, బంగారపు అవసరం కొంతవరకైనా తగ్గించు కుని, ద్రవ్య వ్యవస్థను తీర్చిదిద్దుకోవడం ఎంతో ముదావహం. ఏ దేశమైనా కానీ, ఒక దేశపు జాతీయ ద్రవ్యాన్ని ప్రపంచ ద్రవ్యంగా వ్యవహరించడం రాజ కీయంగా యోగ్యమైనదీ కాదు; ఆర్థికంగా అను వైనదీకాదు; ఆచరణలో అనుసరణీయమూ కాదు. దానంతట అది పడిపోకపోయినా, డాలరు ఎప్పటి కయినా త్యాజ్యమే. అంటే అమెరికాను ద్వేషించవలసిన

పనిలేదు. డాలరును ముద్రించి ఇచ్చేస్తే పనిలేదు. డాలరును త్రోసిపుచ్చాలనీ కాదు. అది అసంభవం కూడానూ. ఒకప్పుడు ప్రెసిడెంట్ డీగాల్ అధికారంలో ఉన్నప్పుడు, మళ్లీ స్వర్ణ ప్రమాణమే శరణ్యమన్న అభిప్రాయాలు వ్యాప్తిలో పడ్డాయి. డాలరు బలహీన మవుతున్నదని డీగాల్ అప్పుడే గుర్తించాడు కాని ప్రపంచంలో తాను నమ్మిన ధర్మ నిర్వహణంకోసం అమెరికా తీసుకున్న శ్రమ వల్లనే డాలర్ కు ముఖ్యంగా ఈ స్థితి వచ్చిందని మఱచిపోకూడదు. సకాలంలో డాలరువలన బాగు పడిన దేశాలు డాలరు దుస్థితిలో పడినప్పుడు చెయ్యవలసిన సహాయకృత్యాలు చెయ్యాలి కాని సంపూర్ణంగా ఆ విధంగా చేస్తే ఆ కరెన్సీలు తమ దేశాలకు ద్రోహం చేసినట్లవుతాయి. శాశ్వతంగా ఇటువంటి సమస్యలకు పరిష్కారం ఉండదు. మానవుడు తెచ్చి పెట్టుకున్న సమస్యకు మానవుడే ఏదో విధంగా కాలానుగుణంగా పరిష్కారాలు ఏర్పరచుకోవాలి. అందుకే 'ఇరవై దేశాల సంఘం' (Group of 20) ఈ విషయాన్ని తీవ్రంగా వితర్కించి పరిష్కరించ డానికి ఏర్పాటు చెయ్యబడింది. ఇదివరకు ద్రవ్యాలోకం సంపూర్ణంగా ప్రపంచంలో ఐశ్వర్యంలో అగ్రస్థానంలో ఉన్న పదిదేశాల (Group of Ten) చేతుల్లోనే ఉండేది. కాని ఇప్పుడు కొన్ని అభివృద్ధి పొందుతూ ఉన్న దేశాలు కూడా ఈ సమాలోచనలలో భాగ స్వాములుగా ఆహ్వానించబడడం ఎంతో సంతోషించ దగినది. ఈ ఇరవై దేశాలలో, అమెరికా, బ్రిటన్, పశ్చిమ జర్మనీ, ఫ్రాన్స్, జపాన్ దేశాలతోబాటు భారత దేశానికీ, ఇతర 14 దేశాలకూ స్థానం లభించడం చాలా సంతోషించవలసిన చర్య.

ద్రవ్య సంస్కరణలు

ఇరవై దేశాల సంఘం ఏంచెయ్యబోతుందో సూచించి చెప్పడం అసాధ్యం. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, మొదలైన దేశాల ద్రవ్య సిద్ధాంత నిపుణుల దృష్టిలో బంగారం ఉత్కృష్టమైనది. అది ఒక్కటే నిజమైన అంతర్జాతీయ ద్రవ్యం. దానిమీద ఆధార పడని ద్రవ్య వ్యవస్థను వారు అంగీకరించరు. కాని ఇటీవల దృక్పథం కొంత మార్పు పొందినట్లు కనబడు తుంది. అమెరికాలో అగ్రశ్రేణికి చెందిన ద్రవ్య వ్యవ హర్తలు బంగారానికి ప్రస్తుత ద్రవ్యస్థానం లేకుండా ఉండాలన్న ప్రచారాన్ని ఇటీవల లేవదీస్తున్నారు. ఒకప్పుడు అనాగరక ప్రపంచంలో సముద్రపు గవ్వలు, రాళ్లు, అప్పలూ, అందమైన బానిసపిల్లలూ కూడా ద్రవ్యంగా వ్యవహరిస్తూ ఉండేవి. ఇప్పుడవి ఆ స్థానా న్నుండి తొలగిపోయాయి. బంగారానికి కూడా అదే గతి పట్టాలని వారు సూచిస్తున్నారు, కాని ద్రవ్యనిధి ప్రధానాధికారి స్క్వీట్జర్ నిస్సందేహంగా బంగారానికి అంతర్జాతీయ ద్రవ్య స్థానాన్ని అంగీకరిస్తూన్నట్లు ప్రకటించాడు. కాని బంగారం నిత్య వ్యవహారాల్లో చెలామణీ కావడంకాని, లావాదేవీలు బంగారపు చెల్లింపు లతో పరిష్కరించడంగాని ఇప్పట్లో జరగడం కల్ల. అను నిత్యం బంగారం ధర మార్కెట్‌లో పెరిగి పోతూనే ఉంది. ఉమ్మడి మార్కెట్ దేశాలు 1973 జనవరిలో ఒక ఒప్పందానికి వచ్చారు. దాని ప్రకారం 1975 వరకూ వారి మధ్య బాకీల పరిష్కారానికి బంగారాన్ని ఉపయోగించరు. ఈలోగా ఇరవై దేశాల సంఘం ప్రపంచంలో అధికారరీత్యా బంగారపు ధరను ఎక్కువ చెయ్యాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తూంది. 1973 ఏప్రిల్‌లో ద్రవ్య సహకారనిధి (Monetary Co-operation Fund) ని ఏర్పాటు చెయ్యాలనే ప్రయత్నం కూడా ఉంది.

అమెరికా సూచనలు

రాబోయే ద్రవ్య సంస్కరణలలో అమెరికా చేస్తున్న ప్రతిపాదనలు చాలా స్పష్టంగా ఉన్నాయి కాని నిష్కర్షగా ఉన్నాయి. ఈ మధ్య అమెరికా పడ్డ కష్టాలు అందులో ప్రతిబింబిస్తున్నాయి. ఈ సూచ నల ప్రకారం, ఒక దేశం తన ద్రవ్యానికి విలువ తగ్గించ చడమా, ఎక్కువ చెయ్యడమా అనే విషయాన్ని నిర్ణ యించడానికి ఆ దేశపు ద్రవ్య నిలువలు పరిగణించ బడాలి. ఆ నిలువలలో అసలు బంగారం, కాగితపు బంగారం కూడా లెక్కపెట్టబడాలి. ఒక 'కనిష్ఠ స్థాయి' (Low Point) ని అంతర్జాతీయ సూత్రా

లలో ప్రతి దేశానికీ నిర్ణయించాలి. నిలువలు ఆ స్థాయి కంటె తక్కువకు దిగజారిపోతే, ఆ దేశం తన ద్రవ్యానికి తప్పనిసరిగా విలువ తగ్గించాలి. దానికి నిరాకరిస్తే ఆ దేశానికి ద్రవ్యనిధినుంచి ఋణాలు గాని, S. D. R ల పంపిణీ గాని లభ్యం కాకుండా చెయ్యాలి. ఇంకో మధ్యస్థాయిని కూడా ప్రమాద సూచక స్థాయి (Warning Point) అని, కొంచెం పై స్థాయిలో నిర్ణయించి, నిలువలు అంతకు తగ్గితే విలువ తగ్గించుకునే స్వేచ్ఛను ఆ దేశానికి వది లెయ్యాలి. ఇదే విధంగా గరిష్ఠస్థాయి లేదా బాహ్యస్థాయి (Outer Point) ని ఏర్పాటుచేసి దాని ప్రకారం ద్రవ్యపు విలువను తప్పక పెంచాలి. దీన్ని నిరాకరిస్తే ద్రవ్యనిధి కొన్ని అంతర్జాతీయ శిక్షలను వెయ్యవచ్చు. ఇక్కడ కూడా ప్రమాద సూచకస్థాయిని నిర్ణయించడం ఉంటుంది. ఈ సూచనలు చివరకు అంగీకరించబడ వచ్చును.

చివరిమాట

కాగితం బంగారం మళ్లీ సృష్టించవలెననే అభ్యర్థనలు వివిధ దేశాలనుండి వస్తున్నాయి. కాని ప్రపంచంలో ద్రవ్యత బాగా నెలకొల్పబడాలంటే అటువంటి కాగితపు బంగారాలను గొప్పదేశాలే తమ ఐశ్వర్యాన్ని ఆధారంగా చేసుకుని పంచుకోకూడదు. దాని అవసరం ఎక్కువగా ఉన్నవారు అభివృద్ధి పొందుతూన్న దేశాలవారు. అట్లాంటి దేశాలు ఇప్పుడప్పుడే విదేశీ మారకాన్ని బాగా సంపాదించలేవు. ఒక దేశం యొక్క అభివృద్ధి పథకాలను పురస్కరించుకుని ఆ దేశానికి తగినంత విదేశ ద్రవ్యాన్ని అందుబాటులో ఉండేలాగ చెయ్యాలి. S. D. R లు ఆయాదేశాల ద్రవ్యనిధి కోటాలను బట్టి పంచిపెట్టబడ్డాయి. దాని వలన ధనికదేశాలకే ఎక్కువ సదుపాయం జరిగింది. అభివృద్ధి కార్యక్రమాలకూ అప్పులకూ సంబంధం పెట్టకూడదని బ్రిటన్ తన అభిప్రాయాన్ని సూచిస్తూంది. భారతదేశం ఈ అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తూంది. ఇటువంటి దేశాలన్నీ కలిసి అట్టి సూత్రాలు తయారుకాకుండా, ప్రతిపాదనావస్థలోనే ప్రతిఘటించి, ప్రమాదం తొలగించుకోవాలి. ఎన్ని క్రొత్త ద్రవ్య సంస్కరణలు వచ్చినా అవి సంపన్నదేశాల సౌకర్యాల కోసమే ఐతే ప్రపంచ ద్రవ్యతా ఉండదు; ఆర్థిక పురోగతీ ఉండదు. ఇరవై దేశాల సంఘం ఇటువంటి విషయాల్లో జాగరూకతతో వ్యవహరించాలి.



ఆంధ్రపాణినీయము

డా॥ జె. సూర్య నారాయణ

తెలుగు వ్యాకరణములలో నెన్నదగినది చిన్నయసూరి కర్తృకమగు బాలవ్యాకరణము. వైయాకరణ సిద్ధాంత కౌముదియను సంస్కృత వ్యాకరణము నవగాహన చేసికొనిన వారికే ఈ వ్యాకరణం సులభ గ్రాహ్యంగా ఉంటుంది. కౌముది మునిత్రయ కర్తృకము. వీరిలో ప్రథానభాగరచయిత పాణిని. కౌముదిలోని సూత్రముల నష్టాధ్యాయి అనుపేర పాణిని నిర్మించాడు. కావున కౌముదికి పాణినీయమను నామాంతరము పండితలోక ప్రసిద్ధము.

సిద్ధాంత కౌముది నధ్యయనము చేసిన వారికి మాత్రమే బాలవ్యాకరణము సులభంగా అర్థమవుతుంది.

ఇత్సంజ్ఞ :

ట్, క్ ప్రత్యయాగమాదుల అంతమునందు చేర్చి దానివలన వ్యాకరణ ప్రక్రియలో విశేషార్థమును సాధించుట పాణినీయ సంప్రదాయము. ఇట్లనుబంధముగ చేయుటను ఇత్ అని అంటారు. ట్—ఇత్సంజ్ఞగా గలిగిన ఆగమము టిత్ (ట్ + ఇత్) అనీ క్—ఇత్సంజ్ఞగా గలిగినది కిత్ (క్ + ఇత్) అనీ వ్యవహరింప బడుతాయి. టిత్ పరపదాద్యవయంగానీ కిత్ పూర్వ పదాంత్యావయంగానూ వస్తుంటాయి. సూరి తన వ్యాకరణమునందీ సంజ్ఞలనీ యర్థమునందే ప్రయోగించియున్నాడు. లట్ (తత్సమ 31) అవక్ (సంధి 11) నక్ (తత్సమ 28) నుక్ (తత్సమ 29, 30) ముక్ (తత్సమ 40, 41, 43) పై వానిలోని ట్, క్ అనునవి ప్రక్రియా దశలో మరుగు వడును.

సూరి తన వ్యాకరణ రచనలో ఙ్, ఞ అను వాని త్సంజ్ఞకములుగ వాడుకొని విశేషార్థమును సాధించియున్నాడు. ఙిత్ (ఙ్ + ఇత్) బిందు పూర్వకంబగు, ఞిత్ (ఞ + ఇత్) పరంబగు నపుడుత్వంబున కత్వంబగునని సూరి సూత్రించియున్నాడు.

తపరకరణము :

అవర్ణమునకు ఇ మొదలగు నచ్చులు పరంగా నిలచినపుడు పూర్వపరస్వరములకే కాదేశంగా ఏ మొదలగునవి వస్తాయి. దీన్ని గుణసంధి అంటారు. (ఆద్గుణః 6–1–87) పూర్వమునందలి అకారము హ్రస్వమైనా లేక దీర్ఘమయినా ఈ సంధి వస్తుంది. హ్రస్వ దీర్ఘములగు అ మొదలగునవి సవర్ణములయినందున ఈ విధముగసంధి వచ్చుచున్నది. అలాకాకుండా కేవలం హ్రస్వాన్నీ లేక దీర్ఘాన్నీ గ్రహించాలనుకుంటే ఆస్వరమునకు పరముగ హల్మాత్రమగు తకారమునుంచి ప్రయోగించుట పాణినీయ సంప్రదాయము. దీనినే తపరకరణ మంటారు. తపరస్తత్కాలస్య 1–1–67 అనే పాణినిసూత్రం ఈ యర్థాన్నే తెలియజేస్తుంది. ఈ తపరకరణమును సూరి తన వ్యాకరణమునందు విరివిగ వాడియున్నాడు. అ—ఇ—ఉ అనే అచ్చులకు— త్ చేరగా ఏర్పడిన అత్—ఇత్—ఉత్ అనే ఈ హలంతములకు ఉగాగమంబును ద్విత్వంబును తుదిహల్లునకగు (బాల—తత్సమ 68) సూత్రముచే ఏర్పడిన అత్తు—ఇత్తు—ఉత్తు అనునవి బాలవ్యాకరణమునందు పలుతావులందు ప్రయుక్తము లయినవి. అత్తు (సంధి 4) ఉత్తు (సంధి 1) ఇత్తు (సంధి 5, 6, 7, 8) దీర్ఘాచ్చునకే యచ్చుపరముగనున్న తెలుగునను సంధి

రాదనుటను తపరకరణమున మనము గ్రహింపగలుగు చున్నాము.

ప్రత్యాహారము :

పాణినీయ ప్రారంభంలో వర్ణ సమామ్నాయ ప్రసంగం ఉంది. మాహేశ్వర సూత్రములు 14 నచట గలవు. ఇవన్నియు హలంతములు. వీని తుది హల్లు లిత్సంజ్ఞకములు. అందు మొదటి సూత్రము 'అ ఇ ఉ ణ్' అనునది. 'ఐ ఔ చ్' అనునది నాల్గవ సూత్రము. మొదటి సూత్రమునందలి ఆద్యక్షరమగు అ, నాల్గవ సూత్రాంతమునందున్న చ్ అనుదానితో చేరగా 'అచ్' అను సంకేత మేర్పడినవి. ఇట్లే అయిదవ సూత్రాదియందలి హ తో తుది (14 వ) సూత్రాంతమునందలి—ల్ అను దానితో చేరగా 'హల్' ఏర్పడినది. వీనిని ప్రత్యాహారములందురు. ఈ ప్రత్యాహారములను సూరితన వ్యాకరణమునందు వాడి యున్నాడు. బాల వ్యాకరణమునందలి మొదటి పరిచ్ఛేదమునందలి మొదటి సూత్రమునందున్న 'అజ్ఝ్వా భాగము, అనుచో అచ్ + హల్ + ఇత్యాదిగ పదాంశములు గుర్తింపబడి యున్నవి. హలంతములగు వీనికి ఉగాగమము ద్విత్వము (తుది హల్లునకు)రాగా ఏర్పడిన రూపములే 'అచ్చు, 'హల్లు అనునవి.

ఈ ప్రత్యాహారములను వాడుటయే గాక తన వ్యాకరణమునం దవసరమయిన ప్రత్యాహారముల నతడు కల్పించుకొని యున్నాడు. ము, డుజ్=ముజ్ అని సూరి మధ్యమముడుజ్జులు ముజ్జునాబడు (బాల. క్రియా 31) ఇత్యాది సూత్రమునందు నిరూపించి యున్నాడు. ముజ్ + జీత్=ముత్ అని సూరి ముజ్జీత్తులు ముత్తునాబడు నను సూత్రమునందు వ్యక్తము గావించియే యున్నాడు. జ్, జీ, వాని నిత్సంజ్ఞకములుగ సూరి కల్పించుకొనెను. డుజ్ (తత్సమ 20, 22) ఆచ్ఛిక 4, 8 కుజ్ (ఆచ్ఛిక 18) గుజ్ (ఆచ్ఛిక 19) ముజ్, ముడుజ్ (క్రియా 31). లజీ (క్రియా—7) కలజీ (క్రియా 19) పుజీ, రుజీ (క్రియా 34) కజీ (క్రియా 36) మిజీ (క్రియా 37) నుజీ (క్రియా 40) నిజీ (క్రియా 47) పడుజీ (క్రియా 49)

డుజ్, కుజ్, ముజ్ మొదలగు నీ హలంతముల కుగాగమము ద్విత్వమును తుది హల్లునకు రాగా డుజ్జు, కుజ్జు, ముజ్జు ఇత్యాదులు సిద్ధించును. వీని కగు పరముకాగా సంధి వచ్చి డుజ్జగు, ఇత్యాదులు నిష్పన్నము లగును. జ్ అంతమందుగల వీనికి అచ్చు పరముగ నున్నందున జ్‌కారమునకు ద్విరుక్తి సంస్కృతము నందునుః ఙమో్హ్రస్వాదచిఙ ముణ్నిత్యమ్ (8—3—32) ప్రాప్తించును. కాని పరముగనున్న అచ్చగు—అ—తెలుగు కాన (అగు) ఈ సందర్భమునందీ సంధిని ప్రవర్తింపజేయ వీలులేదు. కాని సంస్కృత పదమగు 'ఆది, పరముగనున్నను డుజ్‌లోని తుది హల్లునకు పై సూత్రము చేరవలసిన ద్విత్వమును చేయక 'డుజాదులు, (బాల—ఆచ్ఛిక—) అని ప్రయోగించుట గమనింపదగిన యంశము.' డుజ్, అనునది సంస్కృతము కాకుండుట ఇందుఃకు కారణమన వీలు లేదు. నుక్ + ఆగమ ఇత్యాదులందు నుక్‌ను సమ సంస్కృతముగ గుర్తించి సంస్కృత సంధిని సూరి చేసి (నుగాగమ) యున్నాడు. నుక్ వంటిదే డుజ్. అంతేగాక 'అందు, ఇత్యాదులను సమ సంస్కృతములుగ గుర్తించినందుననే అందు + అవక్ (అంద్వవక్—బాల—సంధి 11) ఇత్యాదులందు సంస్కృత సంప్రదాయానుగుణముగ యణాదేశ సంధి ప్రాప్తించినది

డుజ్ + ఆది. అనుచో సంస్కృత సంధి వచ్చినా లేక తెలుగునందువలె ఉగామద్విత్వములు తుదిహల్లునకు వచ్చిన తరువాత తెలుగు సంధి వచ్చినా 'డుజ్జాది, అని ఏర్పడియుండవలయును.

సంస్కృతాంధ్ర సంధులకు లొంగని విశేష సంధులను గుర్తింపజాలనిచో బాలవ్యాకరణ మగమ్య గోచరమగుననుటను గుర్తింపవలయును.

సంధి :

దుష్టాములగు సంధి విశేషములనేగాక వచ్వర్ష అనే మరో సంధిని సూరి ప్రయోగించాడు. వచ్ అనేది

హలంత సంస్కృత ధాతువు. దీనిపై—ఇ—కారమును చేర్చి అర్ధపరముగ నున్నందున యణాదేశం చేయగా వచ్యర్ధ (వచి+అర్ధ) ఏర్పడుతుంది. ఈ విశేష సంధిని గుర్తింపనిచో నీ ప్రయోగముగల సూత్రము (కారక—6) సమన్వయింగాదు.

సంస్కృత ధాతువులకు ఇంచుచేరుతూంది. ఈ ఇంచు చేరినపుడు సంస్కృత ధాత్వంతమునందలి ఇ ఉ ఋ, అనేవి క్రమంగా అయ్ అవ్, అర్, అనేవి ఆ దేశం అవుతాయని సూరి సూత్రీకరించాడు. (బాల—సంధి— 64) జి+ఇంచు=జయ్+ఇంచు= జయించు ఇత్యాదిగ రూపము లేర్పడునని గుర్తించాలి. జిలోని ఇ గుణంవల్ల ఏగామారి అచ్చుపరమైనందున అయి వాదేశంకాగా జయ్ అనే రూపం సిద్ధిస్తుంది. కానిపరంగా తెలుగు స్వరమున్నందున ఈ విధముగ సంధి రారాదుగాని ఇలా అయ్ ఆగమం విధించాడనవచ్చును.

'జి' అనే ధాతువుకు జయ', అని కృదంత రూపం ఏర్పడుతుంది. దీనిపై ఇంచేచేరితే 'జయించు, అవుతుంది ఈ విధంగా క్రియాజన్యములయిన నామ ముకు ఇంచుచేరంగా ఏర్పడిన నుతించు [నుతి+ఇంచు) శయనించు (శయన+ఇంచు) ఇత్యాదులను బాల వ్యాకరణంలో క్రియా పరిచ్ఛేదంలో 65 సూత్రము నందు సూరి అంగీకరించియే యున్నాడు. ప్రథమేతర (ప్రథమా+ఇతర— బాల— సంధి) రాయుగంత (రై+ఉగంత—బాల—తత్సమ— 44)ఇత్యాదులందు గుణ అయవాదేశాదులను సూరి ప్రయోగించి యున్నాడు. భవచ్ఛ్రాది (భవత్+శత్రు+అది— తత్సమ 87) అమహన్న పుంసక (అమహత్+ నపుంసక—తత్సమ 39) లూణ్మధ్యమ (లూట్+ మధ్యమ—క్రియా 29) మొదలగు సంస్కృత సంధి విశేషమును సూరి ప్రయోగించియే యున్నాడు.

అంతేగాక తెలుగునందు మరుగుపడిపోయిన పర సవర్ణ సహిత రూపముగు పజ్జ్రె అనుదానిని సూరి తన వ్యాకరణమునందలి సంజ్ఞా పరిచ్ఛేదము లోని నాల్గవ సూత్రోదాహరణములందు ప్రయో గించి యున్నాడు. నేటి తెలుగునేటక చిన్నయసూరికి కొన్ని శతాబ్దములకు పూర్వము నుండియు పర సవర్ణమునకు మారుగ అను స్వారమును ప్రయో గించుట (పంక్తి) గలదని స్పష్టము.

సంధిఅనగా $(V^1+V^2=V^2$ (V=Vowel) పూర్వ పదాంతాచ్చు పరపదాద్యచ్చు అనే ఈ రెంటికీ ఏకాదేశంగా పరపదాద్యచ్చు వస్తుంది. గసడదవాదేశము— సరళాదేశము ద్రుతకార్యములు ఇవన్నీ పై నిర్ణయం ప్రకారం సంధులుకావు. అయినా సంధి పరిచ్ఛేదంలో ఇవన్నీ ఉన్నాయి. దీనిని ఎలా సమన్వయం చేయుట మనేది ప్రశ్న. సంహిత ఉంటేనే సంధి వస్తుంది. సంహిత అనగా వర్ణములను మిక్కిలి సన్నిహితములుగ చేర్చి పలుకుట. ఈ సంహితలో వచ్చేమార్పు లయి నందున గసడదవా దేశాదులు సంధి పరిచ్ఛేదంలో ఉన్నాయని సమన్వయం చేసుకోవాలి. సంహితాయా మ్ అనే అధికార సూత్రాన్ని పాణిని సంధి పరిచ్ఛేదమునకు మునుపే సంధించియున్నాడు.

సమాసంలో విభక్తి లోపాన్ని నిత్యంగా సూరి విధి చి చేత తోడవలనలకు అంత్యాదులకు ఇత్వము అలిగాగమము సమాసము నొందగునని (సంధి—43, 44) సూత్రీకరించుట స్వవచోవ్యాఘాతము. లోపించు నీ ప్రత్యయములకు ఇ ఇత్వాగములను విధించుట వ్యర్థము. వ్యర్థమయిన ఈ యంశము ఈ సందర్భము నందు ప్రత్యయములకు లోపములేదను విశేషాంశమును తెలియజేయుచున్నది. వ్యర్థంసత్ జ్ఞాపయతి అను నీ యంశము పాణినీయ సంప్రదాయ సిద్ధము.

ద్రుతాంతములకు సంధి లేదనుటను సంధి పరి చ్ఛేదము నందలి 9 వ సూత్రము విధించుచున్నది. ద్రుతాంతములగు ప్రథమేతర విభక్త్యంతములకు సంధి వికల్పమని సంధి పరిచ్ఛేదమునందలి 2 వ సూత్రము ప్రతిపాదించుచున్నది. ఈ సూత్రము నిరవకాశముగుటగాన 9 వ సూత్రమును బాధించు చున్నది. కాని ద్రుతాంతములగు ద్వితీయాది విభక్త్యంతములకు సంధి ప్రాప్తించుచున్నది. నిరవ కాశమగు వ్యాకరణ విధి సావకాశమును బాధించుట సంస్కృత వ్యాకరణ సంప్రదాయమే.

సంధి పరిచ్ఛేద ప్రతిపాదితమగు ద్రుతసంధి (16—24) సంధి కానందుననే 9 వ సూత్ర ప్రతిపాదిత నిషేధ మీ ద్రుతకార్యముల విషయము నందు సమన్వయము కాదనియు నందుమూలముననే 9 వ సూత్ర వివరణమున ద్రుతసంధుల విషయమును ప్రతిపాదింపలేదనియు గుర్తింపవలయును.

సూత్రరచనము

సూత్ర రచనమునందును సూరి పాణినిమార్గము ననుసరించెననుట స్పష్టము. కారకములను తెలుపు విభక్త్యర్థములను వివరించి మిగిలిన (శేష) యర్థము లందు షష్ఠి ప్రయుక్తమగునని పాణిని షష్ఠీ శేషే 2–3.50 అని చెప్పగా సూరి శేష షష్ఠికి యొక్కయు నగు (బాల–కారక–15) నని సూత్రీకరించుట పై పాణిని సూత్రమున కనుకరణ మనుట స్పష్టము.

స్త్రీ లింగంబులెల్ల స్వ నియతంబులగు స్త్రీ ప్రత్యయంబులంగూడి ఇదుం బ్రవర్తిల్లు (బాల—తత్సమ—85) అని సూరి సూత్రీకరించుటంబట్టి ఈ వ్యాకరణము నధ్యయనము చేయువారు పాణినీయమునందలి స్త్రీ ప్రత్యయ ప్రకరణము సవివరముగ గ్రహించి యుండవలెననుట స్పష్టము. అంతేగాక అజ్ఞానులకుదప్ప సంయోగోపధలకు—ఇత్యాదిగ ఈ సందర్భమునందు సూరి గావించిన ప్రసంగము, పాణినీయమునందలి వార్తిక ప్రసంగము. మరియు తెలుగున సంయోగోపధకాదు. సంస్కృతమునందు పరసవర్ణము నిత్యము గావున ఇది సంయోగోపధ అనుటను బాల వ్యాకరణమును పఠించు వారెరిగియుండవలయును.

'క్త్వా'అనే ప్రత్యయం సంస్కృత ధాతువులపై చేరుతుంది. ఒకటికన్న నెక్కువ వ్యాపారము నొకే కర్త నిర్వహించిన నందు పూర్వకాలికములకు 'క్త్వా' చేరుతుంది. క్త్వా ప్రత్యయ విధాయక సూత్రము 'సమాన కర్తృకయోః పూర్వకాలే 3.4—21. క్త్వా కు తుల్యార్థక 'ఇ అనేది తెలుగులో ఇ, సమానాశ్రయంబులంబూర్వ కాలంబునందు (క్రియా 38) వస్తుందనిచెప్పి సమాన కర్తృకంబులనక...అని సూరిచేసిన వివరణమువలన తానింతవరకు పాణిని సూత్రమును దృష్టి లో నుంచుకొనియే వ్యాకరణ నిర్మాణముచేసెననియు నిక్కడ కొంతమార్పుచున్నాడనియు విశదము. దీని సూరి రచిత బాలవ్యాకరణముపై సంస్కృత వ్యాకరణ ప్రభావ మెంతగలదో విశదమగుచున్నది.

మగడును+బిడ్డలను, ఇత్యాదులు సమసింప వని చెప్పుచు నొక నియమమును చెప్పను. తెలుగు ద్వంద్వ సమాసమును విధించుచు (సమాస–7) చెప్పినమాట. అచ్ఛిక శబ్దంబుతోడ, స్త్రీ సమంబు... ఇత్యాదిగ ద్వంద్వ సమాసమును విధించుసూత్రము ఇందు స్త్రీ సమంబు ప్రథమా విభక్త్యంతము. సమాస విధాయక శాస్త్రమునందు ప్రథమాంతమునకు పసర్జమని పేరు (ప్రథమా నిర్దిష్టం సమాస ఉపసర్జనమ్ 1—2—43 కలుగుతుంది. ఉపసర్జన సంజ్ఞకము అందు మొదటి అవయవముగ నుండవలయునని (ఉపసర్జనం పూర్వమ్ 2—2—30) అనే సూత్రం నిర్దేశిస్తుంది. ఈ నియమంవల్ల స్త్రీసమము గాని మగడు ప్రథమ పదమయినందున పై ద్వంద్వ సమాసము తెలుగునం దేర్పడదని గుర్తింపవలయును. సంస్కృత సమాస పరిచ్ఛేదము నెరుగనిదే బాల వ్యాకరణమునందలి సమాస పరిచ్ఛేద మర్థముగాదు.

జీష్ మొదలగు ప్రత్యయములనేగాక మతుప్ మొదలగు తద్ధిత ప్రత్యయములను, క్త్వా, తుమ్, శతృ, క్తవత్ ఇత్యాదిగ ఎన్నో కృత్ప్రత్యయ ముల ప్రసంగము బాలవ్యాకరణమున గలదు.

అంతేగాక సవర్ణము, వృత్తి, పర్యుదాసము, ఇత్యాది పారిభాషికములు సంస్కృతమునుండి గ్రహింపబడి బాలవ్యాకరణమునందు ప్రయుక్తములయినవి.

పరిచ్ఛేద, అనుపదము నందు పరి+ఛేద, అని యుండగా నడుమ తుకాగా ఇత్యంజ్ఞకములు లోపించి పరిత్+ఛేద, అని కాగా శ్చుత్వమువచ్చి పరిచ్+ఛేద=పరిచ్ఛేద అయినదని గుర్తింపవలయును.

ఇంతగ పాణినీయము ననుసరించిన సూరి వ్యాకరణమును బాలవ్యాకరణముగాక 'ఆంధ్రపాణినీయ' మనుట సమంజసమనిపించును.

కలగూరగంప :

ఆధునిక యుగము - గాంధీ సాహిత్యము

ఆర్యా,

ఫిబ్రవరి నెల భారతిలో ప్రచురితమైన 'ఆధునిక యుగము—గాంధీ సాహిత్యము' అనే వ్యాసం రెండవ భాగం మార్చి నెలలో ప్రచురింపబడింది. నిజానికి మొదటి భాగంపై నా అభిప్రాయాలు తెలియజేసిం తర్వాత మళ్ళా రెండవ భాగానికి విమర్శ వ్రాయాల్సి వస్తుందనుకోలేదు. కాని యీ వ్యాసంకూడా వివాదానికి చోటిచ్చే అభిప్రాయాలు ప్రకటించడంతో నేను నా అభిప్రాయాలు వెల్లడించడం తప్పనిసరైంది. వీటిని సాహిత్య జిజ్ఞాసువులు సహృదయతతో పరిశీలించాల్సిందిగా కోరుతూ మీ ముందుంచుతున్నాను.

మొదటి నేను మనవి చేసిన, రెండు భాగాలలో 'కొక్కొండ వేంకటరత్నం పంతులుగారి ప్రశంస' అనే శీర్షిక క్రిందకే యీ భాగంగూడా వస్తుంది. ఈ వ్యాస విషయం 'ఆధునిక యుగము—గాంధీ సాహిత్యము' అనే శీర్షికతో ఏ విధంగా సంబంధించడం లేదో ముందే మనవి చేశాను. శీర్షికకీ, విషయానికీ గల సంబంధం అలావుంచి, కొక్కొండ వారిని ప్రశంసించడాన్నే గ్రహించినా ఈ ప్రశంస కొంత 'మితి మీరి' వుందనక తప్పదు. కొక్కొండవారి గొప్పతనాన్ని భూతద్దంలో చూస్తూ, ఆయనకు ఉన్నకంటే ఎక్కువ విలువ నివ్వాలనే ప్రయత్నం ఈ వ్యాసంలో సర్వే సర్వత్ర బాహాటంగా కనిపిస్తోంది. ఈ నా ఆలోచన సరైనదే అయితే సారస్వత చరిత్రలో పాఠకుల్ని ఈ వ్యాసం తప్పు త్రోవ పట్టించడమేగాక, వారి దృష్టిలో ఎంతోమందికంటె కొక్కొండవారిని ఉన్నత స్థానంలో ఉంచుతుంది. ఇది సాహితీరంగంలో సత్యాన్వేషకులకు ప్రమాదకరం. పంతులుగారిపై పక్షపాతం చూపబోయి, ఆయన వ్యక్తిత్వాన్ని అపహాస్యం పాలుచేసిన సందర్భాలుకూడా ఉన్నాయి.

ఉదాహరణకు పంతులుగారు పీఠమునకు ద్రవ్యము చెల్లించలేదని ఆచార్యులు వారిని వెలివేయబోగా అతడే ద్వైతమతాన్ని వెలివేసి అద్వైతం గ్రహించారని వ్రాశారు. అంటే పీఠానికి ద్రవ్యాన్ని చెల్లించలేకనే 'అద్వైతం' గ్రహించినట్లు స్పష్టమౌతుంది. 'క్రమక్రమముగా వారికి శంకరాద్వైతము నందభినివేశముహెచ్చి, తన ద్వైత మతమునువీడి అద్వైత మతానుయాయి యగుటకు నిశ్చయించుకొనిరి'—అని వేంకటరావుగారుచెప్పినదాన్లో సామంజస్యం కన్పించదు. ఇదంతా మత స్వాతంత్ర్యంగా వారికి కన్పించింది. ఈ విషయాన్ని గురించీ, అద్వైత మత వ్యాప్తికై ఆయన చేసిన సేవ గురించీ నిరూపించడానికి ఉదాహరణలు 'బిల్వేశ్వరీయము' నుంచి యివ్వబడ్డాయి. ఇది పంతులుగారి స్వవిషయం. కాగా దాన్నే వ్యాసకర్త గ్రహించారు.

ఇక వ్యాసకర్త వ్రాసిన మూడవ విషయం భాషా స్వాతంత్ర్యం. భాషా స్వాతంత్ర్యాన్ని గురించిన నిడదవోలు వారి అభిప్రాయం సరైనదిగా కనిపించదు. లేకపోతే 'ఆంగ్లభాషా విసర్జనోద్యమము'నకు పూను కొని దానిని సాధించిన మహావ్యక్తి వేంకటరత్నం పంతులు—అని వ్రాయడానికి సాహసించి వుండరు. ఏ భాషా కూడా యితర భాషలనుండి పదాల్ని సంగ్రహించి సొంతం చేసుకోకుండా వుండదు. అలా గ్రహించడం భాషాభివృద్ధికి దోహదం చేస్తుంది. మన భాష తొలుత సంస్కృత పదాల్ని ఎన్నింటినో గ్రహించిన విషయం కాదనలేం. ఇక ఆంగ్లభాషా పదాల్ని గ్రహిస్తే దోషం ఏముంది? ఇతర భాషాపదాలు గ్రహించడం ద్వారా భాష సంకరమౌతుందనీ, సంకరమవడం ఏదో గొప్ప దోషమనీ భావించడాన్ని భాషా శాస్త్రజ్ఞు లెవరూ ఆమోదించరు.

'పంతులుగారు దైనందిన వ్యవహారమున సంభాషణలలోనూ, వ్యావహారికభాష మాని గ్రాంథిక భాషలోనే మాట్లాడుచుండెడి వారన్న విషయము యాంధ్రలోక మెఱిగినదే. ఇట్లు స్వభావ సిద్ధమగు

వాడుక భాష విసర్జించి గ్రాంథికభాష మాట్లాడుటయు నొక విశిష్టతయే' అని వీరు వ్రాశారు. వ్యవహారంలోవున్న భాషనే గ్రంథస్థం చేయాలని అందరూ ప్రయత్నిస్తూంటే, గ్రాంథిక భాషని వ్యవహారంలో పెట్టడానికి ప్రయత్నించడంలో సామంజస్యం విజ్ఞులు గ్రహించవలసింది. దీన్ని 'విశిష్టత'గా నిడదవోలు వారెందు కనుకుంటున్నారో అనూహ్యం.

'తెలుగున వ్యావహారిక భాషనే గ్రాంథికముగా చేసిన తెలుగు పండితులలో ఆయనే మొదటివాడని, చివరివాడని చెప్పవచ్చును'— అని వ్రాశారు. ఇందులో మొదటివాడు కావడం విశిష్టత అవునో కాదో గాని, చివరివాడవడానికి కారణం ఏమిటని ఆలోచించాలి. అంటే ఆయన ఎవరికీ మార్గదర్శకుడు కాలేక పోయారు. కారణం ఆయన అనుసరించిన పద్ధతి కాలానుగుణమైంది కాదు. కాలాన్ని వెనక్కి తిప్పే ప్రయత్నం గనక అనుసరించేవారు లేకపోయారు. ఒక వేళ అలాంటి ప్రయత్నం ఎవరైనా చేస్తే అది ఎన్నాళ్లో నిలవదనీ ఖచ్చితంగా చెప్పొచ్చు. అయితే కొక్కొండవారి వ్యక్తిగతాభిప్రాయాల ననుసరించి ఆయన అలా చేశారు. కాని వేంకటరావుగారు దీన్ని ఘనతగా భావించడంలో ఔచిత్యం సహృదయులే గుర్తించాలి.

'ఆయన గ్రాంథిక సంభాషణములు నాటకముల లోని పాత్రల సంభాషణమువలె నుండెడిది'— ఇది పంతులుగారికి ప్రశంసా? అభిశంసనా? లేక విషయాన్ని ఉన్నదున్నట్టుగా చెప్పడమా?

'ఉపన్యాసకులు — ఉద్యమ ప్రచారము'—అని వ్రాస్తూ 'ఆ కాలమున ఉపన్యాసము లనగా ఆంగ్లభాషోపన్యాసములే, వాని మూలమున మన మత సంస్కృతులను గూర్చి ప్రచారము జరుగుచుండెడిది. ఆ యుపన్యాసము లాంగ్లభాష రానివారికి 'నిరుపయోగము లైనవి. ఈ సంగతి గ్రహించి, మాతృభాషలో నుపన్యాసము లిచ్చి, ప్రజల నుద్బోధించినవారిలో ప్రథములు కొక్కొండవారే' అని వేంకటరావుగారు వ్రాశారు. అయితే ఆయనే మచ్చుకు కొన్ని సంభాషణలు పంతులుగారు మాట్లాడేవి ఉదాహరించారు. అవి

'మన్నె కంటి! బిచ్చగాడు వచ్చె నాడు
బిచ్చము నిచ్చి పంపుము'

'తండులంబులు నిండుకొన్నవి
పొందు పొందు.'

'తరుణీ దంతధావనమునకు సిద్ధము చేసితివా?'

'పడతీ! పాద ప్రక్షాళనకు పానీయంబులు దెమ్ము'

ఇత్యాదులు. ఈ రకమైన భాష వాడడానికి కారణం ఛాందసమా? లేక వేంకటరావుగారు చెప్పినట్లు 'ఆంగ్ల భాష రానివారి ఉపయోగం' కోసమా? (అధో రేఖాంకితమైన భాగాలలో యతిప్రాసలు గమనించ దగ్గవి).

'కొక్కొండవారు గ్రాంథికభాషలో ననుప్రాసలతో, అలంకారములతో గంటలకొలది ప్రసంగములు చేసెడివారు. 'ఉపన్యాసము' అనగా 'ఆంగ్లభాషోపన్యాసమే' అన్నప్రథను విస్మరింపజేసి 'ఆంధ్రభాషోపన్యాసము' అను నామమును వ్యాప్తిచేసి'నవారు పంతులుగారు అని వ్రాశారు. అటువంటి ఉపన్యాసము ఆంగ్ల భాష రానివారి ఉపయోగంకోసం అనేకన్నా తెలుగు భాషా పండితులకి మాత్రమే ఉపయోగపడుతుంది, అది ఇటు ఆంగ్లభాషోపన్యాసమూ కాదు. అటు ఆంధ్రభాషోపన్యాసమూ కాదు. 'గీర్వాణ భాషోపన్యాసమే!' అనుప్రాసలూ, అలంకారాలూ, సంస్కృతంతో కలిసిన గ్రాంథికమూ అపరిహరణీయాలని వారి కాలంలో కొక్కొండ భావిస్తే అది వారి అభిరుచి, కాని దాన్లో అసలు సిసలైన 'ఆంధ్రోపన్యాసం' రూపొందించాలనే కోరిక ఉందా?

'యింతవరకు పట్టుబట్టినట్లుగా సమకాలిక వ్యవహారమునకు విరుద్ధముగా నెందులకు చేసినాడో యెవ్వరును వివరింపలేదు.' అని వ్రాస్తూ 'తన కాలమున నొక 'వెల్లువవలె క్రమక్రమముగా తెలుగు భాషను ముంచివేయుచున్న ఆంగ్లభాషా ప్రవాహము నరికట్టుటకే ఆయన గ్రాంథిక భాషను వాడుక భాషగా చేసికొన్నాడు' — అని బయటపెట్టారు. ఇక్కడ ఎవరూ వివరించని విషయం చెప్పాలనే తపన మాత్రమే కనిపిస్తోంది. కాని యుక్తి సహమా కాదా అని యోచించినట్టులేదు. ఆంగ్లభాష తెలుగు భాషను 'ముంచివేయుచున్న'దనడం నిజమా? అది ఈ భాషనేనా లేక ఇతర భాష లన్నిటినీ కూడా ఆ కాలంలో ముంచివేయడానికి ప్రయత్నించిందా? ఇతర భాషల్ని కాపాడిన వారెవరు? అదే నిజమైతే ముంచి

వేయకుండా ఆపడం ఒకరివల్ల జరిగే పనా? ఆ విధంగా జరగకుండా ఆపాలంటే గ్రాంథికమే శరణ్యమా? దానికి అలంకారాలూ, అనుప్రాసలూ కూడా ఉండాలా? ఆంగ్లపదాలు లేని వ్యావహారికం ఉపయోగించడం అసాధ్యమా? ఇలా అనేక ప్రశ్నలుదయిస్తాయి. 'నిత్య వ్యవహారమున తెలుగులో నెన్నో పదములు కలిసిపోయి వానిని వాడుక చేయవలసిన ఆవశ్యకత నిరూపించినవి. అట్టి పరిస్థితులలో 'ఇంగ్లీషుభాష విసర్జించుటకు, తొలుత ఆంధ్రాంగ్ల సమ్మిశ్రితమైన వ్యావహారికాంధ్రభాష విసర్జింపవలెను. అట్లయిననే తన ప్రయత్నము ఫలించును' అన్న మహోద్దేశము' పంతులుగారు గ్రాంథికభాష వాడటానికి కారణం అంటున్నారు నిడదవోలువారు. ఈ విషయం కొక్కొండ వారెక్కడా చెప్పినట్టులేదు. వీరు చెప్పినది పైన చూపిన సందేహాలకి దారి తీస్తోంది.

కొక్కొండవారిని గూర్చి 'ఆయన ఆంగ్లభాష బాగా వచ్చినవాడే' అని ప్రత్యేకించి వేంకటరావుగారు వ్రాయడం అనుమానానికి దారి చూపేదిగా వుంది. ఆంగ్లభాష ప్రభావం (Domination) ఇష్టంలేక దానిపట్ల అసహనంతో పంతులుగారు ఆంగ్ల పదాల్ని అనువదించి ప్రయోగిస్తున్నట్టు కన్పిస్తుంది. ఈ అనువాదాల ప్రధాన లక్షణం ఛాందసంగా వుండటం.

అసహనం అనడానికి కారణం ఆయన ఆంగ్లేయుల పేర్లు సహితం ఉచ్చరించడానికి యిష్టపడక అనువదించడం. సంస్కృతంనుండి వచ్చిన 'వ్యక్తుల పేర్లు' అనువదించడం ఎన్నడూ జరగలేదు.

Mark hunter — సూటియగుపోటు వేటగాడు.

Mr. Stone—పాషాణ నామక (విద్యాశాఖాధికారి.)

అని ఈ రకంగా అనువదించడం ఛలోక్తిగా గ్రహించాలి గాని గొప్పదనంగా కాదు. అలా అనువదించడం మనస్ఫూర్తిగా చేస్తే ఛాందస మనుకోవాలి. అయితే యిలా పేర్లు అనువదించిన వీరు తాము రచించిన 'ప్రిన్సుపు వేల్సు హిందూస్థాన సందర్శనము' అనే గ్రంథానికి పెట్టిన పేరులో 'Prince of wales' అనే భాగాన్ని అనువదించక పోవడానికి కారణం కనిపించదు.

వీరి అనువాదాల ప్రాశస్త్యాన్ని పరామర్శిద్దాం.

Attendance Register—రాకపోకల పట్టీ.

ఇది వచ్చినది, రానిది తెలియజేస్తుందిగాని, వచ్చినవారు వెళ్లిపోవడం అనేది తెలియజేయదు. నేటి కాలంలో 'రాకపోకలపట్టి' అంటే రైలుబళ్ల రాకపోకలు తెలియజేసే పట్టిక అని అర్థం. దీన్ని 'హాజరు పట్టీ' అని పిలివాలన్న విద్యార్థి కోరిక సమంజసమైందిగానే కనుపిస్తోంది. 'దివాణం' అనే పదం వాడిన వారికి 'హాజరుపట్టీ' అని వాడటానికి అభ్యంతరమెందుకో తెలీదు. పోనీ Attendance అనే పదానికి 'రాకపోక'లనే అర్థం లేదు. Hunter గారు ఈ అనువాదాన్ని విని నవ్వుకున్నారు. ఎందుకో మరి?

Stone దొరగారు laboratory చూదామనగానే వెనువెంటనే 'మీరు వైజ్ఞానిక కర్మాగారమునకు వెడలుదురా' అనడం బాల్య చాపలంగానో, క్రొత్త భాష నేర్చుకుంటున్న వారి కుతూహలం లాగానో కన్పిస్తుంది. ఈ అనువాదం ఎంత సమంజసమో కూడా విజ్ఞులే చెప్పాలి.

Monthly Subscription — మాసభృతి.

Yearly Subscription—సాలుచందా.

వీటిలో Subscription అనే పదానికి 'భృతి' సరైన పదమేనా? 'సాలు చందా'లో ఏమాత్రం తెలుగుతనం ఉంది? 'రైవిన్యాసక సభ (Board of revenue), అని 'Revenue' పదానికి తెలుగు లక్షణం ఆరోపించితే తప్పులేదా ? ఆంగ్లభాషని వర్జించడం కోసమని వ్యావహారికాన్నే వర్జించి గ్రాంథికం వాడినవారు ఈ పదం ఎలా గ్రహించారు? ఆంగ్లమే వర్జనీయంగాని సంస్కృతంగాని, హిందీగాని వర్జనీయాలు కావా? Municipality అంటే పుర పారిశుద్ధ్య విచారణ సంఘ మనడం ఎంతవరకూ సమజసం ?

కొక్కొండవారి అనువాద ప్రాశస్త్యాన్ని ఇంత వరకూ పరామర్శించాము. ఇక ఈయన అనేక పత్రిక పారిభాషిక పదాలు తయారుచేశారనీ, అవే నేటికీ వాడుకలో ఉన్నాయనీ నిడదవోలు వారంటున్నారు. అల ఆయన అనడానికి గల ప్రమాణాలేమిటో వివరించాలి

ఉంది కొక్కొండవారి పారిభాషిక పదాలు 1910 వరకు వ్యాప్తిలో ఉన్నాయనడానికి కందుకూరివారు వాటిని ప్రయోగించడం నిదర్శనంగా చూపుతున్నారు. వారు చెప్పినట్లు ఆ పదాలలో కొన్ని నేడు కూడా వాడుకలో ఉన్నాయి. కాని వారే ప్రథమంగా ఆ అనువాదాలు చేసేరన్న విషయం నిర్ధారణ చేయడానికి నిదర్శనా లవసరం.

'కందుకూరికి ముందు, ప్రాచీన నవీనతలను సమన్వయము చేసిన కొక్కొండ యుగకర్తృత్వము' గ్రహింపజాలని వారిని గూర్చి వేంకటరావుగారు జాలి పడుతున్నారు. ఎప్పుడూ ప్రాచీనతవైపు మొగ్గుచూపే కొక్కొండవారిలో అలాంటి సమన్వయం ఉందనగలమా?

'అన్నింటి కన్నవింత —కందుకూరివారిని గూర్చి విశ్వవిద్యాలయములో జరిగిన పరిశోధనా గ్రంథమున గూడ పైని నేను వ్రాసిన విషయములు మృగ్యములు'— అని వీరు వ్రాశారు. కందుకూరిని గూర్చి వ్రాస్తూ సమకాలికులు కావడంచేత కొక్కొండ వారిని ప్రస్తావించడం ఉచితమైనది కావచ్చుగాని, ప్రస్తావించక పోవడం ఘోరమైన నేరంగా పరిగణించ నక్కర్లేదు.

నిడదవోలువారు సారస్వతాన్ని నిరంతరం మథనం చేయడంవల్ల వారు సాధికారంగా కొన్ని విషయాలు చెప్తారు. అలా ఇందులో అనేక విషయాలు చెప్పారు.

1. మాధ్వభాష్యమును తొలుత తెలుగు లిపిలో ముద్రించినవారు కొక్కొండవారే.

2. పంతులుగారికి వారి పదునాఱవయేట (క్రీ. శ. 1838) శ్రీ తిరుమల క్షేత్రమున శ్రీ బిల్వేశ్వరుని యనుగ్రహమున— నపూర్వ కవితా శక్తి లభ్యమైనది.

3. ఇందు శంకర విజయధ్వజము అనునది శంకరాచార్యుల జీవితము. మొట్టమొదట తెలుగున వెలువడిన శంకరాచార్య జీవిత మిదియే.

4. ప్రత్యేక సభల మూలమున హైందవ మత పునరుజ్జీవనమునకు చెన్నపురిలో దోహదము చేసినవారిలో ప్రథములు వేంకటరత్నము పంతులుగారే.

5. వగాత్రు గానలో నుపన్యాసము లిచ్చి ప్రజల ను ద్బోధించినవారిలో ప్రథములు కొక్కొండవారే.

6. స్వాతంత్ర్య సమరమున - ప్రచారమంతయు ఆంధ్రభాషోపన్యాసముల మూలముననే జరిగినదనియు నట్టిదానికి కొక్కొండవారే మూలపురుషు లనియు గ్రహింపవలెను.

7. తెలుగున వ్యావహారిక భాషనే గ్రాంథిక ముగా చేసిన తెలుగు పండితులలో ఆయనే మొదటివాడని, చివరవాడని చెప్పవచ్చును.

8. వారే తొలుదొలుత పత్రికా సంబంధమైన, రాజకీయ సంబంధమైన పారిభాషిక పదము లను క్రీ. శ. 1870 లో సృష్టి చేసినారు.

9. మొట్టమొదట తెలుగుభాషలో ఆధునిక భాషాశాస్త్ర పద్ధతులపై వ్యాసము— 'ఆంధ్ర భాష' అనునది (అధోజ్ఞాపిక—12).

10. ఇది ((ప్రిన్సు వేల్సు హిందూస్థాన సందర్శనము) తెలుగున యాత్రా వాఙ్మయమునకు సంబంధించిన మూడవ గ్రంథము. మన వాఙ్మయమున ఇంగ్లండు, లండను మున్నగువాని వర్ణనే మీయొక్క గ్రంథముననే గలదు.

11. తెలుగున 'ఆంధ్ర' అను పేరుతో వెలువడిన మొదటి పత్రిక ఆంధ్రభాషా సంజీవని.

ఈ విధంగా వీరు కొన్నింటిని ప్రథమస్థానం నిర్ణయించడానికి ఆధారాలేమిటో తెలియదు. అధో జ్ఞాపికలలోనైనా వ్రాసివుంటే బాగుండేది. అధోజ్ఞాపికలలో అనవసర విషయాలకు బదులు ఇలాంటి ఆవ యుక్త విషయా లుండాలి. ఉదాహరణకు మూడవ అధోజ్ఞాపికలో 'శార్దూల మాలిక మండపాక పార్వతీశ్వర శాస్త్రులవారి మాలికా కవిత్వమున కొక మచ్చుతునక' అని వ్రాస్తూ అందులో 'కకార ప్రాస' వుందని వ్రాశారు. ఇది శార్దూల మాలిక అనిగాని, ఇందులో కకార ప్రాస వుందనికాని వ్రాయడం అవసరమా అని.

ఇలా వివిధ కోణాలనుండి ఈ వ్యాసాన్ని పరిశీలించి నా అభిప్రాయాలు పాఠకుల ముందుంచుతున్నాను. సత్యాన్వేషణాసక్తితో చేసిన ఈ నా కృషిని సహృదయులు మన్నిస్తారని ఆశిస్తున్నాను.

శ్రీ టి జి. కృష్ణారావు

గ్రంథవిమర్శలు

ఉత్తర హరివంశము : నాచనసోమనాథ ప్రణీతము

(సంపాదకురాలు శ్రీమతి డా. పి. యశోదా రెడ్డి, ప్రకాశకులు : ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి, కళాభవన్, సైఫాబాదు : హైదరాబాదు—4 డెమ్మీ 1/8 పే. 320 లు. హాఫ్‌కాలికో బైండు : వెల రు 5/—లు.)

ఉత్తర హరివంశము ఎంతో విశిష్టతగల కావ్య రాజము. పండితవర్యులకుగూడ నేటికిని దుర్గ్రాహ్యముగా ఉన్నవెట్టులు గల గ్రంథము. దీనిని టీకా తాత్పర్యములతో ప్రకటింప బూనుకొనుటకు ఆం. ప్ర. సాహిత్య అకాడెమీ నిర్ణయించుట శ్లాఘ్యము. అది బహుకాల సాధ్యము గనుక ముందు మూలమును విపుల పీఠికతో ప్రకటించుటయు సంభావ్యము. ఆ భారమును, హరివంశమునుగూర్చి పరిశోధన వ్యాసము వ్రాసి డాక్టరేటు పట్టము పొందిన శ్రీమతి డా. పి. యశోదారెడ్డికి అప్పగించుటయు ఎంతయు సముచితము. తమపైనుంచిన మహాభారమును సమర్థతతో శ్రద్ధతో నిర్వహించినందులకు డా. యశోదారెడ్డిని హృదయ పూర్వకముగా అభినందించుచున్నాము.

నాచనసోమనాథునిగూర్చి ఎన్నో వివాదగ్రస్త విషయములున్నవి.

(1) నాచన సోమనాథుని కాలమేది?

(2) ఆయన హరివంశ పూర్వ భాగమును గూడ రచించెనా, లేదా? ఆయన రచించిన ఇతర గ్రంథములేవి?

(3) హరివంశ రచనలో ఎఱ్ఱయది మేలా, సోమనది మేలా?

వీనిలో 3 వ అంశమును గూర్చి పండిత వరేణ్యులు బహుకాలమునుండి వాదోపవాదములు జరిపియున్నారు. నేటికిని వాని ప్రతిధ్వనులు వినవచ్చుచున్నవి. ఒకరు కవిత్రయములో స్థానము సంపాదించుకొన్నవారు. ఇంకొకరు వారితో సమాన గౌరవమునకు అర్హులైనవారు. అట్టి మహాకవు లిద్దరి మధ్యను తారతమ్య విచారణ చేయబూనుకొనుట అపరాధ మవునను భావముతో కావచ్చును, సంపాదకులు తమ 51 పేజీల సుదీర్ఘ పీఠికలో స్పృశింపకుండుట ఎంతయు ఔచిత్య సహితముగా ఉన్నది.

కవికాలమును గూర్చి విపులముగా సంపాదకులు చర్చించిరి. అన్ని వాదములకును పెంచి కలదిన్నె శాసనమే ఆధారము. కాని అందులో కాలమునకు సంబంధించిన భాగము సంశయాస్పదముగా నుండుటచే, నాలుగు వివిధ పాఠములు విమర్శకులచేత సూచింపబడినవి. సంపాదకులు వాని నన్నిటిని సుష్ఠుగా పరిశీలించి శ్రీ నేటూరి ప్రభాకరశాస్త్రిగారు సూచించిన 'రసర్తునయనేందుభిః' సవరణ యుక్తతరముగా ఉన్నదని నిర్ణయించిరి. దానివల్ల అది క్రీ. శ. 1344 అవును. దానినిబట్టి సోముడు 1285—1350. 55 ప్రాంతములలో జీవించెనని నిర్ధారణ చేసిరి. ప్రస్తుతము ఉపలభ్యములైన ఆధారముల నన్నిటిని బట్టి సంపాదకుల ఊహ సమంజసముగా ఉన్నది. ముందు ముందు నూతనాధారములు లభించినప్పుడేమగునోగాని, ప్రస్తుతమున కది సిద్ధాంతముగా గ్రహించుటకు ఎట్టి విప్రతిపత్తియు లేదు.

సోమన పూర్వ హరివంశమును రచించెనా? రచించెననుటకు ఆధారములుగా ఇప్పటికి విమర్శకులు చూపిన ఉపపత్తు లన్నిటిని విచారణచేసి ఆయన హరివంశ పూర్వభాగమును వ్రాయలేదనియే నిర్ధారణ చేసిరి. పూర్వభాగము కూడ వ్రాసియుండుననుటకు ముఖ్యముగా 3 కారణములు పూర్వ విమర్శకులు చూపుచు వచ్చినారు. 1. అవతారికాదులు లేకుండుట

2. జనమేజయ ప్రశ్నము 'హరివంశ ప్రథమ కథానంతరమున' అని ప్రారంభించుట 3. 'శతతాళదఘ్న హ్రదమున నురికెన్' అను కందపాదము నాచనసోమునిదిగా ఓగిరాల జగన్నాథకవి ఉదాహరించుటచే పూర్వ హరివంశములో కాళియమర్దన ఘట్టములోనిదని ఊహించుట. పై వానిలో 2, 3 కారణములను హరివంశ మూలముతో పోల్చి చూపి చక్కగా పరాస్తము చేసిరి. అవతారికాదులు లేకుండా గ్రంథారంభము చేయుటకును ఇందలి ప్రథమ పద్యమే 'నారాయణం నమస్కృత్య' ఇత్యాది శ్లోకమును చాలవరకు అనుసరించినదనియు ఇందులో శ్రీతోపాటు, నారాయణుడును, సరస్వతియు, వ్యాసుడును స్మరింపబడినదనియు నమస్క్రియా రూపమైన గ్రంథారంభము చేసినాడని సమర్థించినారు. మంచి సమర్థనమేకాని 'సమర్థన' మాత్రమే. 'నారాయణం నమస్కృత్య' ఇత్యాది సంప్రదాయ శ్లోకములో నారాయణునితో పాటు సమానముగా 'నరంచైవ నరోత్తమమ్' అని నరుడుకూడ స్మరింపబడుచున్నాడు. ఆ పద్యము నెంత లాగి అన్వయింపజూచినను దానిలో 'నరుని'జాడ కనబడదు. 'జయ' (భారత) పఠనము సంప్రదాయముగా ప్రారంభింపబడు శ్లోకార్థముతో పూర్తిగా అనువదింపకున్నను లాక్షణికులు నియమించిన 'నమస్కార' ముండుటచే గ్రంథారంభము లక్షణ యుక్తముగా కాపాడబడిన దన్నంతవరకు యుక్తముగా ఉన్నది, సంపాదకుల నిర్ణయము.

సోమనాథుడు రచించిన ఇతర గ్రంథములు: (1) వసంత విలాసము, (2) హరవిలాసము, (3) ఆది పురాణము అని తేల్చుటకు చూపిన ఉపపత్తులును బాగున్నవి.

సోమనాథుడు అనువాదములో అనుసరించిన విధానములు విస్తరించుట. సంక్షేపించుట, రసపోషణమును సంపాదకులు సంస్కృత మూలభాగములును అనువాద భాగములును ఉదాహరించి చక్కగా ప్రదర్శించిరి. ఆయన నవీన గుణసనాథుడనుటకు కారణములును చక్కగా వివరించిరి. సంపాదకుల పీఠిక ఆద్యంతము నిగ్రహమునకు, శ్రద్ధకు, విచక్షణకు దృష్టాంతప్రాయముగా నున్నది.

ఇందలి పాఠమునకు ముద్రిత ప్రతులే అనుసరింపబడినవనియు వ్రాతప్రతులను సేకరించి సంప్రదించి మూలము సిద్ధము చేసిననేగాని తృప్తికరముగా నుండదని పీఠికాంతమందు ఉద్ఘాటించుట యుక్తముగా నున్నది.

ఈ గ్రంథ ముద్రణము, పీఠికలోను మూల గ్రంథములోను, లెక్కలేనన్ని తప్పులతో నిండి యున్నది. ఈ లోపము ఎవరిదైన కావచ్చును. ఇన్ని అచ్చుతప్పులున్న గ్రంథమునుబట్టి సంపాదకులు గ్రహించిన పాఠముల ఔచిత్యానౌచిత్యములు నిర్ధారణచేయుట ధర్మముకాదని ఆ ప్రయత్నము వదలివేసితిమి. ఈ గ్రంథము సంపాదకత్వము సమర్థతతో నిర్వహించిన డా. యశోదారెడ్డిని అభినందించుచు, మంచి టీకతో ఈ ఉద్గ్రంథమును త్వరలో ప్రచురింపవలెనని సాహిత్య అకాడెమీ వారిని అర్థించుచున్నాము.

శ్రీనాథ పదప్రయోగ కోశము

(ద్వితీయ భాగము)

(సంపాదకులు: శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ప్రకాశకులు: ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ, కళాభవన్, హైదరాబాదు-4, డెమి $\frac{1}{4}$ పే. 1150 లు వెల: గ్రంథములో తెలుపబడలేదు)

ఆంధ్రభాషకు నిఘంటువులు పూర్వకాలమునను ఆధునిక కాలమునను ఎన్నియో వెలసినవి. ఆధునిక కాలములో వెలసిన నిఘంటువులలో నెల్లి శ్రీ సీతారామా

చార్యులుగారి శబ్దరత్నాకరము విస్తారముగా వాడుకలో నున్నది. సూర్యారాయాంధ్ర నిఘంటువు అపారమైన ధనవ్యయముతో నెలకొల్పబడినను ఇంకను ప్రకటనము పూర్తికాలేదు. ఈ రెండునుగాక మరియు ఎన్నియో నిఘంటువులు పెద్దవి చిన్నవి ప్రచారములో నున్నవి. ఇవి యన్నియు ఒక్కొక్క పండితునియొక్కగాని పలువురు పండితులయొక్కగాని భాషాజ్ఞానముమీద ఆధారపడి కూర్చబడినవేకాని ఆధునిక శాస్త్రీయ పద్ధతుల ననుసరించి ప్రామాణికముగా కూర్చబడలేదు. ఈ లోపమును పూరించుటకు, ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమీ స్థాపింపబడిన నాటినుండియు ప్రాథమికచర్యగా రెండు బృహత్పథకములను చేపట్టినది. వానిలో ఒకటి వివిధ వృత్తులకు సంబంధించిన మాండలికవృత్తిపదకోశములు కూర్చుట. రెండవది ఆంధ్ర మహాకవులలో ప్రధానుల పదప్రయోగ కోశములు కూర్చుట మొదటివానిలో మూడు కోశములు ప్రచురింపబడినవి, మరి రెండు సిద్ధమగుచున్నవి. రెండవ వర్గములో (1) నన్నయ (2) తిక్కన సం-I (3) నన్నెచోడుడు (4) శ్రీనాథ పదప్రయోగ కోశములు ప్రకటింపబడినవి. ఈ 2 వ సంపుటముతో శ్రీనాథునిది పూర్తి ఐనది.

అకాడెమీ తలపెట్టిన రెండు వర్గముల కోశములు సిద్ధమైనపిమ్మట కొంతవరకు ప్రామాణికమనదగు ఆంధ్ర నిఘంటువు సిద్ధము చేయుటకు ప్రాతిపదిక ఏర్పడగలదు. ఇటువంటి బృహత్ప్రణాళికను చేపట్టి ఎక్కువ భాగము సాధించినందుకు అకాడెమీ కార్యకర్తలను అభినందించుచున్నాము.

ఈ శ్రీనాథ పదప్రయోగకోశ భారము ఉస్మానియా యూనివర్సిటీలో బహుకాలము ప్రధానాధ్యాపకులుగా ఉండిన శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు వహించినారు. అకాడెమీ కార్యక్రమము తలపెట్టుటకు బహుకాలము క్రిందటనే తమ విద్యార్థుల సహాయముతో శ్రీ లక్ష్మీరంజనంగారు చాలా భాగము సిద్ధము చేసిన వ్రాతప్రతుల సంపుటములను అకాడెమీవారికి చూపి వారు తృప్తిపడిన పిమ్మట అవసరమైన మార్పులు చేసి ఈ కోశము సిద్ధము చేసినట్లు ప్రథమ సంపుటము తొలి పలుకులో తెలిపినారు. ఈ కోశము తుది రూపము రూపొందించుటకు పూర్వమే అకాడెమీవారి నన్నయ నన్నెచోడ పదప్రయోగ కోశములు ప్రచురింపబడి యుండుటచే, వాని నిర్మాణము పరిశీలించి, సాధక బాధకములను గమనించి, కొంత నూతన పద్ధతిలో ఈ కోశ నిర్మాణము చేసినారు. వానిలో ముఖ్యమైన వివి :

1. నన్నయ కోశములో తత్సమ ధాతువులే కాని నామ శబ్దములు గ్రహింపబడలేదు. 'ధర్మువు, వృద్ధు' వంటి విచిత్ర తత్సమ నామముల కా కోశములో స్థానము లేకపోయినది. ఆ లోపమును సరిచేయుటకు అట్టి రూప భేదములు కల నామములను సిద్ధముచేసి వాని కిందులో స్థాన మిచ్చిరి.

2. వ్యక్తులు, నదులు, కొండలు మున్నగు దేశ్యములైన సంజ్ఞానామములనుగూడ ఇందులో చేర్చినారు.

ఇట్లే మరికొన్ని మార్పులుకూడ ఈ కోశములో చేసినట్లు సంపాదకులు తెలిపినారు. ఏ పిడివాదమునకు కట్టుబడక ముందువచ్చిన కోశములను పరిశీలించి, వానిపై వచ్చిన విమర్శలు గమనించి, ప్రణాళికలో అవసరమని తోచిన మార్పులతో ఈ కోశము సిద్ధముచేయుట సంపాదకుల విజ్ఞతకు శాస్త్రీయ దృక్పథమునకు నిదర్శనములు.

ఈ పదప్రయోగ కోశములు నిఘంటు నిర్మాణమునకే కాక శాస్త్రీయ వ్యాకరణ రచనకును ఉపయోగపడును. ఆయా కవుల ప్రయోగ విధానములు విమర్శించుటకును ఉపకరించును.

ఈ కోశములో నిర్వివాదములైన శ్రీనాథుని రచనలలో శృంగార నైషధాదులే కాక శ్రీనాథుని కర్తృత్వము వివాదాస్పదముగా ఉన్న క్రీడాభిరామము, పలనాటి వీరచరిత్ర, చాటువులుకూడ గ్రహింపబడినవి. దాని కర్తృత్వము శంకించువారికి గూడ ఈ కోశములో వానిని గ్రహించుటకు అభ్యంతర ముండరాదు.

శ్రీనాథుని కర్తృత్వ విషయములో ఉభయ వాదముల బలాబలములను నిర్ణయించుటకు గూడ ఇది సహాయపడగలదు.

ఎంతో శ్రద్ధగా కూర్చినా ఈ కోశములో కొన్ని లోపములు దొరలక పోలేదు.

(1) ఏయే గ్రంథములకు ఏయే ప్రతులు గ్రహించిరో స్పష్టముగా సంపాదకులు తెలుపలేదు. కొన్నిటికి వివిధ ముద్రణములను గ్రహించినట్లు తెలిపినారు. కాని వానిలో భేద మున్నప్పుడు దేనిని ప్రమాణీకరించిరో తెలుపలేదు. 'ఉదా: భీమఖండమునకు రెండు ప్రతులు గ్రహించితిమనిరి. ఒకటి క్రొత్తపల్లి వారిది, రెండవది వావిళ్లవారిది. 'పాఱు' అను పదము క్రింద ఇట్లున్నది.

'సంతతముఁ బాఱు వేణికా సారణులయందు. భీమ. 2—53'

క్రొత్తపల్లివారి ప్రతి పాఠ మిట్లున్నది.

నారికేళంబు బుట్ట నెన్నడిమి చాయ
దళములందును బోలె సంతతముఁ బాఱు
వేణికా సారణులయందు......'

కోశములో చూపిన పాఠము ఆ భాగమున చేర్చినచో అర్థవంతముగా నుండదు.

(2) హరవిలాసమునకు వావిళ్ల ప్రతిని అనుసరించితిమని తొలి పలుకులో అనిరి. 'దవ్వులన్' అను శబ్దముక్రింద ఇచ్చిన యాకరములలో

'అంతంత దవ్వుల నుండఁబంచి హర. 6-43'

అనునది ఇచ్చినారు.

మావద్దనున్న 1925 వావిళ్ల ప్రతిలో ఆ పద్యమే లేదు. శ్రీ లక్ష్మీరంజనముగారి సంపాదకత్వమున వెలువడిన అకాడెమీ ప్రతిలో ఆ పద్యమున్నది. కనుక ఆ ఆకరము తొలిపలుకులో తెలిపినట్లు వావిళ్ల ప్రతినుండికాక అకాడెమీ ప్రతినుండి గ్రహించియుండవలె. కాబట్టి ప్రతుల సాంకర్యము కలిగియుండవలె.

(3) 'అతఁడు' అను అర్థముగల సర్వనామముగా అర్ధబిందు సహితమ్మైన 'వాఁడు' 'వాఁడ' మాత్రమేకాక అర్ధబిందురహితముగాగూడ 'వాడు వాడ' అనువానికి ఆకరము లీయబడినవి. మొదట చూచి తెల్లవోయితిమి. మరి మరి పరిశీలింపగా అవి శ్రీ ఉమాకాన్తముగారు ప్రచురించిన పలనాటి వీరచరిత్రములోనివని తేలినది. ఆ ప్రతిలో అరసున్నలు పాటింపలేదు. ఈ చిక్కునుగూర్చి సంపాదకులు ప్రస్తావించిరికాని వారి నిర్ణయము తృప్తిగా కనబడదు. ఈ కోశమునుబట్టి నిఘంటుకారులును, వ్యాకర్తలును ముందు ముందు 'వాడు, అతడు' ఇత్యాదులు అర్ధబిందురహితముగా ప్రథమ పురుషైక వచనార్థములో గ్రహించి శ్రీనాథుని ప్రమాణీకరించి నవీన వ్యాకరణ రచనకు తలపడు ప్రమాద మేర్పడగలదుగదా!

ఇటువంటి కోశములు సంగ్రహించుటలోనే కాక అచ్చులోకూడా నిర్దుష్టముగా ఉండేటట్లు శ్రద్ధ వహించుట అత్యవసరము. పైన కరబరచినవి కాక అచ్చుతప్పులుకూడ కోశములో ఎన్నో కానవచ్చినవి. ఇటువంటి మహాగ్రంథములను సమీక్ష చేయుటలో ఆమూలాగ్రము పరిశోధన చేయుట సాధ్యపడదు. కావున అక్కడక్కడ మాత్రమే పరిశీలింప సాధ్యమైనది. చూచిన చోటుల నెన్నో తావులందు ఈకోశము సంపన్నముగా నిర్దుష్టముగా కూర్చబడియుండుటచూచి హర్షించితిమి. కాని యాదృచ్ఛికముగా చేసిన పరిశీలనమునందే పై నుదాహరించిన దోషములు కనిపించినందున, ఇంకా ఎన్నో దోషములు దొరలియుండునని ఊహించుట అన్యాయము కాదు. ప్రామాణికములైన ఇట్టి కోశములలో ఒక్క దోషము కూడ కనబడరాదను మహాశయముతో పై వాని నుదాహరించినాము.

ఈ కోశము వెల గ్రంథములో ఎక్కడను లేదు. ఆం. ప్ర. అకాడెమీవారు ప్రచురించిన మరి కొన్ని గ్రంథములకు గూడ అట్టి లోపమే కనిపించినది. అకాడెమీ వెల నిర్ణయించుట ఐన ఖర్చులన్నీ లెక్కవేసిననే కాని సాధ్యపడకపోవచ్చు గాక! చిక్కు

తెన్నియైనను వెల నిర్ణయించి గ్రంథముతో కలిపి ప్రచురించుట యుక్తతరము. ఈ విషయములో అకాడెమీ కార్యకర్తలు ముందు జాగరూకత వహించుట యుక్తమని సూచించుచు ఈ బృహత్కోశము ప్రచురించినందుకు ఆం. ప్ర. సాహిత్య అకాడెమీవారిని అభినందించుచున్నాము.

అకాడెమీవారు ఇప్పటికి తలపెట్టిన పద ప్రయోగ కోశములలో ముఖ్యముగా (1) ఎఱ్ఱయ (2) పాల్కురికి సోమనాథుడు (3) నాచనసోమన లేకుండుట ఎంతో లోటుగా కనిపించుచున్నది. పోతన కూడా వారిలో చేర్చదగినవాడే. పై కవుల పద ప్రయోగ కోశములు లేకుండ ఆంధ్ర నిఘంటువులు గాని వ్యాకరణములు కాని సాధ్యము లగునా?

చిదమ్బర మాహాత్మ్య వేదపాద స్తవములు

(ఆంధ్రతాత్పర్య సహితములు)

(సంపాదకులు ప్రకాశకులు శ్రీ దర్భా సూర్యనారాయణ, సివిలు ఇంజనీరింగ్ ప్రొఫెసరు, అన్నామలై యూనివర్సిటీ, చిదంబరము (తమిళనాడు) క్రౌను $\frac{1}{8}$ పే. 610 లు. వెల రు. 12—లు.)

స్కాందమున సనత్కుమార సంహితలో మహేశ్వర నంది సంవాదరూపముగా ఉన్న ఈ చిదంబర మాహాత్మ్యమును ఉద్ధరించి రెండు వేదపాద స్తవములతోచేర్చి వానికికూడ తాత్పర్యము వ్రాయించి సంపాదకు లీ గ్రంథము ప్రకటించినారు.

వీనిలో చిదంబర మాహాత్మ్యము 26 అధ్యాయములలో $1444\frac{1}{2}$ శ్లోకములుగా ఉన్న మహా గ్రంథము. ఇది ఎక్కువ భాగము అనుష్టుప్పులలో ఉన్నది. ప్రతి యధ్యాయము ప్రారంభమునను సాధారణముగా శార్దూల వృత్తములో అధ్యాయ విషయ సంగ్రహమున్నది. అది సంహితలో భాగముకాదు. ఎవరో తర్వాత చేర్చినది.

ఇతర మాహాత్మ్య గ్రంథములవలెనే ఇదియు ఆరంభమై అంతమగుచున్నది కాని తాండవమహిమ కథనము, దేవదారు వనచరితము, ఆనంద నర్తన దర్శనము అనే 11, 12, 13 అధ్యాయములలో ఉత్తమ కవితాస్థాయి నందుకున్నది. దేవదారు వనవిహారమిందు, కొన్ని ఇతర గ్రంథము లందువలె గాక, శృంగారము మితిమీరక, మనోజ్ఞముగా ఉన్నది. ఇక ఆనంద నర్తన సందర్శనము అద్భుతానందావహముగా ఉన్నది. ఇది విష్ణువు చూచిన తాండవము. ఆనందతాండవ దర్శనమును గూర్చి గ్రంథమం దంతటను ప్రశంస లున్నను ఈ యధ్యాయము చదివినప్పుడే కాని దాని పరమాద్భుత స్వరూపము హృదయమునకు హత్తుకొనదు.

13 వ అధ్యాయము వంటిది 17 వ అధ్యాయము మరొక రమ్య విధానముతో, దీనిలో వ్యాఘ్రపాద పతంజలులు ఇతర మునులు సందర్శించిన ఆనందతాండవము వర్ణింపబడినది.

'అథ మోహస్య జననీ జగత్సంసార కారిణీ
మాయాయవనికా మున్యో రపనీతా దయాలునా॥
తతః ప్రాదు రభూత్తేజః సహస్రార్క సమప్రభమ్
సహస్ర చంద్ర సంకాశం యోగి హృత్పద్మ గోచరమ్॥
చర్మచక్షు రనిర్గ్రాహ్యం తత్తేజః సము జ్జృంభత
తస్య తేజోవితానస్య మధ్యే నిక్షిప్త వైభవమ్॥
శాంతం చిదంబరే రూపం శైవ మావి ర్బభూవహ.॥

(పే. 251—252)

స్వామి పార్శ్వమున ప్రత్యక్షమైన శివకామ సుందరి రూప మిట్లు వర్ణితమైనది.

'స తటిద్ఘన సచ్ఛాయ హల్లకోజ్జ్వల కుంతలామ్
సిందూర తిలకోద్భాసి ఫాల పట్ట విరాజితామ్॥
సౌందర్య సింధు లహరీ సదృక్షభ్రూవి భూషితామ్
నిశాతశంబరారాతి శర వారిజ లోచనామ్...'

(పే. 256)

ఇత్యాదిగా సరళ వాక్కులతో ఉదాత్త మనోహర భావనలు కలిగించి శ్రోతలను ఉదాత్త కవితాకాశ వీథులలో విహరింపజేయు రచన.

శూన్యమని కొంత పేళనతో కలసి లోకములో ప్రసిద్ధి నొందిన 'చిదంబర రహస్యము' 18 వ అధ్యాయములో వర్ణింపబడినది. ఆ రహస్యమును నటేశుడు విష్ణ్వాదిసురలకు ఇట్లుపదేశించెను :

'శృణుతోపనిషద్గీతం స్థానం చైత చ్చిదంబరమ్
జ్ఞానమేవ మమ స్థానం తచ్చ మాం నైవ ముంచతి॥
శరీరి ణ్యాత్మని యథా స్థితోఽహం విమలాకృతిః
తథా ప్రపంచ దేహేస్మిన్ విహారామి చిదంబరే॥
తస్య జ్ఞానస్య పర్యాయః చిచ్ఛబ్దః స్మర్యతే బుధైః
చితోశ్చైతన్య రూపాయా శ్చాంతరం తచ్చిదంబరమ్॥
తస్మా ద్భూమి హృదంతస్థం పుండరీకాంతర స్థితమ్
దహ్రం విపాపం గగనం చిదంబర మిహోచ్యతే॥

(పే. 275, 276)

ఆ పిమ్మట

'వేదాగమేషు ప్రథితా సభా కాప్యస్తి కాంచనీ
సురాసుర మనుష్యాణా మలక్ష్యా సా చిరంతనీ'

(పే. 277)

కాబట్టి యోగులకే కాని ఇతరులకు చిదంబరములో నటరాజ దర్శనము ప్రత్యక్షముకాదు. కనుక శూన్య స్వరూపము. ఈ భాగములో తైత్తిరీయోపనిషత్తులోని నారాయణీయమని ప్రసిద్ధికల భాగములోనుండి 'దహ్రం విపాపం పరమేశ్మ భూతం యత్పుండరీకం పురమధ్యసంస్థం ... యఃపర స మహేశ్వరః' అనుచు, పరమహంస పరివ్రాజకులకు వందనము చేయుటలో నిత్యము ప్రయోగింపబడుచున్న మంత్రభాగములే చిదంబర పరమ రహస్యముగా రూపొందినదని గ్రహింపవచ్చును. యోగులు హృదంతరములలో దర్శింపబడు దహరాకాశమే, బాహ్యజగత్తులో చిదంబర రహస్యస్థానమని ఆంతర్యముగా తోచుచున్నది.

నటరాజ తాండవ దర్శన మిచ్చిన స్థానమును

'తతస్తామభిత స్తప్తైః
శుద్ధైః పట్టైస్తు కాంచనైః
బద్ధ్వా పునర్నవీ చక్రుః
శ్రేయసే జగతాః సురాః

(పే. 278)

అందువలననే ఆయన కనక సభాపతి !

భరతభూమిలో పుణ్యక్షేత్రములన్నీ ఇట్లే వెలసినవి. భగవల్లీలలు లోకమంతటా చూడదగినవే యైనను వ్యాఘ్రపాద పతంజల్యాదులు నటరాజ తాండవము దర్శించిన స్థానము చిదంబర పవిత్రక్షేత్రమై వెలసినది.

ఇందలి 26 అధ్యాయములలో, 1–16 అధ్యాయములు ప్రథమ భాగమనీ 17–26 ద్వితీయ భాగమనీ తోచును. 16 వ అధ్యాయము చివర 'ఇతి ప్రథమో భాగః' అని ఉన్నట్లే 26 వ అధ్యాయము చివర 'ఇతి ద్వితీయో భాగః' అని ఉండవలసినది. ఎందువల్లనో లేదు.

గ్రంథాంతమందు పే. 563, 564 లలో ప్రస్తుతము చిదంబరములో జరుగుచున్న నిత్యపూజలు, ఉత్సవములు, మహాభిషేకములు, మహోత్సవములు సంపాదకు లిచ్చినారు. కాని అవి ఈ సంహితలో 25, 26 అధ్యాయములలో సింహవర్మ నియమించిన మహోత్సవములతో సరిపోవుట లేదు. ఎక్కువ భాగము లోపించినవి. చిదంబరక్షేత్ర నిర్వాహకులకు ఈ లోపము నిరూపించి వాని నన్నిటిని యథావిధిగా జరిపించినప్పుడే కాని సంపాదకులు ప్రచురించిన ఈ గ్రంథము ప్రయోజనకారి కానేరదు. అంతకు పూర్వమున్న అధ్యాయములలో పుష్య పూర్ణిమనాడు పతంజలి వ్యాఘ్రపాదాదులు నటరాజ నాట్య సందర్శనముచేసి మహోత్సవము చేసిరని వర్ణింపబడినది. అట్టిపుణ్య పుష్య పూర్ణిమనాడుకూడ మహాభిషేకముగాని మహోత్సవముగాని జరుపకుండుట చూడగా, కార్యకర్తలకు స్కాంద వచనమందు ప్రామాణ్యముకలదా అని మాంబోట్లము శంకించ వలసి యున్నది.

ప్రథమ భాగముగా నిర్దేశించిన మాహాత్మ్య గ్రంథమునకు తాత్పర్యము వ్రాసిన శ్రీ శ్రీ పాద వెంక

పేశ్వర్లుగారు ఎంతో జాగరూకతతో సులభగ్రాహ్యముగా రచన చేసినారు. అక్కడక్కడ సకృత్తుగా అభిప్రాయభేదములకు తావున్నది. ఒక్క ఉదాహరణము.

26 అధ్యాయములో వరుణుడు స్వామి దయ చేత పాప విముక్తుడైన ఘట్టములో అది జరిగినది. 'మాఘ మఘే' అని చెప్పబడినది. దానికి తాత్పర్యములో 'మాఘమాసమందు' అని వ్రాసినారు. (పే. 417). 'మాఘ పూర్ణిమయందు' అని వ్రాయుట యుక్తతరమని సూచించుచున్నాము. మఘ శబ్దమునకు 'మాసము' అను నర్థము కనబడదు. 10 వ నక్షత్రము అనే అర్థములో అకారాంత స్త్రీ లింగమైన మఘాశబ్దమే కాక అకారాంత పుంలింగమైన మఘశబ్దము కూడ ఆప్టే నిఘంటు విచ్చినది. మాఘ పూర్ణిమనాడు చంద్రుడు నియతముగా మఘా నక్షత్రములో ఉండును. అది కాక అది సముద్ర స్నానమును విధించు ఘట్టము. పర్వదినమున గాని సముద్రస్నానము నిషిద్ధము గదా! కావున 'మాఘమాసమున మఘా నక్షత్రమందు, అనగా పూర్ణిమ నాడు' అని ఉండుట న్యాయమని తోచును. ఇట్టి అభిప్రాయ భేదములకు తావిచ్చిన సందర్భములు తాత్పర్యములో బహుస్వల్పసంఖ్యలో మాత్రమే ఉన్నవి.

చిదంబరక్షేత్ర మాహాత్మ్యము దర్శించిన ప్రధాన ఋషులు వ్యాఘ్రపాద పతంజలులు. జైమిని కూడ ఒకప్పుడు క్షేత్ర దర్శనము చేసి స్వామిని వేద పాద స్తవముతో స్తుతి చేసినట్లున్నది. దానికి తోడుగా శ్రీ శంకరుల పేర ప్రసిద్ధమైన త్రిపురసుందరీ వేద పాద స్తవమునుగూడ చేర్చి ద్వితీయ భాగముగా తాత్పర్య సహితముగా ఈ సంపుటములో పచురించినారు. ఈ స్తవములలో ప్రతి శ్లోకము చివరి పాదములో ఏదో ఒక వేదమంత్ర ముండుటచేత వేదపాద స్తవములని పేర్లు ప్రసిద్ధమైనవి. వీనికి శ్రీ కొర్లి అనంతపద్మనాభశాస్త్రిగారు తాత్పర్యము వ్రాయుటేకాక, ఆయా శ్లోకములలో నిక్షిప్తములైన వేదమంత్రములు ఏవేద సంహితలో ఎక్కడ వచ్చునో వివరము లిచ్చినారు. ఇది బహుకష్టసాధ్యమైన కార్యము. ఇందుకు వారు సాంగ ఋగ్వేద నిష్ణాతులగు ఆచార్య గోడా సుబ్రహ్మణ్య శాస్త్రిగారియు, కృష్ణయజుర్వేదవిదులగు శ్రీ లంక వెంకటరామ సోమయాజులయు, మీమాంసా విద్యా ప్రవీణులగు శ్రీ రేమిళ్ల సూర్యప్రకాశశాస్త్రిగారలయు సహాయము పొందినట్లు తెలిపిరి. అది యెంతయు శ్లాఘ్యము.

జైమిని స్తవములో 125 శ్లోకములును శంకరుల స్తోత్రములో 108 శ్లోకములును కలవు. మొదటిదానిలో 2,44,81,82 లకును, రెండవ దానిలో 91 వ దానికిని వేదమూల సంఖ్యాదు లీయ లేదు. అందులో రెండిటికి (1 లో 81, 82) వేదాధ్యయనము నామమాత్రమే చేసిన మాబోంట్లకే తెలిసిన భాగము లగుటచే వ్రాతలోనో అచ్చులోనో వచ్చిన ప్రమాద పతితలోపములుగా భావించుచున్నాము. అవి తప్పొప్పుల పట్టికలో చేర్పదగినవి.

ఇట్టి పుణ్యగ్రంథ ప్రకటనమునకు పూనుకొనిన శ్రీ దర్భా సూర్యనారాయణ దంపతులకు శ్రీ శివకామసుందరీ సహిత నటరాజస్వామి ప్రసన్నుడగు గాక!

ఈ గ్రంథమునకు వెల రు. 12/-లుగా నిర్ణయించినారు. విస్తృతిని బట్టి ఎక్కువ కాదు కాని ఇట్టి గ్రంథములు అభిమానించి కొనగలవారి శక్తిని బట్టి సగము తగ్గించిన బాగుండెడిదని సూచించుచున్నాము.

శ్రీ నోరి నరసింహశాస్త్రి.

వాఙ్మయ సమాలోచనము

(రచన: కాళూరి హనుమంతరావు. వెల—నాలుగు రూపాయలు. ప్రతులు: కె. వి. శేషుబాయి. OU B/F 7, University Campus. Hyderabad—7 (A P)

సాహిత్య విమర్శ ఒక కళ. కళగానే దానిని ఉపాసిస్తున్న నవ్యులలో శ్రీ కాళూరి హనుమంతరావు గారు వ్రాసిన 12 సాహిత్య విమర్శ వ్యాసాలు ఈ గ్రంథంలో వున్నాయి. నూటపాతిక పుటలున్న ఈ

చిన్న పుస్తకం సాహిత్యాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలో సోదాహరణంగా తెలుగు పాఠకుల ముందుంచుతూంది.

సాహిత్య విలువలు పూర్తిగా లుప్తమైపోయాయంటూ ఆధునిక సాహిత్యాన్ని ధ్వన్యాలోకాది ప్రాచీనాలంకారిక గ్రంథాల కొలబద్దలతోను పరిశీలించేవారికీ, పాతదంతా సమాజపీడకుల్ని కీర్తిస్తున్న పడుపు సాహిత్యమని నిరసించే విపరీత విప్లవవాదులకీ కూడ భిన్నమైన కొంత సమన్వయదృష్టి శ్రీ హనుమంతరావుగారి వ్యాసాలలో కనిపిస్తుంది. కొంత అనడం నిరుద్దేశం కాదు. ఆధునిక సాహిత్య ధోరణులతో పరిచయంవున్నా, సమన్వయ దృక్పథం కనబరచినా శ్రీ హనుమంతరావుగారు సాంప్రదాయిక సమాలోచన పద్ధతులను పక్కకుపెట్టి శాస్త్రీయమైన పంథాను చేపట్టలేక పోయేరు. ఫలితంగా వారి విమర్శలలో ఆధునిక సాహిత్యంయెడ కొంత విశాలమయిన సహన భావమే కనిపిస్తుంది.

ఈ సంపుటిలో మొదటి వ్యాసం 'కవిత్వంలో అస్పష్టత'ను నవ్యకవులు ఒకటికి రెండు మార్లు పర్యాలోచన చెయ్యడం అవసరం.

దీనిలో ఒకచోట—అనుభూతిని స్పష్టంగా మాటలలో చెప్పడం సాధ్యమా?' యని ప్రశ్నించుకొని శ్రీ హనుమంతరావుగారే సాధ్యం కాకపోతే చెప్పడమే అనవసరం—అని సమాధానం ఇస్తారు. అయితే చెప్పడం సాధ్యమేనా? నిజంచేత దానికి కొన్ని పరిమితు లున్నాయి. వానిలో ముఖ్యమైనది భాష. మన ఆలోచనలతో సమంగా భాష పెరుగుదల వుండదు. భాష మొత్తంమీదా, వ్యక్తిగతంగా కవిలోనూ కూడ ఆ లోపం వుంటుంది. అదొకటి చమత్కారానికో, కొంటెతనానికో, స్పర్ధకో, మాటల గారడీకో అస్పష్టత, సంక్లిష్టత చొప్పించడం వుంటుంది. ఇవి గాక కొన్ని రాజకీయ, సాంఘిక సంఘర్షణల ఫలితంగా బుద్ధిపూర్వకంగా అస్పష్టతనో, సంక్లిష్టతనో చొప్పించడం వుంటుంది. ఇటువంటిచోట్ల ప్రకరణం నిర్దిష్టార్థ సూచకం అవుతుంది.

శక్తిగ్రహం వ్యాకరణోపమాన
కోశాప్త వాక్యాద్వ్యవహారతశ్చ
వాక్యస్య శేషా ద్వివృతేర్వదంతి
సాన్నిధ్యత స్సిద్ధపదస్య వృద్ధా.

అన్నది వైయక్తిక పదప్రయోగ సందర్భంలోనే చెల్లుతుంది. ఆ పరిమితిని అధఃకరించే సందర్భాలు ఆధునిక సాహిత్యంలో బహుళంగానే కనిపిస్తున్నాయి.

అయితే హనుమంతరావుగారే రెండురెళ్లు నాలుగనే ఎక్కాలబుక్కు ప్రమాణానికి తీసుకురాకూడదనీ, పతిత వూహకి అందేవరకు కవిత్వంలో అస్పష్టత వుండవచ్చు. ఎంత వూహించినా ఎవరికీ ఏమీ తెలియకపోయేంత అస్పష్టత అభిలషణీయం కాదనీ చూపిన సమన్వయ దృక్పథం అభినందనీయం. లేకపోతే సాహిత్య రచన ప్రయోజనమే లేకుండాపోతుంది కదా.

పదానికీ అర్థానికీ గల సంబంధం చర్చిస్తూంది దీనిలోని రెండో వ్యాసం 'వాఙ్మయ సమాలోచనం.' 'పదమునకూ దాని అర్థమునకూ గల సంబంధం కొంత చలనశీలమైనదని తోస్తుంది. భాష పరిణామశీలమై ప్రవాహగమనం కలిగినట్టిది'—అనే రచయిత అభిప్రాయాలను అందరూ అంగీకరిస్తారు.

అయితే భాష మానవుని నిత్యవ్యవహార రంగంలోకి వచ్చేసరికి రెండు పరస్పర విరుద్ధ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భాష ద్వారా సర్వానుభూతులనూ చెప్పవచ్చుననే దొకటి. భాష మానవుని సర్వానుభూతులనూ చెప్పలేదనేది రెండోది. వీనిని హనుమంతరావుగారు దృక్పథ భేదం అంటారు. మొదటిది విద్వత్సమ్మతమూ, రెండోది లోకులు సాధారణంగా అనుకొనేదీ అని.

అనుభూతిని పొందకలిగే మనశ్శక్తి, ఆ అనుభూతిని చెప్పడానికి అనువైనభాష, ఆ వ్యక్తీకరణకవసరమైన భాషాజ్ఞానం—ఇవి దేశకాల పాత్రానుమేయాలు కాని విశుద్ధసత్వాలు కావు. అందుచేతనే భాషను సృష్టించిన మానవుడికే భాషా దారిద్ర్యం అనే

వైరుధ్యం ఏర్పడింది. ఈ వైరుధ్యం యధార్థం. అంతేగాని దృక్పథభేదం అనుకోడం సమస్యను గంద్రగోళపరుస్తుంది.

'కొందరు ఆధునిక రచయితలు సాహిత్యాన్ని సమకాలిక సమాజాన్ని మరామత్తు చేయడానికి ఆయుధంగా వుపయోగించాలని అంటున్న అభిప్రాయం పరిశీలనార్హం'—అంటారు 'సాహిత్యం—సమాజం' అన్న వ్యాసంలో, రచయిత దానిలో వీరేశలింగం పంతులుగారి ప్రహసనాలు విదేశీయులకు మన సమాజం గురించి తక్కువ భావం కలిగిస్తాయనే శ్రీ వల్లూరి జగన్నాథరావుగారి విమర్శిస్తూ, పుండుకు చికిత్స చేయాలిగాని దాచకూడదన్న పంతులుగారి సమాధానాన్నీ ఉటంకరించి 'వీరేశలింగంగారి వుద్దేశం మంచిదేగాని, జగన్నాథరావుగారి అభిప్రాయంలోనూ నిజం లేకపోలేదు'—అంటారు రచయిత. 'సంఘ సంస్కరణ దీక్షతో రచయితలు సంఘంలోని చెడునే తీసుకుని ఈ రచనలు సాగించేర'ని వ్యవహార ధర్మబోధిని, గణపతి, కన్యాశుల్కాలలోని కొన్ని పాత్రల వుదాహరణతో నిర్ధారణ చేసేరు.

గొప్ప విజ్ఞానవంతులయిన ఆ రచయితలు అల్లా ఎందుకు వ్రాసేరని ప్రశ్న వస్తుందని వూహించి 'తన అభిప్రాయం పఠిత మనస్సులో నాటడానికి సాధారణంగా రచయిత అతిశయోక్తుల నుపయోగిస్తాడ'ని శ్రీ హనుమంతరావుగారు అంటారు.

ఈ అభిప్రాయాలతో ఏకీభవించడం కష్టం. మాటల తేడా తప్ప ఆదికవికాలంనుంచి ఆధునిక రచయితవరకూ తమ అనుభవాలు చెప్పడం పేరునో, నీతిబోధ పేరునో, మరో పేరుతోనో చేసేది సమాజం మరమ్మతు సంకల్పాన్ని అమలు జరపడమే. అసలు సాహిత్యం పరమార్థం అదే.

కావ్యం యశసేఒర్థ కృతే
వ్యవహార విదే శివే తరక్షతయే.

—అనడంలో వుద్దేశం అదే కదా.

ఈ సాహిత్యం సమాజంతో పరిణతి పొందుతూ నూతన ప్రక్రియల్నీ, రీతుల్నీ, శైలుల్నీ, అలంకారాదులన్నీ కొత్తకొత్తవి చేర్చుకొంటూంది. పాతవి కొన్ని పోతాయి. కొన్ని మిగులుతాయి. నూతన సాహిత్యరీతులు వాస్తవికత, విమర్శాత్మక వాస్తవికత, సోషలిస్టు వాస్తవికత సాహిత్యరంగంలో పట్టం కట్టుకున్నాక అతిశయోక్తి అనవసరమే కాదు, అపహాస్యంగా తయారయింది. ఆ అలంకారం ఫ్యూడల్ సమాజపు సౌందర్యావగాహన. మన దేశంలో ఇంకా ఆ వాసన అంటు వదల్లేదు గనక Writers Exaggeration పేరుతో ఇంకా భరిస్తున్నాం. కాని, అది అపహాస్యం చెయ్యడానికీ, అసహ్యం కలిగించడానికీ సాధనంగా మాత్రమే వుపయోగించబడుతూంది.

రచయిత రచనా ప్రక్రియలో చిత్రించవలసినది జీవితాన్ని. జీవితం బహుముఖం. బహుళ ఛాయలున్నదీను. అల్లాగే రచయితలు ఆ జీవితాన్ని చూడడం, అర్థం చేసుకోడంలో వివిధ దృక్కోణాలు. రాజకీయం, సామాజికం, ఆర్థికం, సాంస్కృతికం. మళ్లీ అందులో అంతరువులూ, విభాగాలూను. జీవితాన్ని సమగ్రంగా చూడడం అన్నా ఆ ప్రత్యేక రచయిత దృక్కోణంలోంచే, ఆ దృగ్విభాగంలోంచే చూస్తాడు. చిత్రిస్తాడు. (అంతేగాని జీవితాన్ని సర్వసమగ్రరూపంలో చిత్రించడం అనే దానికి అర్థం లేదు.)

ఈ స్థితిలో రచయిత తన భావానికి వస్తుకల్పన చేయడంలో సర్వసాధారణ ఘటనలకి విశేష రూపం, విశేష ఘటనలకు సాధారణ రూపం ఇచ్చి, తన కథాగతికి తోడ్పడేవానినే ఏరుకుంటాడు. అమరుస్తాడు. ఇతరేతర ఘటనల ప్రాముఖ్యం ప్రధాన భావానికి ఉద్దీపన కలిగించేంతవరకే. దానిని అతిశయ చిత్రణ అనలేము. అతిశయోక్తి అనలేము. అది కుళ్లునో, కూటనీతినో ప్రదర్శించడమని వెలపరించుకోడంలో అర్థం లేదు. 'రచయితకి నైతికబాధ్యతా, నైతికావేశం చాలా అవశ్యకం' అన్న శ్రీ హనుమంతరావుగారి వాక్యం సర్వధా అభినందనీయం. కాని, ఒక్కటి గమనించాలి చెడు సాహిత్యం, సినీమాలూ సమాజానికి కలిగిస్తున్న' చెరుపు అని చెడుగును చూపించడంవలన కాదు. ఆ చూపించే పద్ధతీ, రీతిలో వుంది అసలు లోపం. ఆ

పద్ధతినే రచయిత ఎందుకు ఎన్నుకొంటున్నాడు అంటే— దానికిగల కారణాలూ, ప్రేరణాలూ వేరు.

వానిని తెలుసుకొనే అభిరుచి శ్రీ హనుమంత రావుగారికి లేదనీ, ఆ విషయంలో వారు పూర్తిగా సంప్రదాయవాదుల్నే అనుసరిస్తున్నారనీ, ఈ సంపుటి లోని 'సాహిత్య భవితవ్యం' చదివితే తెలుస్తుంది.

'సాహిత్యం తిరిగి ఔన్నత్యం పొందాలంటే మనిషి జీవితంలో రుచీ, విలువలూ ఏర్పడాలి. శాస్త్ర విజ్ఞాన ప్రభావం ఇప్పుడు ఉద్ధృతంగా వుంది. ఈ ఉద్ధృతి, పొలపొంగు తగ్గాలి...గతించిన పద్ధతులు తిరిగిరావు. కాని భవిష్యత్తులో మనిషి తిరిగి అంత ర్ముఖుడై తన ఆత్మ వికాసాన్ని సమీక్షించవచ్చును. వివిధ మూఢ నమ్మకాలతో మానసికంగా కకావికలైన హిందువులకందరికీ ఒక అధ్యాత్మిక దృక్పథాన్ని శంకరా చార్యులు ప్రసాదించినట్లు ప్రపంచంలో ముందు ముందు మహానుభావులుదయించి మనిషి జీవితంలోకి వెలుగులు ప్రసరింపజెయ్యాలి ...... అప్పటివరకూ సాహిత్యానికి మంచి భవితవ్యం వుంటుందని తోచదు.' (పుటలు 58—59)

'శాస్త్ర విజ్ఞాన సాహిత్యాలకి సహజవైరుధ్యం' లేదనే విషయాన్ని రచయిత గుర్తిస్తున్నారు. కాని, 'ఎన్నోవేల ఏళ్ళుగా సంపాయించుకొన్న జీవిత రుచులన్నీ శాస్త్ర విజ్ఞాన ప్రభావంవల్లనూ, నాగరికతవల్లనూ ప్రభంజనంలో ఎండుటాకులు ఎగిరి పోయినట్లు ఎగిరిపోతున్నాయి.' అంటారు, పక్కనే.

సాహిత్యపు విలువలు పడిపోయాయనే వారి వాదాన్నే హనుమంతరావుగారూ పునశ్చరణ చేస్తున్నా రనేది అల్లావుండగా శాస్త్రవిజ్ఞానానికీ సాహిత్యానికీ లేదనే వైరుధ్యాన్ని పక్కపక్కనే అంగీకరిస్తున్నారు. అంగీకరించినవారు ఆ వైరుధ్యం ఏ పరిస్థితులలో వచ్చింది? ఈ నూతన పరిస్థితులలో మానవుడు 'అంతర్ముఖుడై ఆత్మవికాసాన్ని సమీక్షించుకొనే' స్థితి ఎల్లా తటస్థపడుతుంది?—అనే ఆలోచన చూపించరు. అందుచేత, శ్రీ హనుమంతరావుగారి ఆశాభావం కేవల నిర్వేద జనితమేనా కావాలి. అర్థ రహితమేనా కావాలి.

వాదంకోసం సాహిత్య స్థాయి దిగ్గిపోయిందనీ, దానికి నాగరికత శాస్త్ర విజ్ఞాన ప్రభావ ఫలితంగా మానవ జీవితం యాంత్రికం కావడమే కారణమని శ్రీ హనుమంతరావుగారి అభిప్రాయాన్ని ఒప్పుకొన్నా దానినుంచి బయటపడేమార్గం చెప్పాలే! మనిషి అంత ర్ముఖుడు కావాలంటే జీవితానందాన్నీ అనుభవించాలి. ఆలోచన పర్యాలోచనలకు విశ్రాంతీ కావాలి. అవెల్లా లభ్యం అవుతాయి?

ఒక్కటేమార్గం, సమాజం ఉన్నచోట ఉండదు. శాస్త్ర విజ్ఞానాన్ని ఇంకా ఇంకా పెంపొందించి, జీవితావసరాల సృష్టిని ఇంకా యంత్రమయంచేసి మనిషి విరామాన్ని సాధించాలి. గతానికి పోలేమని శ్రీ హను మంతరావుగారే ఒప్పుకొంటున్నారు. ఇంక అదొక్కటే మిగిలింది. అది సాధ్యమేనా అని ప్రశ్నించొచ్చు. ఆ ప్రశ్నకు సమాధానం 50 ఏళ్ల క్రితం గణితశాస్త్రం ద్వారానే కాని లభ్యం కాలేదు. కాని, నేడు స్పష్ట మైన ప్రత్యక్షోదాహరణ వుంది. సోషలిజం ఒక్కటే ఆ స్థితిని తీసుకురాగల మొదటి మెట్టు.

ప్రస్తుత స్థితికి కారణం శాస్త్ర విజ్ఞానం కాదు. నాగరికతా కాదు. వాని పురోగమనానికి ఆటం కంగా తయారయిన సమాజ వ్యవస్థది. ఆ విషయాన్ని గుర్తించనంతవరకూ సాహిత్యంలో వచ్చిన మార్పుల్నీ, వస్తున్న మార్పుల్నీ గుర్తిస్తామేగాని, అర్థం చేసుకో లేము. మన కింక మిగిలేది ఏ 'భాషా శంకరుడి' అవ తరణకోసమో వ్యర్థ నిరీక్షణే.

'నేటి తెనుగుభాషను గురించి కొన్ని ఆలోచన ల'నే చిట్టచివరి వ్యాసంలో కూడా శ్రీ హనుమంత రావుగారు ఒక ముఖ్యవిషయాన్ని చర్చకు తెచ్చేరు. ఇదీ వేళ చాల అత్యవసరమైన ఘట్టం. తెలుగుదేశంలో నేడు ప్రజలు మాట్లాడే మాండలికాలన్నీ సమన్వయం కాగల రాష్ట్ర వ్యావహారికభాష రూపొందుతూంది. అదింకా ఒక స్థితికి రాలేదు. అలాగని మాండలికాలు పోవు. కనీసం సమీప భవిష్యత్తులో.

రూపొందుతున్న వ్యావహారిక తెలుగుభాషకు సంస్కృతభాష ఎంతవరకు తోడ్పడగలదో ఆలోచించవలసిందే. నిర్మొగమాటంగా చెప్పాలంటే మనకీనాడు కావలసింది జీవద్వ్యాదేశిక భాషలతో అధిక సంబంధం. ఆ దృష్టి లేకపోతే, ఇదివరకు భాషాభివృద్ధికి సంస్కృతం తోడ్పడినా ఇకముందు క్షీణింపచేస్తుంది. ఇతర భాషాపదాలను నిశ్శంకంగా స్వాయత్తం చేసుకొనే మనస్స్థితి తెనుగువాడిది. దానికి విజ్ఞానవేత్తలు పుష్టి నివ్వాలిగాని, ఏకదేశ గతం చెయ్యడానికి ప్రయత్నించకూడదు.

పైన పేర్కొన్నవేగాక కథానికా శిల్పం మొదలైనవి, తిలక్, ధూర్జటి, తిక్కనల కవితా సమాలోచనలూ, రామాయణ పరిశీలన వ్యాసమూ చదవలసినవి వున్నాయి, దీనిలో.

'చెప్పదలచింది చాలా వివరంగా, విశదంగా, గజిబిజి లేకుండా, నిర్దుష్టంగా చెప్పగల సమీక్షకులలో హనుమంతరావుగారొకరు.'—అన్నారు. సంజీవదేవ్, 'పరిప్రేక్ష'లో, ఏమీ సందేహం లేదు.

సాహిత్యాన్ని సృష్టించేది వ్యక్తులే అయినా సమాజ స్థితి గతుల ప్రభావం ఆ వ్యక్తి సంస్కారం, ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. నైతిక బాధ్యత, నైతికావేశం అన్నవి సమాజంతో వ్యక్తికిగల సంబంధాన్ని తెలుపుతాయి. కనక మనకు, సాహిత్యాన్ని సమాలోచించ బోయేటప్పుడు సామాజికావగాహన నిశితమైనది కావాలి, ఆ అవగాహన సమాలోచనకు పునాది కావాలి. దానిని మినహాయించినప్పుడు మన ప్రజ్ఞాపాటవాలు ఆలోచనలను పక్కదారికి పట్టిస్తాయి. లేదా గంద్రగోళంలో పెడతాయి. ఆ ప్రమాదానికి లోను గాకుండా తప్పించుకోడానికి ప్రతి సాహిత్య విమర్శకుడూ నిరంతర కృషి చెయ్యాలి.

సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలను చర్చకు తెచ్చిన శ్రీ కాళూరి హనుమంతరావు గారికి నా అభినందనలు.

'అవంతి'.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd. by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1. Editor : S. Radhakrishna.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/–	రు. 150/–
2 లేక 3 వ కవరు పేజి ...			
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/–	రు. 125/–
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/–	రు. 100/–
అర పేజి	...	రు. 65/–	రు. 55/–
పావు పేజి	...	రు. 40/–	రు. 35/–

ప్రత్యేక స్థానములకు 25% అదనం,

సం॥నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12–00
6 మాసముల చందా	...	రు. 6–00
విడి ప్రతి	...	రు. 1–00

మేనేజరు, భారతి

మద్రాసు–1.